thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 30 కరీంనగర్ గురువారం, 10 ఏప్రిల్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ మెమోరియల్ వద్ద నిర్వహించిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పుతోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.



## సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన సీఎం రేవంత్

గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్లో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి ముఖ్యమంత్రి ఏ రేవంత్రెడ్డి హాజర య్యారు. ఆయనతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా కూడా సీడబ్ల్యూసీ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబర్మతీ ఆశ్రమాన్ని సీఎం బృందం సందర్శించింది. మహాత్ముడికి నివాళులు అర్పించారు. అక్కడే సీఎం రేవంత్ రెడ్డి చరఖా తిప్పి నూలు వడికారు.

అక్కడి ఫోటో ఎగ్జిబిషన్ను ఆసక్తిగా తిలకించారు. గాంధీ జీ చేతిరాతరతో రాసిన ఉత్తరాలను చదివే ప్రయత్నం చేశారు. అధికారులు ఆశ్రమ విశేషాలను సీఎం బృందానికి వివరించారు.

# డీసీసీలే ఇక సుప్రీం!. హస్తం పార్టీ తీర్మానం అమలయ్యేనా?



కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (ఏఐసీసీ) సమావేశాలు గుజరాత్ లోని అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం మొదలైన ఈ సమావేశాలు బుధవారం కూడా కొనసాగుతున్నాయి. ఈ సమావేశాల్లో పార్టీ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. జాతీయ స్థాయిలో పార్టీ అధ్యక్షుడి నేతృత్వంలోని ఏఐసీసీ కీలక నిర్ణయాలు తీసుకుంటూ ఉండగా.. రాష్ట్రాల్లో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)లు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. అయితే ఇకపై ఏఐసీసీలతో పాటు జిల్లా స్థాయిల్లోని డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)లు ఆయా నిర్ణయాలను తీసుకోవడం, వాటిని అమలు చేయడంలో కీలక భూమిక పోషించే దిశగా ఈ సమావేశాన్ని ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇదే విషయాన్ని పార్టీ అధ్యక్షుడి హోదాలో మల్లిఖార్జున ఖర్గే అధికారికంగా ప్రకటించారు. పీసీసీలకు చైర్మన్ ఉన్నట్లుగానే డీసీసీలకు కూడా జిల్లా స్థాయిలో చైర్మన్లు ఉంటారు. పార్టీకి సంబంధించి జిల్లా స్థాయి కార్యకలాపాలన్నీ దాదాపుగా డీసీసీ చైర్మన్ దిశానిర్దేశంలోనే జరగాల్సి ఉంది. ఇక స్థానిక సంస్థలతో పాటుగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ టికెట్లకు అభ్యర్థుల ఎంపికలో ప్రస్తుతానికి డీసీసీలకు ఎలాంటి పాత్ర లేదనే చెప్పాలి. స్థానిక సంస్థలు అది కూడా ఎంపీటీసీలు, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికలో వీరి పాత్ర ఓ మోస్తరుగా ఉన్నా... ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవుల ఎంపికలో వీరికి ఏమాత్రం పాత్ర ఉండటం లేదు. ఇక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థుల విషయంలో వీరి మాటను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోవడం లేదనే చెప్పాలి. డీసీసీ అంటే.... ఆయా జిల్లాల్లోని 10 మంది ఎమ్మెల్యేల్లో కనీసం ఓ ఎమ్మెల్యే స్థాయి గౌరవం కూడా దక్కడం లేదనే చెప్పాలి. మొత్తంగా డీసీసీ చైర్మన్లు ఇప్పటిదాకా ఉత్సవ విగ్రహాల కిందే లెక్క. అయితే తాజాగా ప్రతిపాదించిన సంస్కరణల ప్రకారం.. జిల్లా పరిధిలోని ఏ పార్టీ పదవి అయినా, ప్రజా ప్రతినిధుల ఎంపిక అయినా మొత్తం డీసీసీ చైర్మన్లదే తుది నిర్ణయం. ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఎంపిక మొత్తం డీసీసీల ఆధ్వర్యంలోనే జరగాలని కాంగ్రెస్ తీర్మానించింది. డీసీసీలు ఎంపిక చేసిన అభ్యర్థులే బరిలో ఉంటారు. మరి అలాంటప్పుడు పీసీసీ అధ్యక్షులు ఏం చేస్తారంటే డీసీసీలను సమన్వయం చేసుకుంటూ సాగుతారు. అంతేకాకుండా అన్ని హోదాల్లో పార్టీ నియమావళి పక్కాగా అమలు అయ్యేలా పీసీసీ పర్యవేక్షణ సాగుతుంది. వెరసి ఈ పరిణామం అమలు అయితే... పిసీసీల కంటే డీసీసీలు పవర్ సెంటర్లుగా మారతారని చెప్పవచ్చు. అంటే... ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కంటే కూడా డీసీసీ పదవులకే నేతలు ఆసక్తి చూపుతారు. చెప్పుకోవడానికి ఇదంతా బాగానే ఉన్నా.. పాత కాపులు తిష్ట వేసుకుని కూర్చున్న కాంగ్రెస్ లో ఈ సంస్కరణ అమలు సాధ్యమేనా అన్న ప్రశ్నలు అప్పుడు రేకెత్తుతున్నాయి. భారత రాజకీయ వ్యవస్థలో పార్టీ పదవుల కంటే కూడా ప్రజా ప్రతినిధులే పవర్ పుల్. డీపీపీగానో, పీసీసీగానో ఉండటం కంటే కూడా ఎమ్మెల్యే గానో, ఎంపీగానో కొనసాగేందుకే నేతలు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎమ్మెల్యే సీటు కోసం అవసరమైతే పీసీసీ పదవిని కూడా తృణప్రాయంగా వదులుకునే నేతలు చాలానే ఉన్నారని చెప్పాలి.

ఇక డీసీసీ అధ్యక్ష ప దవి అంటే... అదేదో ఆఫీస్ అటెండర్ మాదిరిగా పరిగణించే పరిస్థి తులు ఉన్నాయి. కనీసం ఎంపీపీలు, జడ్పీటీసీలు కూడా డీసీసీ అధ్యక్షు లను లెక్క చేయని పరిస్థితి చూస్తున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో గ్రాండ్ ఓల్డ్ పార్టీగా ప్రసిద్ధికెక్కిన కాంగ్రెస్ లో ఈ నూతన సంస్కరణ అమలు అయ్యేనా అన్న దిశగా అప్పుడే విశ్లేషణలు మొదలయ్యాయి. పార్టీ పదవులు అంటేనే లూప్ లైన్ పోస్టులు అన్న చందంగా పరిస్థితి మా రిన నేపథ్యంలో ఈ సంస్కరణ అమలు అసాధ్యమేనని కూడా చాలా మంది పెదవి విరుస్తున్నారు. మరి కాంగ్రెస్ పార్టీ ఈ నూతన విధానాన్ని అమలు చేస్తుందా?.. లేదంటే చేతులు ఎత్తేస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

# ప్రధాని మోదీ గడ్డపై.... తొడగొట్టిన రేవంత్!




## బీజేపీని అడుగుపెట్టనివ్వబోమంటూ సంచలన వ్యాఖ్యలు

అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున సమావేశమైనట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. గాడ్సే ఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబసభ్యులు, రాహుల్ గాంధీ గారి మిత్రులు, దేశ నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోదీకి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 'మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారు. వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారు. దేశ మూలల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేశారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. 'కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు చాలా హామీలు ఇచ్చారు' అని వివరించారు. రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం. కుల గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోదీ మైక్ ఇవ్వలేదు' అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ ఆదేశం మేరకు ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. 'మోదీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని యేటా 2 కోట్ల యువకులకు ఉద్యోగాలు రాలేదని తెలిపారు. గాంధీ ఆలోచనతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను.. మోదీని ఓడించాలని పిలుపునిచ్చారు. 'తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం. గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో వల్లభాయ్ పటేల్ వారసులతో మా ప్రజలకు సంబంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది. మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు తెలంగాణను సోనియా గాంధీ అందించింది' అని రేవంత్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. 'మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటాం వారిని ఎవరూ క్షమించరు' అని రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారని గుర్తుచేశారు. బ్రిటీషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు అని సంచలన ప్రకటన చేశారు. బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.




దిల్లీ: ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఏపీ, తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఆయా శాఖలకు కేంద్రహోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి 3న కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ 15 శాఖల అధికారులతో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. కేంద్ర రోడ్లు-ఉపరితల రవాణా, ఉక్కు, బొగ్గు గనులు, వ్యవసాయ, పెట్రోలియం, రైల్వే తదితర శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల ప్రతిపాదనలతో పాటు విభజన చట్టం ప్రకారం ఉన్న పెండింగ్ అంశాలపై చర్చించారు. ఆ సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను ఇటీవల ఏపీ, తెలంగాణ సీఎస్‌లకు కేంద్రహోంశాఖ పంపించింది. ఈ సమీక్ష సమావేశంలో అమరావతి-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి కేంద్రం పచ్చజెండా ఊపింది. డీపీఆర్ రూపకల్పనకు చర్యలు ప్రారంభించాలని కేంద్ర రోడ్లు, ఉపరితల రవాణాశాఖను హోంశాఖ ఆదేశించింది. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి అనుమతుల ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఏపీలో మరో రిఫైనరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో ఆ మేరకు పెట్రోలియం శాఖకు హోంశాఖ సూచనలు చేసింది. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ పనులు ముమ్మరంగా కొనసాగించాలని.. రెండేళ్లలో అక్కడి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రైల్వేశాఖను ఆదేశించింది. విశాఖ, అమరావతి, కర్నూలు, హైదరాబాద్ కారిడార్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయని.. దానిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గతంలో ఏపీలోని వెనుకబడిన ప్రాంతాలకు ఇవ్వాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నందున విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. తెలంగాణకు ఆ నిధుల విషయంపై నీతిఆయోగ్‌తో చర్చించాలని అధికారులకు హోంశాఖ సూచించింది.

**రెండు రాష్ట్రాలకూ ఊరట..** : 2014లో ఉమ్మడి ఏపీ విడిపోయి.. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన విషయం తెలిసిందే. అయితే.. ఆ తర్వాత.. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో.. విభజన చట్టంలోని చాలా సమస్యలు అపరిష్కృతంగానే ఉండి పోయాయి. అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా కేంద్రానికి పలు రూపాల్లో విన్నపాలు చేస్తూనే ఉన్నాయి.

# తెలుగు రాష్ట్రాలకు గుడ్‌న్యూస్

## విభజన చట్టంపై కూడా కేంద్రం కసరత్తు!

అయితే.. ఎట్టకేలకు.. తాజాగా కేంద్ర హోం శాఖ ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 9, 10లలోని సంస్థలు, ఆస్తుల విభజనపై కేంద్రం దృష్టి పెట్టింది. అదేసమయంలో ఉమ్మడి ప్రాజెక్టుల పూర్తికి కూడా.. ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో వడి వడిగానే ఈ సమస్యలు కొంతవరకైనా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత రెండు మాసాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆయా రాష్ట్రాల ప్రయోజనాలు పరిరక్షిస్తూనే.. విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతూ.. తాజాగా కేంద్ర హోం శాఖ నోట్ విడుదల చేసింది. షెడ్యూల్ 9లోని కార్పొరేషన్లు, కంపెనీల పంపకం అత్యంత కీలకంగా మారింది. అదేవిధంగా షెడ్యూల్ 10లోని సంస్థల విభజన(ఆర్టీసీ సహా ఇతర సంస్థలు)ను వేగంగా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే.. రెండు రాష్ట్రాల్లో చేపట్టిన వివిధ మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థల ప్రాజెక్టుల పురోగతిని కూడా కేంద్రం పరిశీలిస్తోంది.

అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధుల విషయంపైనా కేంద్రం క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తోం ది. ఈ క్రమంలో ఏపీకి 350 కోట్లు, తెలంగాణకు 270 కోట్ల రూపాయలను ఇవ్వనుంది. దుగ్గరాజపట్టం వద్ద పోర్టు నిర్మాణానికి, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కూడా త్వరలోనే మార్గం సుగమం కానుందని అధికార వర్గాలు చెబుతున్నారు. సో.. ఎలా చూసుకున్నా.. సుదీర్ఘ విరామంతర్వాత.. రెండు రాష్ట్రాల విభజన చట్టంలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం రెడీ అయింది.

చురకలు





# రేవంత్ పంపిన బిల్లుపై కేంద్రం చర్యలు తీసుకోవట్లేదు

అహ్మదాబాద్: దేశ సమస్యలు తీర్చాలంటే.. దేశాన్ని ఎక్స్‌రే తీయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దళితులు, ఆదివాసీల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. దళితులు, ఆదివాసీలకు న్యాయం జరుగుతోందా అనే ప్రశ్న తలెత్తుతోందన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదని రాహుల్ విమర్శించారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. "చనిపోయాక నా గురించి ప్రజలు ఏం ఆలోచిస్తారనేది అనవసరం. నేను అనుకున్న పనులు పూర్తి చేశాక ప్రజలు మరిచిపోయినా నాకు అభ్యంతరం లేదు. బీసీల రిజర్వేషన్లు పెంచుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిల్లు కేంద్రానికి పంపారు. రేవంత్‌రెడ్డి పంపిన బిల్లుపై కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. తెలంగాణలో కులగణనను విజయవంతంగా నిర్వహించారు. కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పంచేందుకు ప్రయత్నం చేస్తున్నాం. కులగణన వల్ల దేశంలో బీసీల సంఖ్య ఎంతో తెలుస్తుంది. కులగణన విషయంలో తెలంగాణ దేశానికి మార్గం చూపింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అంశాన్ని తొలగిస్తాం. తెలంగాణలో 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీలే ఉన్నారు. తెలంగాణ సంపదలో మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు తగిన భాగస్వామ్యం లేదు. వారి జనాభాకు అనుగుణంగా సంపదలోనూ తగిన వాటా అవసరం" అని రాహుల్ గాంధీ అన్నారు. "ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ ఒక్కొక్కటిగా విక్రయిస్తున్నారు. ఇద్దరు వ్యాపారవేత్తలకే వాటిని అప్పగిస్తున్నారు. ఎయిర్‌పోర్టులు, గనులు, సిమెంట్, స్టీల్ సహా కీలక పరిశ్రమలన్నీ ఓ పారిశ్రామికవేత్తకే కట్టబెడుతున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాజపా అక్రమాల ద్వారా గెలిచింది. ఆర్ఎస్ఎస్, భాజపా రోజూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. దేశంలో కులగణన చేపట్టాలని ప్రధాని మోదీని కోరాం. దీనికి ప్రధాని సహా ఆర్ఎస్ఎస్ తిరస్కరించింది. లౌకిక భావనకు ఆర్ఎస్ఎస్ వ్యతిరేకం. దళితుడైన రాజస్థాన్ పీసీసీ నేతను ఆలయానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. వక్ఫ్ సవరణ చట్టం మత స్వేచ్ఛపై దాడి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

**రాహుల్ హామీ.. తెలంగాణలో అమలు చేశాం: రేవంత్ రెడ్డి...** కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో భాజపాను ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకోవాలన్నారు. "ప్రధాని మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున సమావేశమయ్యాం. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో మనం ప్రయత్నిస్తున్నాం. రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అందులో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కులగణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉన్నట్లు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాట ప్రకారం అవన్నీ తెలంగాణలో అమలు చేసి చూపించాం" అని రేవంత్ రెడ్డి వివరించారు.



# నా జుట్టు విష్ణు చేతుల్లోకి ఇవ్వాలనే ఈ కుట్రలు

హైదరాబాద్: కుటుంబ వివాదంతో నటుడు మోహన్‌బాబు కుటుంబం తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట భైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. "నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా" అని మనోజ్ చెప్పారు. "పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. తెల్లవారుజామున విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీపై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండి" అని మనోజ్ విజ్ఞప్తి చేశారు. "నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడెక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీగా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా" అని మనోజ్ వ్యాఖ్యానించారు.



# వనస్థలిపురంలో తీవ్ర ఉద్రిక్తత
## బస్సుల అద్దాలు ధ్వంసం.. బైకులకు నిప్పు

హైదరాబాద్: వనస్థలిపురం కమ్మగూడలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కమ్మగూడ సర్వే నంబర్ 240లోని 10 ఎకరాల భూమి విషయంలో ప్లాట్స్ ఓనర్స్‌కి, పట్టదారులకు మధ్య గత కొద్ది రోజులుగా వివాదం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూ యజమానికి అనుకూలంగా కొద్దిరోజుల క్రితం హైకోర్ట్ తీర్పు ఇచ్చింది. దీంతో భూ యజమాని బుధవారం (ఏప్రిల్ 9) ఆ భూమిలో పనులు చేసుకుంటుండగా ప్లాట్ ఓనర్స్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో ప్లాట్స్ ఓనర్స్?, పట్టదారుల మధ్య వివాదం చేలరేగింది. ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని ఇరువర్గాలు పోలీసుల ముందే ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో బస్సుల అద్దాలు ధ్వంసం అయ్యాయి. ప్లాట్ ఓనర్లు ఆగ్రహంతో పలు బైక్?లకు నిప్పు పెట్టారు. బైకులు మంటల్లో పూర్తిగా దగ్ధమయ్యాయి. పరిస్థితి చేయి దాటుతుండటంతో అప్రమత్తమైన పోలీసులు.. ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఘటన స్థలంలో పోలీసులను మోహరించారు.

# 'మ్యాగ్జిమం టాక్సేషన్.. మినిమం రిలీఫ్'గా తయారైన కేంద్ర విధానం: కేటీఆర్



హైదరాబాద్: పెట్రో, గ్యాస్ ధరల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెంపుతో పౌరుల జీవితాలు అతలాకుతలం అవుతాయన్నారు. భూటాన్, శ్రీలంక, పాకిస్థాన్ కంటే భారత్‌లోనే పెట్రోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. "అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రో ధరలు కేంద్రం తగ్గించదు. కేంద్రం విధిస్తోన్న పెట్రో సెస్ కారణంగా రాష్ట్రాలకు తీవ్ర ఆర్థిక అన్యాయం జరుగుతోంది. మినిమం గవర్నమెంట్.. మ్యాగ్జిమం గవర్నెన్స్ అన్న కేంద్రం నినాదం మారింది. మ్యాగ్జిమం టాక్సేషన్.. మినిమం రిలీఫ్‌గా కేంద్ర విధానం తయారైంది" అని విమర్శించారు. "పెట్రో రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతోంది. సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతున్నాయి. అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయిస్తోంది. దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని కేంద్రం నిలబెట్టుకోవాల్సిన సమయం వచ్చింది. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మానేసి.. అసలైన పని చేయాలి" అని అన్నారు.

# తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్‌రెడ్డి పడగొట్టారు: హరీశ్‌రావు



సంగారెడ్డి: తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్‌రెడ్డి పడగొట్టారని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డిలోని గణేశ్ గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ సభకు రాహుల్ గాంధీ దిల్లీలో ఉండి కూడా వెళ్లలేదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు డిప్యూటీ సీఎం ఉపసంహరించుకున్నారని చెప్పారు. అంటే రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా అని ప్రశ్నించారు. "అక్రమ కేసులు పెట్టినందుకు రేవంత్‌రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ అంతా కేసీఆర్ వైపు చూస్తోంది. ఏడాది పాలనలో ప్రజలకు అన్నీ అర్థం అయ్యాయి. 50 శాతం రుణమాఫీ కూడా కాలేదు. రైతుబంధు, రూ.4 వేల పింఛన్, మహాలక్ష్మి పింఛన్ రాలేదు. జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. హైడ్రా పేరుతో రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లను కూలగొట్టారు. కష్టపడిన ప్రతీ కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుంది" అని హరీశ్‌రావు తెలిపారు.

# 'వెలిగొండ' జాతికి అంకితమంటూ జగన్ మోసం చేశారు: మంత్రి నిమ్మల



అమరావతి: వెలిగొండ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు పురోగతిపై అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తయినట్లు.. జాతికి అంకితమంటూ జగన్ ప్రజలను మోసం చేశారన్నారు.

నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదని చెప్పారు. చేయని పనులూ చేసినట్లు చెప్పుకోవడంలో ఆయనకు ఆయనే సాటి అని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే మరో రూ.4 వేల కోట్లు అవసరమని మంత్రి చెప్పారు.



# తగ్గనున్న ఈఎంఐ భారం.. హెూమ్‌లోన్ ఉన్నవారికి ఆర్‌బీఐ ఊరట


గృహ రుణ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోమారు గుడ్‌న్యూస్ చెప్పింది. రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాది ఇది రెండోసారి. ఫిబ్రవరి 7న కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు ఆర్‌బీఐ తన వైఖరిని సైతం 'తటస్థం' నుంచి 'సర్దుబాటు' ధోరణికి మార్చింది. దీంతో భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఈఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగదారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఈఎంఐ తగ్గనుంది. ముఖ్యంగా 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి ఆ మేర బ్యాంకులు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునేవారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు.

**వడ్డీ ఎంత తగ్గనుంది?...** ఆర్‌బీఐ రెండు దఫాల్లో ఇప్పటివరకు 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ఆ మేర ఈఎంఐ తగ్గుతుంది. ఉదాహరణకు 20 ఏళ్ల కాలవ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. ఇంతకుముందు 9 శాతం వడ్డీ అనుకుంటే నెలకు రూ.44,986 చెల్లించాల్సి వచ్చేది. ఆర్‌బీఐ రెండు దఫాల్లో తీసుకున్న నిర్ణయం వల్ల ఆ మొత్తం రూ.43,391కు తగ్గనుంది. అంటే దాదాపు నెలకు రూ.1600 వరకు ఆదా అవుతుంది. దీర్ఘకాలంలో మొత్తంగా రూ.4.70 లక్షల మేర ఆదా అవుతుంది. (గమనిక: గృహరుణం తీరడానికి ఉండే సమయం ఆధారంగా మొత్తం మిగులు ఆధారపడి ఉంటుంది.)

**రుణ గ్రహీతలు ఏం చేయాలి?...** ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని బ్యాంకులు ఎంత వేగం అమలుచేసి.. వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయడంపై ఈ ఊరట ఆధారపడి ఉంటుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటుపై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటుంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నాయి. ఒకవేళ ఫిబ్రవరి నెల ప్రయోజనాన్ని ఇప్పటికీ బ్యాంకులు తగ్గించకపోతే మే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు.

**రియల్టర్ల హర్షం...** ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటాయని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తంచేశాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తంచేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తుందని పేర్కొంటున్నాయి.

# యూపీ సీఎంతో మంచు విష్ణు భేటీ



ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో నటుడు మంచు మోహన్‌బాబు, ఆయన తనయుడు నటుడు విష్ణు భేటీ అయ్యారు. బుధవారం ఉదయం లఖ్‌నవూ చేరుకున్న వారిద్దరూ సీఎంను కలిసి 'కన్నప్ప' సినిమా విశేషాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా 'కన్నప్ప' కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను యోగి ఆదిత్యనాథ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ విష్ణు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. సీఎంకు థాంక్యూ చెప్పారు. "నేను ఎంతగానో అభిమానించే వ్యక్తుల్లో ఒకరైన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఈరోజు కలిశాను. 'కన్నప్ప' కొత్త రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను ఆయన చేతుల మీదగా విడుదల చేయడం ఆనందంగా అనిపించింది. రమేశ్ గొరిజాల గీసిన అద్భుతమైన కళాఖండాన్ని ఆయనకు కానుకగా అందించాం. జూన్ 27న 'కన్నప్ప' విడుదల కానుంది" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెబుతూ మోహన్‌బాబు సైతం పోస్ట్ పెట్టారు. 'మీ ఆతిథ్యానికి, ఆప్యాయతకు ధన్యవాదాలు సర్' అని రాసుకొచ్చారు. ఈ భేటీలో ప్రభుదేవా సైతం పాల్గొన్నారు. విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' సిద్ధమవుతోంది. మోహన్‌బాబు, (%వీశీష్ట్ముఅ ధీుఎబ%) ప్రీతి ముకుందన్, శరత్‌కుమార్, ముకేశ్ రుషి, రఘుబాబు, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రభాస్, మోహన్‌లాల్, కాజల్, అక్షయ్‌కుమార్ అతిథి పాత్రల్లో కనిపించనున్నారు. ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్న చిత్రమిది. ఏప్రిల్ 25న దీనిని విడుదల చేయాలని తొలుత టీమ్ భావించింది. అయితే వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడంతో జూన్ 27కు వాయిదాపడింది.

# 'క్యుములోనింబస్' ప్రభావం.. తెలంగాణలో రెండు రోజులు వర్షాలు



హైదరాబాద్: క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఇవాళ, రేపు తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే సూచనలున్నాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయని వెల్లడించింది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటనలో పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 10న (గురువారం) రాష్ట్రంలోని సిద్దిపేట, హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# సత్యాహింసల మార్గదర్శి వర్ధమాన మహావీరుడు

## – చైత్ర శుక్ల త్రయోదశి...మహావీర జయంతి



వేద యుగంలో పెరిగిన జీవహింస, ఖర్చుతో కూడిన యజ్ఞ యాగాలు, క్రతువులు, సమాజంలో పేరుకు పోయిన వర్ణ వివక్ష, మత వైషమ్యాలు, ఆర్థిక అసమానతలు ఆలోచనా పరులైన కొద్దిమందిలో జిజ్ఞాసను రేకెత్తించాయి. వీటిని అధిగమించడానికి అజీవకులు, చార్వాకులు, జైన, బౌద్ధ మత కర్తలైన... మహావీరుడు, బుద్ధుడు వంటివారు క్రీ.పూ 6వ శతాబ్దంలో భావవికాసానికి నాంది పలికారు. జైన మతాన్ని అనుసరించేవారు జైనులు. జినులు అంటే కోరికలను జయించి వారు అని అర్థం. జైన మతాన్ని వృషభ నాథుడు స్థాపించగా, ఇది 'జిన' (విజేత) అనే పదం నుంచి వచ్చింది. జైన మత గురువులను తీర్థంకరులని పిలుస్తారు. తీర్థంకరులంటే పూర్ణ పురుషులు. జీవన ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించినవారు. జైనమతంలో తొలి తీర్థంకరుడు వృషభ నాథుడు కాగా, ఆయన గురించి ఋగ్వేదంలో పేర్కొన బడింది. అంతే కాదు విష్ణు పురాణం, భాగవత పురాణంలో నారాయణావతారంగా కీర్తించ బడ్డాడు. దీనిని బట్టి జైన మతం ఋగ్వేద మతం అంతటి ప్రాచీనమైంది. ఇక, చిట్ట చివరి ఇరవై నాలుగో తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడని జైనుల విశ్వాసం. బీహార్ లో వైశాలికి సమీపములో కుండ గ్రామంలో క్రీ.పూ. 599 లో (అధిక సంఖ్యాకుల విశ్వాసం) క్షత్రియ కుటుంబములో సిద్దార్థ మహారాజుకు, రాణి త్రిషలకు జన్మించిన మహావీరుడికి తల్లి దండ్రులు పెట్టిన పేరు వర్ధ మానుడు. కొందరు జైనులు మాత్రం మహవీరుడు క్రీస్తు పూర్వం 599లో జన్మించాడని నమ్ముతుండగా, మరి కొందరు క్రీస్తు పూర్వం 615లో జన్మించాడని భావిస్తున్నారు. అయితే ఇందులో దేనికీ స్పష్టమైన ఆధారాలు లేవు. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్ర మాసం 13వ రోజున అంటే చైత్ర శుక్ల త్రయోదశి రోజున మహావీరుడు జన్మించారు. అల్లారు ముద్దుగా పెరిగిన మహావీరుడు తల్లి దండ్రులు 28 వ ఏట మరణిం చారు. యశోధరను వివాహమాడి, ఓ కుమార్తెకు జన్మనిచ్చిన తరువాత తన రాజ్యాన్ని 30 సంవత్సరాల పాటు పరిపాలించిన మహావీరుడు అకస్మాత్తుగా తన సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచి పెట్టి సత్యాన్వేషణ కోసం స్వయం గా బయలు దేరాడు. తన 30వ ఏట గృహస్థ్యాన్ని త్యజించి, ఆరు సంవత్సరాలు మక్కలి గోశాలుని శిష్యునిగా ఉన్నాడు. 36 వ ఏట సన్యాసాన్ని స్వీకరించి, వర్ధమాను డు ఆ తరువాత రిజుపాలిక నదీ తీరంలోని జృంబిక గ్రామం దగ్గర కఠోర తపస్సు చేశాడు. తన 43వ ఏట సాలవృక్షం కింద వైశాఖ మాసం పదమూడో రోజున జృంభిక గ్రామంలో జానోదయం కలిగింది. తద్వారా తపోసిద్దిని పొందాడు.

తదనంతరం... వర్ధమానుడు అంగ, మిథిల, కోసల, మగధదేశాలలో తన తత్వాన్ని ప్రచారం చేశాడు. అప్పటి కే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహా వీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధిం చిన వివరాలు వెలుగు చూశాయి. 32ఏళ్ళ పాటు అహింసా ధర్మము తో ప్రచారం జరిపిన మహావీరుడు తన 72వ ఏట క్రీ.పూ.527లో పావాపురిలో దేహాన్ని త్యజించాడు. మహావీరుని బోధనలు: 1. వైదిక కర్మలు చేయడం, దేవుణ్ని వేడు కోవడం వల్ల మనిషికి ఉపయోగం లేదు. 2. చెడు చేయకుండా మంచి జీవితాన్ని గడపడమే మోక్ష మార్గం. 3. జైనమత ప్రకారం 'ఆత్మ' ప్రాణులకే కాదు, ప్రతి వస్తువులోను ఉంటుంది. దేవుడితో నిమిత్తం లేదు. 4. సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ చరిత్ర – మోక్ష మార్గాలు. వీటిని 'త్రిరత్నాలు' అంటారు. (సరైన విశ్వాసం, సరైన జ్ఞానం, సరైన నడవడి) 5. పార్శ్వ నాథుడు ప్రతిపాదించిన సత్య, అహింస, అపరిగ్రహ, అనస్తేయ అనే నాలుగు మూల సూత్రాలకు మహావీరుడు బ్రహ్మచర్య సూత్రాన్ని అదనంగా జోడించాడు. వీటిని 'పంచానువ్రత' అని పిలుస్తారు. పార్శ్వనాథుడు శ్వేతాంబర వాదాన్ని, మహావీరుడు దిగంబర వాదాన్ని సమర్థించారు. మహావీరుని అనుచరులను నిగ్రంధులు అంటారు (బంధాల నుంచి విముక్తి పొందిన వారు). జైనులు పూజించే స్త్రీ దేవతను 'విద్యాదేవి' అని పిలుస్తారు. జైన మతంలో సల్లేఖనం (శరీరాన్ని క్షీణించుకొని మరణించడం) ద్వారా పరమపదం చేరుకోవడం ఆచారం. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖనం ద్వారా పరమపదించాడు. భారతీయ వాస్తు – శిల్ప కళాభివృద్ధికి జైనమతం గొప్ప సేవ చేసింది. మహావీరుడు సాధారణంగా కూర్చొని లేదా నిలబడి ధ్యాన భంగిమలో, అతని క్రింద ఉన్న సింహం చిహ్నంగా చిత్రీకరించ బడింది. ఉత్తర భారతదేశం లోని మధురలోని పురావస్తు ప్రాంతాల నుండి అతని మొట్టమొదటి విగ్రహాన్ని క్రీ.పూ 1వ శతాబ్దం నుండి క్రీ. శ. 2వ శతాబ్దంకి చెందినది.

అయన పుట్టిన రోజును మహావీర్ జయంతిగా జరుపు కుంటారు. ఆయన మోక్షంను జైనులు దీపావళిగా గుర్తించారు. చిన్న వయసులోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు సత్యం, అహింస, ప్రేమ మార్గాన్ని చూపించిన మహావీరుని జయంతి సందర్భంగా జైన మతానికి చెందిన వారు వివిధ కార్యకలాపాల్లో పాల్గొంటారు. మహవీరుని ఊరేగింపు కూడా నిర్వహిస్తారు. దీని ద్వారా మహవీరుని సందేశాన్ని తెలియ జేయడానికి ప్రయత్నిస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బ్రహ్మాండ నాయకునికి బ్రహ్మోత్సవ శోభ...

## శ్రీనివాసుడి సాలకట్ల వసంతోత్సవాలు - మూడు రోజుల పాటు వార్షిక ఉత్సవాలు





తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు అనగానే భక్త జన ప్రవాహం, తన్మయత్వంతో మిన్నంటేలా వారు చేసే గోవింద నామ స్మరణ, మాడ వీధుల్లో దేవేరులతో స్వామి ఊరేగింపులూ, సాటిలేని వైభవంతో సాగే వాహన సేవలు కళ్ళ ముందు కదులుతాయి. సదరు స్వామివారిని వివిధ రూపాల్లో, అవతారాల్లో దర్శనం చేసుకున్న వారికి అనుకున్న కార్యాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో పాటు.. పుణ్యఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. తిరుమల చరిత్రలో, వందల ఏళ్ళ నుంచీ వివిధ ఉత్సవాల నిర్వహణ జరుగు తున్నది. ఎందరో రాజులు, ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటిష్ అధికారులు, తర్వాత హథీరాం మహంతుల హయాంలో ఉత్సవాలు కొనసాగాయి. పురాణాలు, శాసనాల ఆధారంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు 6వ శతాబ్దంలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. చక్రవర్తులు, మహరాజులు తమ విజయ పరంపరలకు గుర్తుగా తిరుమలేశుని బ్రహ్మోత్సవాల పేరుతో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేవారు. క్రీ.శ.614లో పల్లవరాణి సమవాయ్( పేరిందేవి) మనవాళ పెరుమాళ్ అనే వెండి భోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని తిరుమల ఆలయానికి బహుకరించింది. పెరటాసి నెలలో (కన్యామాసం) జరిగే బ్రహ్మోత్సవాలకు ముందు ఈ వెండి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించేవారు. ఆ తరువాత క్రీ.శ.1254 చైత్ర మాసంలో తెలుగు పల్లవరాజు విజయ గండ గోపాల దేవుడు, క్రీ.శ.1328 ఆషాఢమాసంలో ఆడి తిరునాళ్ల పేరుతో త్రిభువన చక్రవర్తి తిరువేంకట యాదవ రాయలు, క్రీ.శ.1429 ఆశ్వయుజ మాసంలో వీర ప్రతాప దేవరాయలు, క్రీ.శ.1446లో మాసి తిరునాళ్ల పేరుత హరిహరి రాయలు, క్రీ.శ.1530లో అచ్యుతరాయ బ్రహ్మోత్సవంగా అచ్యుత రాయలు, ఉత్సవాలు నిర్వహించేవారని చరిత్ర చెబుతోంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమలలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఉత్సవాల్లో ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఉత్సవ విగ్రహంగా వినియోగించేవారు. క్రీ.శ.1339 నుంచి మలయప్ప కోనలో లభించిన మలయప్ప స్వామిని ఉత్సవ విగ్రహాలుగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతోంది. ఒకప్పుడు నెలకొకటి చొప్పున ప్రతి ఏటా పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చరిత్ర చెబుతోంది. కొన్ని ఇబ్బందులు, సమస్యల కారణంగా ఏడాదికి ఒకసారి, అధిక మాసంలో రెండు సార్లకు బ్రహ్మోత్సవాలు పరిమితం అయ్యాయి. ఈ వేడుకల్లో శ్రీ వేంకటేశ్వరుడు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తకోటికి దర్శన భాగ్యాన్ని కల్పిస్తున్నాడు. ఎలాంటి పరిస్థితులు తలెత్తినప్పటికీ శ్రీవారి బ్రహ్మోత్సవాలను రద్దు చేయడం కానీ, ఏకాంతంగా నిర్వహించడం కానీ తిరుమల క్షేత్ర చరిత్రలో లేదు. అలాగే కలియుగ వైకుంఠంలా అలరారుతోన్న తిరుమలలో ఏడాది వార్షిక (సాలకట్ల) బ్రహ్మోత్సవాలతో పాటు, ఏటా వసంతోత్సవాలు సాంప్రదాయ రీతిలో కన్నుల పండువగా కొనసాగు తాయి. నున్నాయి. చైత్ర మాసంలో తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 10వ తేదీన ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేసి, ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు. రెండవ రోజు ఏప్రిల్ 11న శ్రీ భూ సమేత శ్రీ మలయప్ప స్వామి వారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 12న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారితో పాటుగా శ్రీ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవ మూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్ప స్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ. వసంతోత్సవాన్ని పురస్కరించుకొని కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సకల దోషాలను తొలగించే ప్రదోష వ్రతం

ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు. ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియల లోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశి నాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా "అర్ధనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు. ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు. ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం



లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు. దేవ దానవులు క్షీర సాగరాన్ని మధించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి . త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్దనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్....మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి.... 108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నెహ్రూ పటేల్ మధ్యలో బీజేపీ ... కాంగ్రెస్ సరైన కౌంటర్ !



అదేంటి నెహ్రూ పాలించిన కాలం వేరు. ఇక వల్లభాయ్ పటేల్ స్వాతంత్రం వచ్చిన తరువాత అతి కొద్ది కాలం కేంద్ర మంత్రిగా పనిచేసి తనువు చాలించారు. అపుడు బీజేపీ ఎక్కడ ఉంది అన్న ప్రశ్నలు తలెత్తవచ్చు. కానీ ఈ మూడింటినీ కలిపింది మాత్రం కాంగ్రెస్. ఈ దేశంలో అతి పురాతనమైన పార్టీగా కాంగ్రెస్ ఉంది. అదే ఆ పార్టీ నేతలు గర్వంగా చెప్పుకుంటారు. ఇక గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఏఐసీసీ కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలలో మాట్లాడిన కాంగ్రెస్ అఖిల భారత అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీ మీద నిప్పులు చెరిగారు. బీజేపీకి ఏమి తెలుసు అని మాట్లాడారు, చరిత్ర అంటే మాది అని కూడా అన్నారు. 140 ఏళ్ళ వయసు కలిగిన కాంగ్రెస్ ని దెబ్బ తీయాలని బీజేపీ చూస్తోందని దాని కోసం అభూత కల్పనలు ప్రచారం చేస్తోందని ఖర్గే హాట్ కామెంట్స్ చేశారు. ఈ దేశం స్వాతంత్ర్యం కోసం పాలుపంచుకున్నది పాటు పడింది కాంగ్రెస్ అయితే బీజేపీకి ఆ చరిత్ర ఎక్కడిది అని ఖర్గే ప్రశ్నించారు. నెహ్రూ తొలి ప్రధాని పటేల్ తొలి హోం మంత్రి ఈ ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారని, వారి సాన్నిహిత్యం గొప్పదని ఖర్గే అన్నారు. ఎన్నో సార్లు పటేల్ ఇంటికి స్వయంగా నెహ్రూ వెళ్ళి కలిసేవారని వారి మధ్య అనుబంధం తప్ప ఆధిపత్యం లేనే లేదని ఆయన చెప్పారు. పైగా ఇద్దరూ ఒకే భావజాలంతో పనిచేశారని అన్నారు పటేల్ నుంచి నెహ్రూ ఎన్నో సలహాలు సూచనలు తీసుకునేవారు అని గుర్తు చేశారు. ఏకంగా సీడబ్లూసీ సమావేశాలు పటేల్ ఇంట్లో నిర్వహించి పార్టీలో ఆయన స్థానం ఏమిటో నెహ్రూ చాటిచెప్పారని అన్నారు. అటువంటి ఈ ఇద్దరి మధ్య విభేదాలు సృష్టిస్తారా అని మండిపడ్డారు. అలాగే ఈ ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయని బీజేపీ ప్రచారం చేయడం దారుణమని ఖర్గే ఫైర్ అయ్యారు. ఆఖరికి జాతీయ నాయకుల మీద బీజేపీ ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని ఆయన నిందించారు. పటేల్ భావజాలం వేరు అని ఆర్ఎస్ఎస్ భావజాలం వేరు అని ఆయన అన్నారు అయినా ఆయన వారసులమని ఎలా చెప్పుకుంటారని నిలదీశారు. ఈ దేశం కోసం పనిచేయని వారు కాంగ్రెస్ ని లేకుండా చేద్దామని అనుకుంటున్నారని ఖర్గే విమర్శించారు. నెహ్రూ పటేల్ మీద బీజేపీ ఆర్ఎస్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని ఖర్గే అన్నారు. మొత్తానికి కాంగ్రెస్ పార్టీ ఇన్నాళ్ళకు సరైన కౌంటర్ వేసింది అని అంటున్నారు. ఇంతకాలం ఈ తరహా ప్రచారం సాగుతున్నా కాంగ్రెస్ కనీసంగా ఖండించకపోవడం వల్లనే ఇలా జరుగుతోందని అనే కాంగ్రెస్ వాదులూ ఉన్నారు మేధావులూ ఉన్నారు.

అయినా చరిత్రలో ఎన్నో ఉంటాయి. వాటిని తవ్వి తీయడం ఎవరికైనా తగని పని. ఈ రోజున ప్రజలకు ఏమి చేశామన్నది చెప్పుకోవాలి. ఆ విధంగా బీజేపీ చేయడం లేదని కాంగ్రెస్ అంటోంది. అంతే కాదు చాలా కాలానికి కాంగ్రెస్ తన మూల సిద్ధాంతం బలాన్ని గుర్తు చేసుకుని మరీ బీజేపీ మీద ఆర్ఎస్ఎస్ మీద పదునైన విమర్శలు చేస్తోంది. మరి అది గుజరాతి గడ్డ ఇచ్చిన స్థాన బలమేమో అని అంటున్నారు. గాంధీ పటేల్ పుట్టిన గడ్డ మీద ఏఐసీసీ మీటింగ్స్ పెట్టిన కాంగ్రెస్ అదే గడ్డ మీద నుంచి ఢిల్లీ స్థాయికి ఎదిగి దేశాన్ని ఏలుతున్న మోడీని నిలువరించడానికి కొత్త శక్తిని కూడగట్టుకోవాలని చూస్తోంది. మరి కాంగ్రెస్ రెండు రోజుల మీటింగ్స్ సారాంశం తీర్మానాలు ఏమిటో చూస్తేనే ఆ పార్టీ యాక్షన్ ప్లాన్ తెలుస్తుంది.

# చురకలు


## సంపాదకీయం

# పాడిందేపాట..

## కాంగ్రెస్ 'మహామంత్రం' ఇదేనా?

పాడిందేపాట.. అన్నట్టుగా ఉంది.. అతి పురాతన కాంగ్రెస్ పార్టీ తీరు. పార్టీని పరుగులు పెట్టిస్తాం.. అంటూ.. ట్రెడ్‌మిల్ పైనే నాయకులు పరుగులు పెడుతున్న తీరు.. పార్టీ సీనియర్లకు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తాజాగా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) నాయకులు మూడు రోజుల సమావేశానికి తెరదీశారు. కానీ, ఈ సమావేశంలోనూ చెప్పుకొన్న సంకల్పం.. పాతదే. పాచిపట్టిందేనన్న విమర్శలు వస్తున్నాయి. "ప్రక్షాళన చేస్తాం. సంస్థాగత నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తాం. పార్టీలో వ్యవస్థలను గాడిలో పెడతాం" అంటూ.. ఏఐసీసీ అధ్యక్షుడి హోదాలో మల్లికార్జున ఖర్గే చెప్పిన మాట.. ఎక్కడో విన్నట్టుగా ఉందే.. అని చాలా మంది నాయకులు గత ఏడాది నాటి వీడియోలను మననం చేసుకున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత.. రాజస్థాన్‌లో జరిగిన 'చింతన్ శిబిర్'లోనూ.. అచ్చంగా మల్లికార్జున ఖర్గే ఈ వ్యాఖ్యలే చేశారు. సంస్థాగతంగా పార్టీని గాడిలో పెడతామనే చెప్పారు. కానీ.. ఏడాది జరిగినా.. ఇప్పటి వరకు.. వచ్చిన మార్పులు, చేసిన మార్పులు ఏంటంటే.. మొహాలు చూసు కునే పరిస్థితి వచ్చింది. నవనవోన్మేషంగా ముందుకు సాగుతున్న బీజేపీకి అడ్డు కట్ట వేయాలన్నది కాం గ్రెస్ వ్యూహం. అయితే.. ఈ క్రమంలో వేస్తున్న అడుగులు.. తప్పటడుగులు మాదిరిగానే మిగులుతున్నా యన్నది పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. శశిథరూర్ వంటి అగ్రనాయకులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టింది కూడా అందుకేనన్న ఆరోపణలు ఉన్నాయి. "మాకు కావాల్సింది.. నాయకుల మార్పు కాదు. వ్యవస్థీకృత మార్పు" అంటూ.. శశిథరూర్ చేసిన వ్యాఖ్య లు.. కాంగ్రెస్ అగ్రనేతలకు రుచించకపోవచ్చు. కానీ.. బీజేపీలో ఇలాంటి మార్పే అధికారాన్ని అందివచ్చే లా చేస్తోంది. మిత్రపక్షాలతో కయ్యానికి దిగకుండా.. బీజేపీ వేస్తున్న అడుగులు చూసిన తర్వాతైనా.. కాంగ్రెస్ నడక మార్చుకుంటుందని అనుకున్నారు. కానీ, ఎక్కడ ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా.. మిత్రపక్షాలపై తొడగొట్టి.. అధికారాన్ని పడగొట్టడమే లక్ష్యంగా పెట్టుకున్న తీరు.. ఢిల్లీలో కనిపించింది. ఈ ఏడు.. వచ్చే ఏడు.. మూడు రాష్ట్రాల్లో కీలక ఎన్నికలు ఉన్నాయి. బిహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు లో జరిగే ఎన్నికల విషయంలో అయినా.. కాంగ్రెస్ తన పంథాను మార్చుకోవాల్సి ఉందన్న సూచనలు వినిపిస్తున్నాయి. కానీ.. ఆ పార్టీ ఆదిశగా వేస్తున్న అడుగులు నామమాత్రంగానే ఉన్నాయి. పైగా.. ప్రక్షాళన పేరుతో కుటుంబాలను ప్రోత్సహించడం.. ద్వారా.. కాంగ్రెస్ ఇంకా మార్పలేదన్న.. మార్పు రాలేదన్న వాదనను సుస్థిరం చేసుకుంటుండడం గమనార్హం.

# అసమాన ప్రతిభాశాలి యజ్ఞేశ్వర చింతామణి - ఏప్రిల్ 10... సర్ వై.చింతామణి జయంతి





చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి. ఈ పేరు చాలా మందికి తెలియనిది. నేటి జర్నలిస్టులు గాని, రాజకీయ నాయకులు గానీ చింతామణి గురించి ఎక్కువగా విని ఉండక పోవచ్చు. ఆయన ఒక తెలుగువాడిగా పుట్టడం తెలుగు వారందరికీ గర్వ కారణం. చదువులో రాణించలేక పోయినా, ఆంగ్ల భాషలలో విశ్వవిద్యాలయ పట్టా లేకున్నా, పుట్టిన గడ్డను వదిలి, నిండా 18ఏళ్లు నిండకుండానే, ఒక ఆంగ్ల పత్రిక కు సంపాదకుడుగా కాగలిగి, దాదాపు మూడు దశాబ్దాల కాలం అదీ ఇంగ్లీషు వారి పరిపాలనా సమయంలో ముఖ్య సంపాదకత్వ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన అసమాన ప్రతిభాశాలి చింతామణి. చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి 1880 - 1941) పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజంగా పేరుపొందిన ప్రసిద్ధ పాత్రికేయులు, ఉదారవాద రాజకీయ నాయకులు. అలహాబాదు నుండి వెలువడిన లీడర్ అనే ఆంగ్ల పత్రికకు 1909 నుండి 1934 వరకు మూడు దశాబ్దాలపాటు సంపాదకత్వం వహించారు. ఈయన ఇండియన్ హెరాల్డ్, స్టాండర్డ్ పత్రికలను కూడా వ్యవస్థీకరించారు. 1880 ఏప్రిల్ 10న తెలుగు నూతన సంవత్సరాది నాడు చింతామణి జన్మించారు. విజయనగరం ఆస్థానంలో రాజపురోహితులు. ఆయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు, వేదపండితుడు, విజయనగరం సంస్థానంలో మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువు. తాతలు, తండ్రుల లానే చింతామణి కూడా పురోహితులు అవుతారని అందరూ అనుకున్నారు. యజ్ఞేశ్వర చింతామణికి 10 యేటనే వివాహమైనది. చింతామణి అనారోగ్యం వల్ల, మాతృవియోగం వల్ల ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేక పోయారు. అయితే, యువరాజా సూచనతో, విజయనగరం మహారాజా కాలేజ్‌లో ఇంగ్లీషు చదువు కోసం వెళ్ళినా, చింతామణి విశాఖలో స్థానిక రాజకీయ వ్యక్తులతో తిరగటం ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పొందలేక పోయాయినా, అసమానమైన ఆంగ్లభాషా పాండిత్యాన్ని సంపాదించారు. చదువుకొనే రోజుల్లోనే పత్రికలకు వ్యాసాలు రాశారు చింతామణి. స్వయంకృషితో పట్టు సాధించి, అనేక సభలలో ఉపన్యాసాలను ఇచ్చేవారు. పత్రికా రచనపై ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. ప్రారంభ దశలో "తెలుగు హార్స్" అనే పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. ఈయన వ్రాసే వ్యాసాలు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికలో అచ్చు అవటం ప్రారంభమైంది. ఆ తర్వాత కొంతకాలానికే 18 యేళ్ల వయసులోనే వైజాగ్ స్పెక్టేటర్ పత్రికకు సంపాదకత్వం వహించే అవకాశం లభించింది. అప్పట్లో 30 రూపాయలు జీతం ఇచ్చారు. ఆ తరువాత చింతామణి ఆ పత్రికను 300 రూపాయలకు కొని, తనతో పాటు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికను విజయనగరానికి తీసుకొచ్చారు. తర్వాత ఆ వారపత్రికకు "ఇండియన్ హెరాల్డ్" అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చింతామణీ "నేను కేవలం సంపాదకుడినే కాదు, ఫోర్మెన్, ప్రూఫ్ రీడర్, విలేఖరి, ఉపసంపాదకుడు, యజమాని అన్నీ నేనే" అని వివరించారు. పత్రిక బాగా ప్రాచుర్యం పొందినా ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు సంవత్సరాలలో దాన్ని మూసివేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే చింతామణి భార్య మృతి చెందగా, మద్రాసుకు మకాం మార్చి, కొంతకాలం యునైటెడ్ ఇండియా అనే వారపత్రికలోను, ఆ తర్వాత జి. సుబ్రమణ్యం అయ్యర్ సంపాదకత్వంలో వెలువడుతున్న "మద్రాస్ స్టాండర్డ్" దినపత్రికలో ఒక సంవత్సరం పాటు పనిచేశారు. 1903లో నాగేంద్రనాథ్ గుప్తా ప్రారంభించిన "ఇండియన్ పీపుల్" పత్రికకు సంపాదకత్వం వహించడానికి అలహాబాదు మకాం మార్చారు. 1909 అక్టోబరులో మదన్ మోహన్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి మితవాద కాంగ్రెస్ నాయకులు "లీడర్" అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. "ఇండియన్ పీపుల్" పత్రిక "లీడర్" పత్రికలో కలిసిపోయింది. చింతామణి లీడర్ పత్రిక సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు. చింతామణి నిష్పక్షపాతమైన విమర్శకుడిగా పేరు గడించారు. ఈ పత్రికలోని సంపాదకీయాలు ఇతడికి మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెట్టగా, 1916 వరకు లీడర్ పత్రికా సంపాదకుడిగా ఉన్నారు. 1927నుండి మళ్లీ లీడర్ పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. పత్రికా రంగంతో పాటు రాజకీయాలపై కూడా ఆసక్తి ఉంది. 20 సంవత్సరాలు కూడా నిండని వయసులో 1900 సంవత్సరం చివరలో లాహోరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చులకు డబ్బు లేకపోతే అప్పు చేసి వెళ్లారు. ఆ సమావేశాలలో అనేక విషయాలపై ఆయన చేసిన గంభీరమైన ఉపన్యాసాలు. సురేంద్రనాథ్ బెనర్జీ, భూపేంద్రనాథ్ బోస్ వంటి కాంగ్రెస్ నాయకుల ప్రశంసా పాత్రాలు అయినాయి. "హిందూ" పత్రిక ఆ ఉపన్యాసాలను ప్రశంసించింది. 1916లో తిరిగి 1927లోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. 1921-23 మధ్య అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తర ప్రదేశ్) కు విద్య, పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. 1930-31లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధిగా హాజరైనారు. కాంగ్రెస్ వాదిగా రాజకీయాలలో పాల్గొని, గాంధీ సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలతో విభేదించి, మితవాదిగా పంథా మార్చు కున్నారు. అయినా గాంధీ, నెహ్రూతో సహా నాటి నేతలంతా చింతామణిని అభిమానించేవారు. బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 1939లో సర్ బిరుదునిచ్చి సత్కరించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు (ఎల్.ఎల్.డి)ప్రదానం చేసింది. అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్. గౌరవ పట్టాను ఇచ్చింది. తెలుగు తేజాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని భారతదేశ మంతటా చాటిన చింతామణి 1941, జూలై 1 న తన 62వ యేట మరణించారు. మరణించిన దినాన సైతం ఆయన స్వీయ సంపాదకీయం రాయడం గమనార్హం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# సహజ సురక్షిత వైద్యం హోమియో - ఏప్రిల్ 10...ప్రపంచ హోమియోపతి దినోత్సవం

హోమియోపతి వ్యవస్థాపకుడు డాక్టర్ హనీమాన్ జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఆయన జన్మించిన ఏప్రిల్ 10 న ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని జరుపు కుంటారు. హోమియోపతి గురించి అవగాహన పెంచడానికి, హోమియోపతికి ప్రాప్యతను మెరుగు పరచడానికి దీనిని జరుపుకుంటారు. డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనీమాన్ ఏప్రిల్ 10, 1755వ సంవత్సరంలో ఫ్రాన్స్‌లోని పారిస్‌లో జన్మించాడు. ఆయన హోమియోపతి, మానవ ఫార్మకాలజీ పితామహుడు, నానోమెడిసిన్ సృష్టికర్త. గొప్ప శాస్త్రవేత్త. ఈ సంవత్సరం 2021 హనీమాన్ 266 వ పుట్టినరోజు అవుతుంది. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని డాక్టర్ హనీమాన్ పుట్టిన జ్ఞాపకార్థం జరుపు కుంటారు. హోమియోపతిని మరింత అభివృద్ధి చేయడానికి సవాళ్లు, భవిష్యత్తు వ్యూహాలను అర్థం చేసుకోవడానికి జరుపు కుంటారు. నేడు ప్రపంచం లోని వందకు పైగా దేశాలలో హోమియోపతి వైద్య పద్ధతిని అనుసరిస్తున్నారు. హోమియోపతి రంగంలో ప్రపంచం లోనే అగ్రస్థానంలో ఉన్న దేశం భారత దేశం. మలేరియా వ్యాధి నివారణకు సింకోన బెరడుతో చేసిన మందు వాడుతారని తెలుసుకున్న హనీమన్ ఆ బెరడు మలేరియాను ఏ విధంగా నివారిస్తుందో తెల్సుకోవాలను కున్నాడు. అందుకోసం సింకోనా బెరడుతో కషాయం తయారు చేసుకొని తనమీద తన స్నేహితులమీద ప్రయోగాలు జరిపి, ఏ ఔషదమైతే ఆరోగ్యవంతునిలో ఒక వ్యాధి లక్షణాలను కలుగజేస్తుందో ఆ లక్షణాలున్న వ్యాధికి ఆ ఔషదం ఇచ్చినపుడు వ్యాధి నయమవుతుందని తెలుసు కున్నాడు. తన ప్రయోగ ఫలితాలను గురించి 1976లో లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించడంతో పాటు, ఈ నూతన వైద్య విధానికి హోమియోపతి గా నామకరణం చేశాడు. హోమియోపతి అనేది గ్రీకు పదాల హోమియో నుండి ఉద్భవించింది. హోమియో అంటే సారూప్యత మరియు పాథోస్, అంటే బాధ లేదా వ్యాధి. ఒక పదార్థం ఏ బాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించటానికి అదే పదార్ధాన్ని మందుగా వాడాలి అన్నది హోమియోపతి మూల సూత్రం. సారూప్య లక్షణ వైద్యం.




హోమియోపతి నేడు పాటిస్తున్న అత్యంత ఆధునిక వైద్య విధానం, మరియు ఇది వ్యాధి యొక్క మూల కారణాన్ని పరిష్కరించడం ద్వారా రోగులకు లోపలి నుండి చికిత్స చేయగలదు. హోమియో పతి మందులు బాహ్య లక్షణాలను అదుపులో పెట్టటానికి ప్రయత్నించవు. బయటకి కనిపించే లక్షణాలకు మూల హేతువు ఏదో వాటి మీద పని చేస్తాయి. ఉదాహరణకు జ్వరం, దగ్గు మొదలయినవి బయటకి కనిపించే లక్షణాలు. ఈ లక్షణాలు పొడచూపగానే వాటిని వెంటనే అణచి పెట్టటానికి మందు వేసుకుంటే అసలు కారణంపై ప్రభావం చూపి, నయం కాగలదని ఆధునిక వైద్య శాస్త్రం కూడా అంగీకరిస్తుంది. హోమియోపతి మందులు ప్రకృతిలో లభించే మూలాల నుండి తయారు చేయబడతాయి. హోమియోపతి అనేది సురక్షితమైన, సున్నితమైన సహజమైన వైద్యం, హానిమన్ కనిపెట్టిన వైద్య సూత్రాలు నాలుగు...అవి 1. సారూప్య ఔషధ సిద్ధాంతం, 2. దీర్ఘ వ్యాధుల చికిత్స (మయాజమ్స్), 3. ఔషధాలను పొటెన్సీలుగా మార్చుట (పొటెంటైజేషన్), వ్యాధి తీవ్రతను బట్టి ఎంత పొటెన్సీలో మందును ఇవ్వాలి, 4. డోసులను ఎప్పుడు ఎక్కడ ఎలాగ ఎన్ని ఇవ్వాలి. ప్రపంచంలోని వైద్య విధానాలలో అల్లోపతి అనే ఆధునిక వైద్యం (ఇంగ్లీషు వైద్యం) మొదటి స్థానం ఆక్రమించింది. దాని తర్వాత ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నేచురోపతి, ఆక్యుపంక్చర్ ఇలా అనేక వైద్య విధానాలున్నాయి. హోమియోపతి వైద్యం 2వ స్థానంలో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ హోమియోపతి వైద్యాన్ని రెండవ అతి పెద్ద వైద్య విధానంగా గుర్తించింది. ప్రపంచ వ్యాప్తంగా, రెండు వందల మిలియన్ల మందికిపైగా హోమియోపతిని రోజూ వైద్యం కోసం ఉపయోగిస్తారు. ఈ చికిత్సా విధానం స్విట్జర్లాండ్, పాకిస్తాన్, మెక్సికో, ఇండియా, చైనా వంటి అనేక దేశాల జాతీయ ఆరోగ్య పద్ధతుల్లో పొందుపరచ బడింది. 66 దేశాల్లో ఈ హోమియోపతి వైద్యం ప్రాచుర్యంలో వుండగా, భారతదేశ జనాభాలో 38 శాతం ప్రజలు ఈ వైద్యాన్ని పొందుతున్నారు. భారత దేశంలో వంద మిలియన్ల మంది వ్యక్తులు వ్యాధులను నయం కాగలవనే విశ్వాసంతో హోమియోపతి వ్యవస్థపై ప్రత్యేకంగా ఆధార పడుతున్నట్లు. ఒక నివేదిక చెపుతోంది. ప్రస్తుతం రెండు లక్షల వేలకు పైగా రిజిస్టర్డ్ హోమియో వైద్యులు ఉన్నారు. హోమియోపతి భారత దేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన వైద్య వ్యవస్థలలో ఒకటి, వాస్తవానికి, ఆయుష్ (ఆయుర్వేదం, యోగా మరియు ప్రకృతివైద్యం, యునాని, సిద్ధ, మరియు హోమియోపతి) సేవలలో రెండవది. భారత దేశంలో ఆయుష్ వ్యవస్థలతో పోల్చితే వినియోగ దారులు, అభ్యాసకులు, విద్యా సంస్థలు, ప్రజారోగ్య క్లినిక్ లు పెరుగుతున్నాయి. అకాడెమిక్ హోమియోపతి ఇన్స్టిట్యూట్స్ ఆయుష్ కాలేజీలలో 35.8%, హోమియోపతి ప్రాక్టీషనర్లు మొత్తం ఆయుష్ లో 37% ఉన్నారు. మన దేశంలో హోమియోపతిలో అతిపెద్ద ఔషధ తయారీ మరియు వ్యాపార రంగంగా ఉంది. గొంతు నొప్పి, మైగ్రేన్లు, చెవి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి తీవ్రమైన రోగాలను ఆర్థరైటిస్, ఆటిజం, డిప్రెషన్ మరియు ఉబ్బసం వంటి దీర్ఘకాలిక పరిస్థితులతో పరిష్కరించడానికి ఇది ఉపయోగ పడుతుందని చెపుతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# నమ్మిన సిద్ధాంతాలతో రాజీ పడని మొరార్జీ దేశాయ్ - ఏప్రిల్ 10...మొరార్జీ దేశాయ్ వర్ధంతి



తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్ కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతో పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే - ఎ - పాకిస్తాన్ - 1986 లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు. పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## బొగ్గు పనులు ప్రైవేటుకిస్తే.. సమ్మె తథ్యం!

కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియాలోని వీకే ఉపరితల విస్తరణ గనిలో కొత్తగా బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు ఇటీవల పర్యావరణ అనుమతులు లభించాయి. మరోవైపు పర్యావరణ అనుమతుల మినిట్సను సమర్పించి కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ సేఫ్టీ (డీజీఎంఎస్) అనుమతుల్ని వేగంగా పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఏరియా జీఎం తెలిపారు. ఏదేమైనా నెల వ్యవధిలో గనిలో మట్టి తొలగింపు పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో ఉత్పత్తి పనులు సంస్థే చేపట్టాలని కార్మికసంఘాలు ఆందోళనబాట పట్టాయి.

**'ఆ నిర్ణయం.. ఒప్పందానికి వ్యతిరేకం'**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వీకే ఓసీలో కనీసం 10 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు వెలికితీయాలని యాజమాన్యం లక్ష్యం నిర్దేశించింది. నాలుగేళ్ల పాటు మట్టి తొలగింపు, బొగ్గు వెలికితీత పనులను ఇప్పటికే సోడి, ఆర్‌వీఎస్‌ఆర్ జాయింట్ వెంచర్ కంపెనీ దక్కించుకుంది. కానీ, ఆయా పనులను సంస్థ శాశ్వత ఉద్యోగులతోనే చేపట్టాలని కార్మిక



సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల ద్వార సమావేశాల్లో ఉద్యమాన్ని ప్రకటించాయి. ఈ అంశం సింగరేణి వర్గాల్లో చర్చనీయాంశమైంది. 'కోయగూడెం ఓసీ-1లో ప్రైవేటు సంస్థ సర్ఫేస్ మైనర్ యంత్రాన్ని ప్రవేశపెట్టొద్దని సమ్మె చేసినప్పుడు యాజమాన్యం ఆర్ఎల్‌సీ వద్ద ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం బొగ్గు ఉత్పత్తి పనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదు. ఒప్పందం రద్దుకాకుండా దాన్ని అతిక్రమించడం చట్టరీత్యా నేరం. ఇప్పటికే దశలవారీగా ఆందోళనలు చేశాం. ఉత్పత్తి పనులు ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే మళ్లీ సమ్మె చేస్తాం' అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు హెచ్చరించారు. సంస్థ నిర్ణయం ఉద్యోగుల ఉనికికే గొడ్డలిపెట్టుగా మారుతుందని, ఇతర సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని చెప్పారు.

## వంతెన.. ప్రమాదం చెంతన

నర్సాపూర్: నీటి వనరుల సమీపంలోని వంతెనలు ప్రమాదకరంగా మారాయి. కొన్ని శిథిలావస్థకు చేరగా, మరికొన్ని నిర్మాణానికి నోచుకోలేదు. గతంలో ఆయా వంతెనల వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదకర వంతెనపై పరిశీలన కథనం...

**ఇరుకుగా మారి..**

సంగారెడ్డి-నర్సాపూర్ మార్గంలో బంద్రేవు వాగుపై గతంలో నిర్మించిన వారధి శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియదు. ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీకొంటే వాగులో పడే అవకాశం ఉంది. ఇరువైపులా ముళ్ల పొదలు ఆవరించాయి. వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి.

మెదక్ రూరల్: మండలంలోని మక్తభూపతిపూర్ నుంచి కోంటూర్ వెళ్లే మార్గంలో గుట్టకిందిపల్లి వద్ద వంతెనకు రక్షణ గోడలు లేవు. రాయిన్‌పల్లి నుంచి ఖాజాపూర్ మార్గంలో వంతెన ప్రమాదం ఉంది. పుష్పాల వాగు వంతెనకు ఉన్న దిమ్మెలు పగిలిపోయాయి.

పాతదానిపైనే ప్రయాణం...కొల్చారం: మండలంలో మెదక్-సంగారెడ్డి మార్గంలో చిన్నఘనాపూర్ సంగాయిపేట వద్ద నిజాం కాలంలో నిర్మించిన రెండు పెద్ద వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరుకుగా ఉండటంతో పాటు, వాటి పిట్ట గోడలు కూలిపోయి, మొక్కలు, మర్రి చెట్ల ఊడలు ఆవరించాయి. గతంలో వీటి నిర్మాణానికి రూ. 1.5కోట్ల



నిధులు మంజూరు కావడంతో వంతెనల పక్క నుంచి వాహనాలు వెళ్లడానికి వీలుగా మట్టిదారి ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పనులు ఆగిపోయాయి.

**పట్టించుకుంటే మేలు**

మండలం వెంకటరత్నాపూర్ వెళ్లే దారిలో హల్దీవాగుపై ఐదేళ్ల కిందట వంతెన నిర్మాణ పనులు ప్రారంభించగా.. పక్క దిమ్మలు నిర్మించకుండా వదిలేశారు. దీంతో తూప్రాన్ నుంచి వెంకటరత్నాపూర్, దాతరపల్లి, ఇస్లాంపూర్ వెళ్లే వాహనదారులు భయపడిపోతున్నారు.

**రక్షణ లేకుండా...** మండలంలోని చండి-గోమారం రోడ్డుపై వంతెనకు ఇరువైపులా పిట్టగోడలు లేవు. నవాబుపేట వద్ద కూడా వంతెన గోడలు కూలిపోయాయి. వర్షాకాలంలో వాగులు పొంగినప్పుడు ఈ మార్గంలో ప్రయాణించడం కష్టంగా ఉంటోంది.

**పిట్టగోడలు కూలి**

టేక్మాలు: మండల పరిధిలో సాలోజిపల్లి వద్ద వంతెన పిట్టగోడలు కూలిపోయాయి. ఇక్కడ కల్వర్టు ఉన్న విషయం తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ప్రయాణించే వారికి ముప్పు పొంచి ఉంది. **హల్దీ వాగుపై..**వెల్దుర్తి: మండల కేంద్రం నుంచి మెదక్‌కు ఉన్న ప్రధాన రహదారిపై హల్దీవాగుపై ఉన్న వంతెనకు రక్షణ గోడలు లేవు. పోతంశెట్టిపల్లి రోడ్డుపై కుకునూరు వద్ద చిన్నవాగు, మంగళపర్తి-ధర్మాసాగర్ రోడ్డుపై మానెపల్లి వద్ద, మాసాయిపేట మార్గంలో ధర్పల్లి వాగుపై వంతెనలకు రక్షణ గోడలు లేవు. రెండేళ్ల క్రితం ఉప్పులింగాపూర్ వంతెనపై నుంచి ట్రాక్టర్ అదుపుతప్పి వాగులో పడిపోవడంతో వ్యక్తి మృతి చెందాడు.

**అవసరం మేరకు ప్రతిపాదనలు...-రాధికాలక్ష్మి, పీఆర్ డీఈ, నాగరాజు ఆర్‌అండ్‌బీ డీఈ** ప్రమాదకర వంతెనలు గుర్తించి వాటికి మరమ్మతులు, అవసరమైతే కొత్తవాటి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తాం. కొన్ని చోట్ల వారధుల పిట్టగోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో వాటికి కూడా ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపిస్తాం.

## బృహత్ ప్రణాళిక అమలుకు అడుగులు



కరీంనగర్ : కరీంనగర్ శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా), నగర పాలక సంస్థ పరిధిలో నూతన బృహత్ ప్రణాళిక (మాస్టర్‌ప్లాన్) రూపుదిద్దుకుంటుంది. భవిష్యత్తు ఆలోచనలకు తగ్గట్లుగా, అమలు దిశగా అడుగులు పడుతున్నాయి. 1991లో తయారు చేసిన ప్రణాళికను, 1997లో సవరించారు. 20 ఏళ్లకు ఒకసారి మాస్టర్‌ప్లాన్ తయారు చేయాల్సి ఉండగా, ఆరేళ్లుగా కొలిక్కి రావడంలేదు. పురపాలిక సమయంలో రాంపూర్, రాంనగర్ పంచాయతీలు, అయిదేళ్ల కిందట మరో ఎనిమిది గ్రామాలను విలీనం చేశారు. సుడా విస్తరణతో సరిహద్దులు మారాయి.

**రింగు రోడ్డుకు ప్రతిపాదన**

కరీంనగర్ మాస్టర్ ప్లాన్-2041 విజన్‌తో ప్రణాళిక రచిస్తూ, అవుటర్ రింగు రోడ్డు ఉండేలా ప్రతిపాదన చేస్తున్నారు. 200 అడుగుల వెడల్పు, 138 కిలోమీటర్ల పొడవునా నిర్మించేలా చర్యలు తీసుకునే అవకాశముంది. గన్నేరువరం, గునుకుల కొండాపూర్, జంగపల్లి, ఖాసీంపేట్, మాదాపూర్, పారువెల్ల, ఒద్దార్యం, బొమ్మకల్, దుర్శేడ్, ఎలబోతారం, ఇరుకుల్ల, ఖాజీపూర్, నాగుల మల్యాల, నగునూర్, కొత్తపల్లి(హెచ్), అన్నారం, మానకొండూర్, ముంజంపల్లి, కొక్కరకుంట, వన్నారం, వెదిర, వెలిచాల, మన్నెపల్లి, పొరండ్ల, తిమ్మాపూర్, నుస్తులాపూర్ మీదుగా రింగు రోడ్డుకు అలైన్‌మెంట్ చేస్తారు.

సుడా పరిధిలోని 2,289 హెక్టార్ల మేర పారిశ్రామిక జోన్‌గా గుర్తించారు. పూర్తి స్థాయిలో ఆసిఫ్‌నగర్, ఒద్దార్యం, కొంత భాగం నాగుల మల్యాల, చెంజర్ల, ఎలగందల్, బద్దిపల్లి గ్రామాలను పారిశ్రామిక ప్రాంతాలుగా ప్రతిపాదనలు చేశారు.

రువులు, కుంటలు ప్రస్తుతం లేకపోగా, అక్కడ నివాసిత ప్రాంతాలుగా గుర్తించి సులువుగా అనుమతి ఇచ్చేలా మార్పులు చేయనున్నారు. లక్ష్మీనగర్, జ్యోతినగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో చెరువులే లేవు. ఇళ్ల సంఖ్య పెరిగిపోగా, వీటిని ట్యాంకుల పరిధి నుంచి మార్చనున్నారు.

**హద్దులు..**

ఉత్తరం వైపు నుంచి కిష్టాపూర్ గ్రామ సరిహద్దు ప్రారంభించి తాహర్ కొండాపూర్ వరకు.

తూర్పు నుంచి తాహెర్ కొండాపూర్ మీదుగా చెంజర్ల వరకు

దక్షిణం నుంచి చెంజర్ల మీదుగా పడమర వైపు వెళ్లు మన్నెంపల్లి, నుస్తులాపూర్, కొత్తపల్లి పీఎన్, రేణికుంట, గునుకుల కొండాపూర్ నైరుతి మూల వరకు.

పడమర వైపు గునుకుల కొండాపూర్ నుంచి కిష్టాపూర్ సరిహద్దు వాయువ్య మూల వరకు.

మాస్టర్‌ప్లాన్‌పై ఆసక్తి గల ఏ వ్యక్తి అయినా సలహాలు, అభ్యంతరాలను రాతపూర్వకంగా 90 రోజుల్లో సుడా వైస్ ఛైర్మన్‌కు అందించాలి.

## పిల్లల ఆరోగ్యంపై.. జాగ్రత్త పడదాం



పెద్దపల్లి : ఎదిగే చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆహారంపై అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు.. ఎత్తుకు తగిన బరువు లేక బాల్యం బలహీనమవుతోంది. గతంతో పోలిస్తే మాతా శిశు మరణాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, ఇప్పటికీ వైద్య సేవలు మెరుగు పడాల్సి ఉంది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ ఏడాది 'ఆరోగ్యకరమైన ప్రారంభం.. ఆశాజనక భవిష్యత్తు'(నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ) నినాదాన్ని తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పరిస్థితులపై ప్రత్యేక కథనం.

**9 ఎంసీహెచ్‌లలో అరకొర వసతులు**

ఉమ్మడి జిల్లాలో 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 498 ఉప వైద్య కేంద్రాలు, 309 పల్లె, 15 బస్తీ దవాఖానాలు, 15 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 9 మాతా శిశు కేంద్రాలుండగా వసతులు మెరుగుపడాల్సిన అవసరముంది.

**మరణాలకు ఇవీ కారణాలు**

నెలలు నిండకుండానే ప్రసవం, జన్యు లోపాలతో బిడ్డ ఎదుగుదల క్షీణించడం. ఉమ్మనీరు మింగడం, తక్కువ బరువుతో జన్మించడం. గర్భం దాల్చిన తరువాత పౌష్టికాహారం తీసుకోకపోవడం.

రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్, ఇతర అనారోగ్య సమస్యల బారిన పడటం.

ప్రసవానికి సకాలంలో ఆసుపత్రికి రాకపోవడం.

సమీక్షించినా మార్పు రావడం లేదు

ఉమ్మడి జిల్లాలో 18,363 మంది గర్భిణులు, 17,198 మంది బాలింతలు, 1,79,006 మంది ఆరేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. గడిచిన ఏడాదిలో శిశు మరణాలే అధికంగా నమోదయ్యాయి. 135 మంది శిశువులు, 43 మంది తల్లులు చనిపోయినట్లు వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయి. మాతా శిశు మరణాలపై జిల్లా స్థాయిలో రెండు నెలలకోసారి సమీక్షించినప్పటికీ మార్పు రావడం లేదు.

**సకాలంలో వైద్యుల్ని సంప్రదించాలి**

పిల్లలు పాలు తాగకపోయినా, శ్వాస వేగంగా తీసుకున్నా, వాంతులు, జ్వరం బారిన పడినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రతి రెండు గంటలకోసారి పాలు తాగించాలి. ఏడాది వచ్చేవరకు విటమిన్ డీ3 చుక్కలు వేయించాలి. ఐరన్‌తో పిల్లల మెదడు అభివృద్ధి చెందుతుంది. డా.రవీందర్, పిల్లల వైద్య నిపుణులు,పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రి

**బీపీ అదుపులో ఉంచుకోవాలి**

గర్భిణులకు రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ లక్షణాలుంటే వైద్యుల సూచనలు పాటించాలి. రక్తపోటు అదుపులో ఉంచుకోవాలి. కడుపులో బిడ్డ పెరుగుతుంటే రక్తం తగ్గే అవకాశముంది. శరీరంలో మార్పులు చోటు చేసుకుంటాయి. దానికి తగ్గట్టుగా వైద్యం తీసుకోకుంటే ప్రాణానికే ప్రమాదం. డా.రమాదేవి, స్త్రీ వైద్య నిపుణులు, సుల్తానాబాద్ ఆసుపత్రి పర్యవేక్షకురాలు

## కమిటీ ఏర్పాటుతోనే సరి

జగిత్యాల : రాష్ట్రంలో మూతపడిన మల్లాపూర్, బోధన్, ముంబోజిపల్లెలోని చక్కెర కర్మాగారాలను తెరిచేందుకు గల సాధ్యాసాధ్యాల పరిశీలనకు రాష్ట్రప్రభుత్వం 15 నెలల కిందట కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసులకు అనుగుణంగా చర్యలుంటాయని ప్రభుత్వం పేర్కొన్నా ఇప్పటికీ తదనుగుణ చర్యలు కొరవడటంతో చెరకుసాగు పెంపుపై రైతులు మల్లగుల్లాలు పడుతున్నారు. వరిసాగులో ధాన్యం విక్రయ ఇబ్బందులు, ఇతర పంటలకు కోతులు, అడవిపందులు తదితర వణ్యప్రాణుల బెడద తీవ్రమైన నేపథ్యంలో చెరకు ప్రత్యామ్నాయ మేలైన పంటగా భావిస్తున్నారు. గతంలో చెరకుసాగులో కూలీల కొరత ఉండగా ఇటీవల చెరకును నరికేందుకు హార్వెస్టర్లు అందుబాటులోకి రావటంకూడా రైతులకు కలిసిరానుంది. గతంలో ఎడ్లబండ్లద్వారా చెరకు గడల రవాణా చేపట్టగా ఇటీవల పూర్తిస్థాయిలో ట్రాక్టర్లు అందుబాటులోకి వచ్చాయి.ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చెరకును గానుగాడించిన తరువాత వెలువడే పిప్పిని తిరిగి పంటలకు వాడినపుడు మంచి సేంద్రియ ఎరువుగానూ ఉపయోగపడుతుంది. ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాన్ని వెలువరిస్తే ఇప్పట్నుంచి వానాకాలం వరకు చెరకును నాటేందుకు అనువైన సమయముంటుందని రైతులు పేర్కొంటున్నారు.పరిశ్రమను తెరిస్తే క్రషింగ్ యంత్రాల సామర్థ్యం పెంచుతారు కాబట్టి దాదాపు చెరకుసాగు కనీసం 50 వేల ఎకరాలకు పెరగనుంది. ఇటీవల రుద్రూరు పరిశోధనస్థానం ద్వారా నూతన చెరకు వంగడాలు అందుబాటులోకి రాగా దిగుబడి పెరగటం, సాగుసమస్యలు తగ్గటంతో సాగు లాభదాయకంగా ఉంటుందని, స్థిరమైన ఆదాయాన్ని



ఇస్తుందని రైతులు చెబుతున్నారు.జగిత్యాల జిల్లాలోని ముత్యంపేట చక్కెర కర్మాగారం పరిధిలో గతంలో 15 వేల ఎకరాల్లో చెరకును రైతులు పండించేవారు. జగిత్యాలతో పాటు నిర్మల్, నిజామాబాద్ జిల్లాల రైతులు కూడా మత్యంపేట కర్మాగారానికి చెరకును తీసుకువచ్చేవారు. పరిశ్రమ మూతతో ప్రస్తుతం చెరకుసాగు దాదాపు వెయ్యి ఎకరాలకు పరిమితం కాగా ప్రైవేటు కంపెనీ ఆధ్వర్యంలో సాగు చేస్తున్నారు.గతంలో చక్కెర కర్మాగారాలను తెరిచేందుకు మనప్రాంత రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్లి అక్కడి కర్మాగారాలను చూపించారు. రైతుసంఘాలు లేదా ఎఫ్‌పీవోలు నడిపిస్తే అనుమతిస్తామని పేర్కొన్నా వెచ్చించాల్సింది పెద్దమొత్తం కావటంతో రైతులు ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వమే పూర్తి నిధులు వెచ్చించి కర్మాగారాన్ని తెరిపించాలని, కేవలం సాగునుమాత్రం ఎఫ్‌పీవోలు లేదా రైతుసంఘాలకు పరిమితం చేయాలని కర్షకులు కోరుతున్నారు.

## తెల్లబంగారానికి అవినీతి మరకలు

కొత్తగూడెం : భారత పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాల్లోని పత్తి అమ్మకాల్లో అవకతవకలకు పాల్పడిన ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పలువురు అక్రమార్కులపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఉభయ జిల్లాల్లో జిన్నింగ్ మిల్లుల్లో ప్రైవేట్‌గా కొన్న పత్తిని వ్యాపారులు సీసీఐకే అట్టగట్టి రూ.కోట్లు వెనకేసుకున్నారు. పత్తి సాగు విస్తీర్ణం కన్నా అధికంగా రైతుల పేర్లతో సీసీఐకి దళారులు విక్రయించగా.. మరికొన్నిచోట్ల కర్షకులకు తెలియకుండానే వారి పట్టాదారు పాసు పుస్తకాలతో సరకు అమ్ముకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా.. తాత్కాలిక



రిజిస్ట్రేషన్ (టీఆర్)లో అవకతవకలు జరిగాయని నెల క్రితం భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శిని సస్పెండ్ చేసిన విషయం విదితమే.

**దళారుల రాజ్యంలో రైతు దగా**

రాష్ట్రంలో అత్యధికంగా పత్తి పండించే జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు మొదటి వరుసలో ఉంటాయి. ఇక్కడ తెల్లబంగారం కొనుగోళ్లు మొదలవగానే దళారులు సీసీఐ కేంద్రాల వద్ద వాలిపోతారు. తేమ, తరుగు పేరిట రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని నకిలీ టీఆర్‌ల సాయంతో పెద్దమొత్తంలో సరకును సీసీఐకి అంటగట్టి సొమ్ము చేసుకుంటారు. రైతులు పత్తి విక్రయించటానికి వస్తే సవాలక్ష కొర్రీలు విధించే సీసీఐ అధికారులు.. దళారులు, వ్యాపారులకు మాత్రం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా మద్దతు ధర కల్పించటం విమర్శలకు దారితీస్తోంది.

**తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలు**

వ్యవసాయశాఖ అధికారుల వద్ద వివరాలు నమోదుకాని రైతులు, కౌలుకు తీసుకునేవారికి టీఆర్‌లు జారీచేస్తారు. సంబంధిత ఏఈఓలు కౌలు, మిగతా రైతులను ధ్రువీకరించి తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. వీటిని జిన్నింగ్ మిల్లుల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే సీసీఐకి పత్తి విక్రయించవచ్చు. అయితే భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలంలో ఓ వ్యవసాయ విస్తరణాధికారి.. రైతు సాగుచేసిన విస్తీర్ణం కంటే ఎక్కువ భూమికి ధ్రువపత్రం జారీచేశాడు. భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈ విషయాన్ని పరిశీలించకుండా పత్తి విక్రయానికి అనుమతిచ్చాడు. ఉన్నతాధికారుల తనిఖీల్లో టీఆర్‌ల జారీలో అక్రమాలు వెలుగుచూశాయి. విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అత్యధిక క్వింటాళ్ల పత్తిని విక్రయించిన వ్యక్తుల పేర్లు, ఆధారాలను అధికారులు సేకరిస్తున్నట్లు తెలిసింది. టీఆర్‌లు జారీ చేసిన అధికారులు, ఆమోదం తెలిపిన కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్లలో గుబులు మొదలైంది.

## ఆదిలోనే వైద్యం అందించి

పెద్దశంకరంపేట : చిన్నారుల అవయవాల్లో రుగ్మతలు ఏర్పడితే.. ప్రారంభ దశలో చికిత్స చేయిస్తే త్వరగా బయటపడే అవకాశం ఉంటుంది. ఆ రుగ్మత అలాగే ఉండి, ఏళ్లు గడిచిన తర్వాత చికిత్స అందించినా ఫలితం ఉండదని ఆరోగ్యశాఖ భావిస్తోంది. ఇందుకోసం ఆరేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన ఆరేళ్లలోపు చిన్నారులకు వైద్య పరీక్షలు చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో ఈ ఏడాది వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ద్వారా ఈ వైద్య పరీక్షల నిర్వహణపై మార్గదర్శకాలను విడుదల చేయనుంది. ఈనెల 7 నుంచి జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఈ పరీక్షలు చేపట్టనున్నారు.

**24 వేల మందికి ప్రయోజనం**

ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కంటి పరీక్షలు చేయనున్నారు. దృష్టి సమస్యలతో పాటు, మెల్ల కన్ను, కార్నియా సమస్యలు ఉంటే చిన్నారులకు జిల్లాలోని బోధనాసుపత్రుల్లో తగిన చికిత్స అందించనున్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు కూడా ఇవ్వనున్నారు. చిన్నారుల్లో మానసిక ఎదుగుదల కూడా పర్యవేక్షించి ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్‌ఐఈపీఐడీ)' సహకారంతో వైద్యం అందించనున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తుకు తగ్గ బరువు లేని వారు, తక్కువ బరువున్న ఉన్నవారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరీక్షల వల్ల 24 వేల మంది చిన్నారులకు ప్రయోజనం చేకూరనుంది.

చిన్నారులకు ప్రయోజనం-హైమావతి, జిల్లా సంక్షేమాధికారి అంగన్‌వాడీ చిన్నారులకు కంటి చూపు, ఇతర వైద్య పరీక్షలు చేస్తే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రారంభ దశలోనే ఆరోగ్య సమస్యలు గుర్తించి వారికి వైద్యం అందిస్తే జబ్బుల నుంచి తొందరగా బయటపడవచ్చు. ఆరోగ్యశాఖ నుంచి సీడీపీఓల ద్వారా సమన్వయం చేసుకొని పరీక్షలు జరిపే అవకాశం ఉంది.

## సాగుకు ప్రోత్సాహం.. అన్నదాతకు ఆదాయం

సంగారెడ్డి : ఆరుగాలం శ్రమించినా అన్నదాతలకు నష్టాలు.. కష్టాలు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కడానికి కొందరు రైతులు ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వీరికి అందుబాటులో మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మార్కెట్ యార్డుల్లో ఉద్యాన పంట ఉత్పత్తుల విక్రయాలకు ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం వెంటనే అమలైతే అన్నదాతలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

జిల్లాలో అనుకూల పరిస్థితులు

జిల్లాలోని జోగిపేట, పటాన్‌చెరు, నారాయణఖేడ్, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, వట్‌పల్లి, రాయికోడ్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఉద్యాన పంటల ఉత్పత్తుల విక్రయాలకు మార్కెట్లను ఏర్పాటు చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. సదాశివపేట, జోగిపేట, వట్‌పల్లి, జహీరాబాద్, రాయికోడ్ తదితర చోట్ల యార్డుల్లో అవసరమైన స్థలాలు అందుబాటులో ఉండటం కలిసివచ్చే అవకాశం. వీటిలో రైతులు ఉద్యాన పంటల ఉత్పత్తులు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధరతోపాటు సమయం కూడా ఆదా అవుతుంది.

జోగిపేటలో సదుపాయాలు లేక..

జోగిపేటలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రూ. 1.25 కోట్లతో దుకాణ సముదాయన్ని నిర్మించారు. కూరగాయలు, పూలు, పండ్లను ఇందులో విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. దుకాణ సముదాయం పక్కనే ప్రభుత్వ ఆసుపత్రి శవాగారం గది ఉండటం, మార్కెట్‌లో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు సదుపాయాలు కల్పిస్తే వ్యాపారులకు సముదాయం అనుకూలంగా ఉంటుంది.

రాయితీపై విత్తనాలు, పరికరాలు..ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 145 కోట్లు కేటాయించింది. ఇందులో జిల్లాకు రూ. 10కోట్ల వరకు మంజూరయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిధుల్లోంచి ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు రాయితీలు అందించనున్నారు. రాయితీ విత్తనాలు, యంత్ర పరికరాలు కర్షకులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

చురకలు



# పల్లె పథకానికి ప్రతిఫలం

ధర్మారం: ధర్మారం మండలం బొట్లవనపర్తిలోని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద నాటిన మామిడి తోట ఇది. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఉపాధిహామీ పథకంలో భాగంగా 2015లో మూడెకరాల్లో మొక్కలు నాటారు. పథకం కింద సంరక్షణ చర్యలతో పాటు ఎరువుల కోసం బిల్లులు చెల్లించారు. రెండేళ్లుగా ఫల సాయం వస్తోంది. ఈ ఏడాది కాత అధికంగా రావడంతో పంచాయతీకి రూ.75 వేల ఆదాయం వచ్చింది. ఇలా సామూహికంగానే కాదు, మండలంలోని వివిధ గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు ఉపాధిహామీ పథకంలో నాటిన మామిడి మొక్కలు ఫల సాయమిస్తున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో 5800 ఎకరాల్లో..**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా చేపట్టిన పండ్ల తోటల పెంపకం సత్ఫలితాలిస్తోంది. 2007లో ఈ పథకం ప్రారంభం కాగా 2008లో ఊపందుకుంది.

అరకొరగా నీటి వసతి ఉన్న మెట్ట భూముల్లో పండ్ల తోటల సాగుతో పేద రైతులను ఆర్థికంగా పరిపుష్టం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తెచ్చింది.

పండ్ల మొక్కలు నాటాక మూడేళ్ల పాటు ప్రభుత్వమే నిర్వహణ ఖర్చులు చెల్లిస్తుంది. నాలుగో సంవత్సరం నుంచి ఫల సాయం మొదలవుతుండటంతో రైతుల ఆర్థిక స్థితి మెరుగు పడుతుందనేది పథకం ఉద్దేశం. ఉపాధిహామీలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో మొత్తం 5800 ఎకరాల్లో మామిడి తోటలు పెంచుతున్నారు. ఇందులో ధర్మారం మండలంలోనే అత్యధికంగా 1,144 ఎకరాల్లో 586 మంది రైతులు మొక్కలు నాటారు.మొదట నాటిన మొక్కలు ప్రస్తుతం ఫల సాయం ఇస్తున్నాయి. కాతకు అనుగుణంగా ఎకరాకు రూ.20 వేల నుంచి




రూ.35 వేల వరకు ఆదాయం వస్తోంది.

పంచాయతీలకు ఆదాయం లేకపోవడం, ఖర్చులు అధికంగా ఉండటంతో నిర్వహణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ భూముల్లో మామిడి మొక్కలు నాటి సంరక్షిస్తే బొట్లవనపర్తిలా నికర ఆదాయ వనరుగా మార్చుకోవచ్చు.

**మూడేళ్ల వరకు సంరక్షణ బిల్లుల చెల్లింపు** ఉపాధిహామీలో పండ్ల తోటలు నాటాలనుకునే రైతులు గ్రామ స్థాయిలో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, మండల పరిషత్తు కార్యాలయంలోని ఉపాధిహామీ సిబ్బందిని సంప్రదించి, దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదు ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు అర్హులు. గుంతల తవ్వకం, మొక్కల కొనుగోలు, ఎరువుల ఖర్చులకు మూడేళ్ల వరకు ఎకరాకు దాదాపు రూ.30 వేల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఉపాధిహామీ కూలీలతో గుంతలు తవ్విస్తారు. ఆ తర్వాత కొద్ది రోజులకు పూడ్చేసి వర్షాలు కురవగానే మొక్కలను తెప్పించి నాటుతారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మారం మండల ఏపీవో రవి సూచించారు.

# బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో

సారంగాపూర్: 'సారంగాపూర్ మండలంలోని వడ్డెర కాలనీ సర్పంచి పల్లపు వెంకటేశ్ రూ.10 లక్షలు, పోచంపేటకు చెందిన పల్లికొండ రమేష్ రూ.30 లక్షలు, రేచపల్లి సర్పంచి ఎడ్మల జయ రూ.25 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం, సిమెంట్ రహదారుల తోపాటు పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టారు. పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా నిధులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం ఒక్క వడ్డెరకాలనీ, పోచంపేట రేచపల్లి మాజీ సర్పంచుల పరిస్థితి కాకుండా జిల్లాలో మాజీ సర్పంచుల ఆవేదన.' గ్రామాభివృద్ధి కోసం సొంత డబ్బులు వెచ్చించి ప్రస్తుతం నిధులు మంజూరు కాకపోవడంతో ఆర్థిక భారాన్ని మోయక తప్పడంలేదు. కొందరైతే అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేపట్టారు. పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగిసి ఏడాది దాటినా బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 380 పంచాయతీలలో దాదాపు రూ.25,88,55,669 మేర బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు ఇటీవల ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. ఇందులో పల్లె ప్రగతి పనుల కింద రూ.5,14,84,967 ఉండగా ఇతర నిధుల కింద



రూ.20,73,70,702 ఉన్నట్లు ప్రభుత్వానికి అందించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టగా ఆయా నిధులు కూడా పూర్తి స్థాయిలో మంజూరు కావడంలేదు. గత ప్రభుత్వం జిల్లాలో 72 రైతు వేదికలు నిర్మించగా పూర్తిస్థాయిలో బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 380 పాత పంచాయతీలు ఉండగా ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం సగటున రూ.6 కోట్ల వరకు మూడు నెలలకోసారి రూ.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు జమవుతుంటాయి. దాదాపు రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులు రాకపోగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులు పాలకవర్గాలు లేకపోవడంతో నిలిచిపోయాయి. పంచాయతీల భారం పూర్తిగా కార్యదర్శులపై పడడంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తోంది.

**అప్పులపై వడ్డీ భారం**

అధికారంలో ఉండగా ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పలు అభివృద్ధి పనులు చేపట్టాం. పదవీ కాలం ముగిసి ఏడాదికి పైగా గడిచినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా అవస్థలు పడాల్సి వస్తోంది. నూతన పంచాయతీ కావడంతో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేశాం. బిల్లులు రాకపోవడంతో వడ్డీ భారం పడుతోంది. ప్రభుత్వం బకాయిలు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలి. పల్లపు వెంకటేశ్, మాజీ సర్పంచి, వడ్డెరకాలనీ

# కర్ణాటక బాటలో.. గనుల నిర్వాహకులు



తాండూరు: తాండూరు నాపరాయికి దేశ, విదేశాల్లో మంచి పేరుంది. వ్యాపారం బాగుండడంతో చాలా మంది ఔత్సాహికులు ఈ రంగంలోకి వచ్చారు. ఇలా దాదాపు 40 ఏళ్లుగా నాపరాయి పరిశ్రమపై ప్రత్యక్షంగా పరోక్షంగా కలిపి 20వేల నుంచి 30వేల మంది కార్మికులు రోజూ వారిగా ఉపాధి పొందుతున్నారు. అయితే 2022 నుంచి ప్రభుత్వాలు తీసుకున్న అనూహ్య నిర్ణయాల వల్ల నాపరాయి పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లడం ప్రారంభమైంది. పరిశ్రమలకు సంబంధించి అన్ని అంశాల్లో ఫీజులు చాలా పెరిగాయి. ఇది వ్యాపారులకు ఆర్థిక భారంగా మారింది. ఈ నేపథ్యంలో చాలా మంది తమ వ్యాపార కార్యకలాపాలను తాండూరుకు సమీపంలో 14 కిలో మీటర్ల దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి మార్చారు. మిగిలిన వ్యాపారులు కూడా అటు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

**ఉపాధిపై తీవ్ర ప్రభావం**

తాండూరులో నాపరాళ్ల పరిశ్రమను నిర్వహించడం ఆర్థిక భారం కావడంతో 75 మంది వ్యాపారులు తమ పరిశ్రమలను కర్ణాటక రాష్ట్రం మిర్యాణ్ గ్రామానికి మార్చారు. ఇక్కడి నుంచి ముంబయికి నాపరాయిని ఎగుమతి చేస్తున్నారు. దీంతో ఒక్కో యూనిట్లో 10 మంది చొప్పున మొత్తం 750 మంది కార్మికుల ఉపాధికి గండి పడింది.

**అక్కడి తరహా ఛార్జీలు ఆపాదించాలి**

తాండూరు నాపరాయికి కర్ణాటక తరహా ఛార్జీలు ఆపాదించాలని గతేడాది జులైలో రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్‌ను వ్యాపారులు కలిసి విన్నవించారు. తాజాగా విషయాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వివరించారు.

**ఎకరం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు**

కర్ణాటక రాష్ట్రం మిరియాణం, కల్లూరు, పోలక్ పల్లిలో నాపరాయిగని ఎకరం ధర రూ.20లక్షల నుంచి 30 లక్షల లోపే. తాండూరు మండలం ఓగిపూరు, మల్కాపూరు, కరణ్కోటలో ఒక్కో ఎకరం నాపరాయి భూమి ధర ఏరియాను బట్టి రూ.30లక్షల నుంచి రూ.80 లక్షలు. కర్ణాటకలో ఒక్కో యూనిట్ విద్యుత్తు ఛార్జీ రూ.6.10 పైసలు ఉంటే తెలంగాణలో రూ.7.10 పైసలుగా ఉంది. ఇలా అధిక మొత్తాలు భరించలేక కర్ణాటకవైపు మొగ్గుచూపాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

# చివరి దశలో తెగుళ్లు.. రైతన్న దిగులు



గంగాధర: యాసంగిలో పంటలు సాగు చేసిన అన్నదాతకు వాతావరణ పరిస్థితులు కలసిరావడం లేదు. మెట్ట ప్రాంతాల్లో సాగునీరందక ఎండిపోగా, కాలువలు ఉన్న చోట అన్నదాత ఆశలపై తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఫలితంగా పెట్టుబడుల భారం తడిసిమోపెడవుతుండగా దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ప్రస్తుతం అగ్గితెగులు, మెడవిరుపు, సుడిదోమ ఉద్ధృతితో ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది.

జిల్లాలో ఎస్సారెస్పీ వరద కాలువ, కాళేశ్వరం, ఎల్లంపల్లి జలాలతో యాసంగిలో 2.66 లక్షల ఎకరాల్లో వరిపంట, 23 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడులు వెచ్చించారు. పంట సాగు మొదలుకుని మొగిపురుగు, ఆకుఎండు తెగులు, కంకి నల్లిపురుగు సోకి పంట ఎదుగుదల లేకుండా చేశాయి. ఇప్పటికే 20 శాతం పంటను నష్టం చేశాయి.

ఇది చాలదన్నట్లుగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో ఇటీవల కురిసిన అకాల వర్షంతో జిల్లాలో వందలాది ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. యాసంగిలో ఎకరాకు 30 నుంచి 38 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా తెగుళ్ల ఉధృతితో 28 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పెట్టుబడులు పోనూ రెక్కల కష్టం కూడా వృథాగా పోతుందని ఆవేదన చెందుతున్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో వరికి అగ్గితెగులు సోకి మెడవిరుపుతో గొలకలు మాడిపోతున్నాయి. ఇంకా కోతకు రాని వరిపంటలో తెగుళ్లతో ఇప్పటికే నష్టం జరగ్గా పరిస్థితి ఇంకా తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంచనా వేస్తున్నారు.

విచ్చలవిడిగా మందుల వినియోగం

వాస్తవానికి పంటల సాగుకు ముందు దుక్కి దున్ని ఆరబెట్టాలి. ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి చేపట్టాలి. కొన్ని కంపెనీలు విత్తనశుద్ధి చేయకుండా ప్యాకింగ్ చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. రైతులే నేరుగా విత్తనాన్ని శుద్ధికరణ చేసుకుని పంట వేయాలి. తెగుళ్ల బారిన పడకుండా నాణ్యమైన విత్తనాల తయారీకి పరిశోధనా కేంద్రాల్లో శాస్త్రవేత్తలు చర్యలు చేపట్టాలి.


తెగుళ్ల బారిన పడ్డ పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే రైతుల అవసరాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. తెగుళ్ల నివారణకు వారి దుకాణంలో ఉన్న మందులను అంటగడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగుసార్లు మందుల పిచికారీ

మూడున్నరెకరాల్లో వరి పంట వేస్తే తెగుళ్ల ధాటికి పంటంతా దెబ్బతింది. మొగిపురుగు నివారణకు మూడు సార్లు మందు పిచికారీ చేయగా, ఇప్పుడేమో సుడిదోమతో నష్టం వాటిల్లుతుంది. అగ్గితెగులు, మెడవిరుపుతో పంటకు నష్టం వాటిల్లుతుంది. మందులు పిచికారీకి రూ.24 వేలు ఖర్చు చేశా.

రాములు, లక్ష్మీదేవిపల్లి (గంగాధర)

# జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



తాండూరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన చోట నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. లబ్ధిదారులు ఉత్సాహంగా పనులు పూర్తి చేయిస్తున్నారు.

**144 మంది లబ్ధిదారుల గుర్తింపు**

తాండూరు మండలం చెంగెష్‌పూర్‌ను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. గ్రామంలో ఇళ్ల నిర్మాణానికి ఖాళీ స్థలం అందుబాటులో ఉన్న 144 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరందరికీ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. గతనెలలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించేందుకు ఆదేశించారు. దీంతో గృహ నిర్మాణ శాఖ, మండల పరిషత్ అధికారులు లబ్ధిదారుల స్థలాల వద్ద ముగ్గు వేసి పునాది పనులు ప్రారంభింపజేశారు. పదులసంఖ్యలో నిర్మాణాలు మొదలవగా కొన్ని పునాది దశలో నిర్మాణాలు పూర్తయ్యాయి. 500 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మాణం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

**తొలివిడత రూ.లక్ష చొప్పున ఖాతాల్లో..**

పునాది దశలో ఇళ్ల నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో తొలివిడతగా రూ.లక్ష సొమ్మును జమ చేయనున్నారు. అందుకు ఆయా బ్యాంకు ఖాతాల వివరాలను అధికారులు సేకరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫోటోలు తీసి బిల్లు చెల్లింపులకు ఆన్‌లైన్ ద్వారా సిఫారసు చేయనున్నారు. దీంతో రెండు మూడు వారాల్లో నగదును నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని ఎంపీడీఓ విశ్వప్రసాద్ వెల్లడించారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి పనులు కొనసాగించేలా అవగాహన కల్పిస్తున్నామని స్థానిక పర్యవేక్షకుడు ఆర్.వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వం అందించే సొమ్మును సద్వినియోగం చేసేలా వివరిస్తున్నామన్నారు.

**పునాదులు పూర్తయ్యాయి: మమత, చెంగెష్‌పూర్**

రెండు గదుల్లో ఐదుమంది ఉండేందుకు పన్నెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసిన వెంటనే పనులు మొదలుపెట్టాం. పునాదులు పూర్తి చేశాం.

**మూడుసార్లు దరఖాస్తు చేశా: గౌరమ్మ, తాండూరు**

ఇల్లు కోసం గతంలో మూడుసార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదు. ఈసారి సర్కారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించాం. వారం క్రితం పునాదులు పూర్తయ్యాయి.

# టన్నుకు పోతున్న మిల్లర్లు

భువనగిరి : జిల్లాలో యాసంగి ధాన్యం రాక ప్రారంభమైంది. అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నారు. కొనుగోళ్లు ప్రారంభించలేదు. ప్రైవేట్ మార్కెట్‌లో క్రయవిక్రయాలు ప్రారంభమై వారం రోజులవుతోంది. జిల్లాలో 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. ఏప్రిల్ రెండో వారంలో కొనుగోలు కేంద్రాలు తెరవాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలోని మోత్కూరు, రామన్నపేట మండలం కక్కిరేణి, మండల కేంద్రం అడ్డగుడూరు, చౌళ్లరామారం, ఆత్మకూర్(ఎం) మండలం పల్లెర్ల, లింగరాజ్‌పల్లిలో కేంద్రాలను ప్రారంభించారు. ఎక్కడా కొనుగోళ్లు చేపట్టలేదు.

జిల్లాలోని మోత్కూరు, అడ్డగుడూరు, రామన్నపేట, వలిగొండ ప్రాంతాల్లో కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 50 లక్షల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాలకు పంపించారు. 48 కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. వర్షాలు పడుతున్నందున వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మూసీ



పరీవాహక ప్రాంతంలో తొలుత వరికోతలు ప్రారంభం కానున్నాయి. రామన్నపేట, మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు తదితర ప్రాంతాల్లో పీపీసీలు తెరుస్తామని పౌరసరఫరాల సంస్థ డీఎం హరికృష్ణ తెలిపారు.

**ప్రైవేట్‌లో జోరుగా..**

కొందరు రైతులు పంట కోసిన వెంటనే వ్యాపారులకు అమ్మకోవడం ప్రారంభించారు. మార్చి చివరి వారం నుంచి లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా మోత్కూరు, అడ్డగూడూరు ప్రాంతాల నుంచే ఎక్కుగా వడ్లు వస్తున్నాయి. ఇప్పటి వరకు మార్కెట్ యార్డుల్లో సుమారు రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అమ్మారు. మిల్లరు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. సీఎంఆర్ ధాన్యం తక్కువ ఉన్న వారు కొనుగోలు చేసి సర్దుబాటు చేసుకుంటున్నారు. మిల్లర్లు 622 ఎంటీలు కొనుగోలు చేశారు. చెక్ పోస్టుల్లో 1191 ఎంటీలకు మార్కెట్ ఫీజుల వసూళ్లు చేశారు. ప్రైవేట్‌లో కోసిన పంటను అలాగే క్వింటాకు రూ.1810 నుంచి రూ.2300 వరకు విక్రయించారు. భువనగిరి మార్కెట్ యార్డు పరిధిలోనే కనిష్ఠ ధర. రూ.1810గా నమోదైంది. మిగిలిన మండలాల్లో రూ 2వేల నుంచి రూ.2,300 వరకు లభించింది.

# ఏడాదికి సరిపడా సన్నబియ్యం

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం జిల్లాలో నిరాటంకంగా కొనసాగనుంది. ఇందుకు అవసరమైన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలో రేషన్‌కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 748 రేషన్ దుకాణాల పరిధిలోని 4,10,988 లక్షల కార్డుల్లో 11,48,031 మంది వ్యక్తులు నమోదయ్యారు. వీరికోసం ఏప్రిల్ నెలకు 7,375.868 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. ఇలా రాబోయే పదకొండు నెలలకు సుమారు 82 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం. అయితే జిల్లాలో 1.77 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందుబాటులో ఉన్నాయి. అంటే రెండేళ్లకు సరిపోతాయి. కానీ ఇతర జిల్లాలకు సర్దుబాటు చేయాల్సిన అవసరం ఉంటుంది. అందువల్ల కనీసం ఏడాది పాటు ఖమ్మం జిల్లాలో పండిన ధాన్యం నుంచి వచ్చిన బియ్యం ఇక్కడి ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

**గత ఖరీఫ్‌లో సన్నధాన్యం సేకరణ**

గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో రైతులు పండించిన ధాన్యం 2.96 లక్షల మెట్రిక్ టన్నులను పౌరసరఫరాలశాఖ అధికారులు కొనుగోలు చేశారు. క్వింటా ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్‌ను రైతులకు ప్రభుత్వం చెల్లించింది. ఇందులో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కోసం 2,63,775 మెట్రిక్ టన్నుల సన్నవడ్లు కేటాయించారు. ఈవడ్లు మరపట్టించగా 1,76,729 మెట్రిక్ టన్నుల బియ్యం వస్తాయి. ఇప్పటివరకు మిల్లుల నుంచి 93,918 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పౌరసరఫరాల సంస్థ అధికారులకు అందగా.. వాటిని జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లోని గోదాముల్లో నిల్వ చేశారు. ఇంకా 82,811 మెట్రిక్



టన్నుల సన్నబియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంది. మిల్లుల నుంచి సన్నబియ్యాన్ని గడువులోగా తెప్పించేందుకు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు సరఫరా**

ఖమ్మం జిల్లాలో సన్నబియ్యం మిగులు నిల్వలు ఉన్నందున పౌరసరఫరాల సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లాకు 1,000 మెట్రిక్ టన్నులను శుక్రవారం పంపించారు. బియ్యం మిగులు నిల్వలు ఉన్న జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు ప్రతినెలా సర్దుబాటు చేస్తుంటారు. గతంలో దొడ్డు బియ్యాన్ని మిగతా జిల్లాల నుంచి ఖమ్మం జిల్లాకు కేటాయించేవారు. ఇప్పుడు ఖమ్మం జిల్లాలో పండిన సన్నబియ్యం హైదరాబాద్ సహా ఇతర జిల్లాలకు సరఫరా కానుంది.

జిల్లాలో సమృద్ధిగా సన్నబియ్యం నిల్వలున్నాయి. గత ఖరీఫ్‌లో సేకరించిన సన్నవడ్లను మిల్లులకు అప్పగించి మర పట్టించగా వచ్చిన సన్నబియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేస్తున్నాం. జిల్లాలోని రేషన్‌కార్డులకు సరిపడా సన్నబియ్యం ఏడాదంతా ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు సరఫరా చేసే స్థితిలో ఉన్నాం. ప్రస్తుత యాసంగిలో రైతులు పండించిన వడ్లు కొనుగోలు చేస్తున్నాం. వాటిని మరపట్టిస్తే సన్నబియ్యం నిల్వలు మరింత పెరుగుతాయి. ఘంటా శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ


# ఆలోచన మారుతోంది..!

మిర్యాలగూడ : మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం కోసం మళ్లీ ఐటీఐ చేసి లైన్‌మెన్‌గా ఉద్యోగం సాధించాడు.
వేములపల్లి మండలానికి చెందిన ఓ యువకుడు సాధారణ డిగ్రీ పూర్తి చేసి అనంతరం ప్రత్యేక కోర్సులు చేసి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించాడు. మిర్యాలగూడకు చెందిన ఓ యువకుడు ఎంబీఏ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగ అవకాశం కోసం వేచి చూస్తూ ఆ విరామ సమయంలో ప్రైవేట్ పని చేసుకుంటూనే చదువుకుని..ఎట్టకేలకు ప్రభుత్వ కొలువు సాధించాడు.

నాలుగైదు ఏళ్ల క్రితం వరకు గ్రామం, పట్టణం అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఇంజినీరింగ్, మెడిసిన్ చదివించాలని, యువత సైతం తమ స్నేహితులు, ఇరుగు పొరుగు వారిని చూసి అవే కోర్సుల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అనుకునే వారు. అయితే ఆయా కోర్సుల్లో విపరీతమైన పోటీ పెరగడం, నూతన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోలేకపోవడం, ఆర్థిక పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లా యువత తీరు మార్చుకుంటున్నారు. త్వరగా జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో చదువుతో పాటు ఏకకాలంలో భౌతిక శిక్షణ అందించే వృత్తి విద్య కోర్సుల వైపు చూస్తున్నారు.

**వృత్తి విద్య కోర్సులు అనేకం..**

పదోతరగతి, ఇంటర్ పూర్తయిన తర్వాత వృత్తి విద్య కోర్సులు అనేకం ఉన్నాయి. పదో తరగతి తర్వాత పారా మెడికల్, ఐటీఐ, డిప్లొమా



వంటి కోర్సులు అందుబాటులో ఉండగా..ఇంటర్ తర్వాత అకౌంటింగ్, ట్యాక్సేషన్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, హాస్పిటాలిటీ, టూరిజం, రిటైల్ మార్కెటింగ్, ఆక్వా కల్చర్, క్రిటికల్ కేర్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటో మొబైల్, వ్యవసాయం, ప్రింటింగ్ టెక్నాలజీ, జర్నలిజం వంటివి అందుబాటులో ఉన్నాయి.

**డిప్లొమాతో ఉద్యోగం సాధించాను** నేను ఇంటర్ అనంతరం వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంలో డిప్లొమా పూర్తి చేశాను. అనంతరం ప్రవేశ పరీక్షలో 400వ ర్యాంకు సాధించి ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో చేరాను. అనంతరం పవర్ ప్లాంటు ఇంజినీరింగ్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేసి..తమిళనాడు, ఒడిషాలోని థర్మల్ పవర్ ప్లాంట్లలో కొన్నేళ్లు ఉద్యోగం చేశా. ఆ తర్వాత 2018లో డిప్లొమా అర్హతతో విద్యుత్తు శాఖలో సబ్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాను. త్రిపురారం, మిర్యాలగూడలో పని చేసి..ప్రస్తుతం వేములపల్లిలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. బి.కృష్ణారెడ్డి, విద్యుత్తు సబ్ ఇంజినీర్, వేములపల్లి.

# చింతపండు.. ఉపాధి మెండు

చేగుంట: చింతపండు కాలం వస్తే పలువురికి ఉపాధి లభిస్తుంది. మార్చి, ఏప్రిల్‌లో కూలీలకు ఉపాధి లభిస్తుండగా, వ్యాపారులకు తోడ్పాటును అందిస్తుంది. పలు గ్రామాల్లో కూలీలు పండు కొడుతూ దాని నుంచి చింత గింజలను తీయటంలో నిమగ్నమై ఉంటున్నారు. నెలల్లో రూ.కోట్ల విలువ చేసే చింతపండు చేగుంట, నార్సింగి మండలాల నుంచి హైదరాబాద్‌కు రవాణా జరుగుతుంది.

**రూ.400 వరకు కూలీ**

ప్రస్తుతం వ్యవసాయ పనులు లేని సమయంలో చాలా మంది మహిళలకు చింతపండు కొట్టడం కల్పతరువుగా మారింది. జిల్లాలో చేగుంట మండలం అనంతసాగర్, ఉల్లితిమ్మాయిపల్లి, రుక్మాపూర్, నార్సింగి మండలం భీంరావుపల్లి గ్రామాల ప్రజలు చింతపండు కొట్టి హైదరాబాద్‌కు రవాణా చేయటంలో ప్రసిద్ధి. గత 66 ఏళ్ల నుంచి ఈ వ్యాపారం చేస్తున్నారు. మహిళలు రోజుకు సుమారు రూ.400 వరకు సంపాదిస్తున్నారు. ప్రతి గ్రామంలో 100 మంది వరకు ఉపాధి పొందుతున్నారు. నీడపట్టులో పని కాబట్టి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కూలీలు ప్రతి రోజు 40కిలోల వరకు పండు కొట్టి గింజలు, నార వేరు చేస్తుంటారు. ఒక్కో కూలీ రెండు నెలల్లో సుమారు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నారు. సెర్ప్ అధికారులు ప్రోత్సహిస్తే మరింత ముందుకు సాగేందుకు వీలుంటుంది.

**వ్యాపారులే వచ్చి కొనుగోలు**

ఏటా ఈ గ్రామాల నుంచి రూ.5 కోట్ల విలువైన చింతపండు హైదరాబాద్‌కు రవాణా అవుతుంది. వ్యాపారులే వచ్చి కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. రైతుల వద్ద నుంచి కిలో రూ.35 వరకు కట్టెపండు(గింజతో ఉన్నది) కొనుగోలు చేస్తుంటారు. ఈసారి దిగుబడి తగ్గడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. వ్యాపారస్థులు కొని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. ధర ఎక్కువగా ఉన్న సమయంలో విక్రయిస్తుంటారు. గింజలను కిలో రూ.20 వరకు అమ్ముతుంటారు. నార, పొట్టును కూడా విక్రయిస్తుంటారు.

# నిధులు మంజూరు.. పనులే బేజారు

మెదక్: వర్షపు నీరు వాగుల గుండా వృథాగా పారకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తూ భూమిలోకి ఇంకేలా చేసేందుకు చెక్‌డ్యాంలు నిర్మిస్తుంటారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడాదిన్నర కిందట మంజూరైన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాగులపై రూ.22.75 కోట్లతో 10 చెక్‌డ్యాంల నిర్మాణానికి 2023 ఆగస్టులో ప్రభుత్వం అనుమతులిచ్చింది. దానికి సంబంధించిన పనులకు టెండర్లు పిలిచారు. గుత్తేదారులు షెడ్యూల్ వేశారు. ఒప్పందం చేసుకునే సమయంలోనే ఎన్నికలు రావడంతో పనులు పక్కనబెట్టారు. ఆ తరవాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పనుల స్థితిగతులుపై ఆరా తీశారు. మళ్లీ పనులు చేసేందుకు గతేడాది జులైలో ప్రభుత్వం పచ్చజెండా ఊపినా.. ఇప్పటికీ ప్రారంభం కాలేదు.

**వెంటనే నిర్మిస్తే ప్రయోజనం..**

నిర్మాణ పనులు వెంటనే మొదలు పెడితేనే వర్షాకాలం వచ్చే నాటికి పూర్తి చేసే అవకాశముంటుంది. లేదంటే వానలు ప్రారంభమైతే పనులు సాగడం కష్టం. ఇప్పటికే రెండేళ్లు కురిసిన వర్షపు నీరంతా వాగుల గుండా వృథాగా పోయింది. వాగుల్లో నిర్మించే ఒక్కో చెక్‌డ్యాం చుట్టూ సుమారు పది కి.మీ.ల మేర భూగర్భ జలాలను స్థిరీకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా వందల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరుగుతుందంటున్నారు. దీంతో పంట దిగుబడులు అధికమయ్యే అవకాశముంటుంది. పనులను తక్షణమే ప్రారంభించాలని అన్నదాతలు కోరుతున్నారు.గుత్తేదారుతో మాట్లాడుతున్నాం..: శ్యాం, డీఈఈ, చేర్యాల సబ్ డివిజన్ఏడాదిన్నర కిందటే నిధులు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల కారణంగా పనులు మొదలు కాలేదు. తరవాత మళ్లీ కొత్త ప్రభుత్వం ఆ పనులు ప్రారంభించాలని చెప్పింది. ఆ దిశగానే ముందుకు సాగుతున్నాం. గుత్తేదారుతో మాట్లాడుతున్నాం. ఒప్పుకుంటే పనులు ప్రారంభిస్తాం.

# మక్కల రవాణాకు ఆన్‌లైన్ టెండర్లు



ఖమ్మం : మొక్కజొన్నల రవాణాకు ఈసారి ఆన్‌లైన్ విధానంలో టెండర్లు నిర్వహించాలని మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఏటా ప్రకటన ఇచ్చి మాన్యువల్ పద్ధతిలో ప్రక్రియను నిర్వహించేవారు. ఈసారి నుంచి పౌర సరఫరాల సంస్థ మాదిరిగానే ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్లతో జూమ్ సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు నిల్వలను తరలించేందుకు సంస్థ ఈసారి కొత్త విధానం అమలుచేస్తోంది.

**కొనుగోలు కేంద్రాల పెంపుపై దృష్టి...**

ఖమ్మం జిల్లాలో గతేడాది రైతులు 65 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. ఈసారి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. సుమారు 1.05 లక్షల ఎకరాల్లో సాగైంది. చింతకాని, బోనకల్లు, కొణిజర్ల, వైరా, ముదిగొండ, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో ఈ పంట సాగవుతోంది. ఏప్రిల్ రెండో వారంలో పంట చేతికొచ్చే అవకాశం ఉన్నందున అందుకనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలి. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 35 క్వింటాళ్ల లెక్కన ఒక్క ఖమ్మం జిల్లాలోనే 3.50 లక్షల క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంది. గతేడాది 35 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈసారి పెరిగిన పంట విస్తీర్ణానికి అనుగుణంగా కేంద్రాల సంఖ్య లేకుంటే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. కనీసం లక్ష క్వింటాళ్ల సరకును రైతుల నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 16,938 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగైంది. ఇక్కడ గతేడాది 15 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి కేంద్రాల సంఖ్య పెంచాలని రైతులు కోరుతున్నారు.

**రైతులకు సహకారం...**

రైతులకు అవసరమైన సంచులను మార్క్‌ఫెడ్ సరఫరా చేస్తుంది. రవాణా ఖర్చులు సైతం భరిస్తుంది. ప్రభుత్వం ఈసారి మక్కలు క్వింటాకు రూ.2,225 చొప్పున కనీస మద్దతు ధర ప్రకటించింది. ఇది రైతులకు కొంత ఊరట కలిగించే విషయం.
ఖమ్మం జిల్లాలో మిరప పంట దారుణంగా దెబ్బతిన్న కారణంగా చాలామంది రైతులు తోటలు తొలగించి మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.50 వేల వరకు నికరాదాయం వస్తుందన్న భరోసా రైతుల్లో వ్యక్తమవుతోంది.

# కాల్వ కట్టి.. కష్టాలు తీర్చి



నర్సాపూర్: చినుకుపడితే వణికిపోయే కాలనీలో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రూ.లక్షల వ్యయంతో మురుగు కాల్వ నిర్మాణం చేపడుతున్నారు. దీంతో చుక్క వరద నీరు కూడా కాలనీలోకి ప్రవేశించే అవకాశం ఉండదు. కొన్నేళ్లుగా ముంపు సమస్యతో నరకం చూసిన కాలనీ ప్రజలు మురుగు కాల్వ నిర్మాణంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. 'ఈనాడు'లో ఎన్నోసార్లు కథనాలు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించారు. నర్సాపూర్ పురపాలిక పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలోని ప్రధాన సమస్య పరిష్కారంపైకథనం...

**కుంటను పూడ్చడంతో..**

భారీ వర్షాలు పడితే చాలు నర్సాపూర్ 9వ వార్డులోని విఘ్నేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తేది. కాలనీ పైభాగంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కుంటను పట్టణ ప్రగతిలో భాగంగా రూ.20లక్షలు వ్యయం చేసి పురపాలిక అధికారులు పూడ్చివేశారు. దీని స్థానంలో ఉద్యానం ఏర్పాటు చేస్తామన్నారు. అది కాస్త అటకెక్కింది. కుంటలోకి వచ్చే వరద నీటిని దారి మళ్లించడానికి మురుగు కాల్వ నిర్మించడం చేపట్టేందుకు పుర అధికారులు నాలుగేళ్ల క్రితం ప్రణాళికలు రూపొందించారు. రూ.35లక్షల నిధులు కేటాయించారు. గతేడాది పనులు ప్రారంభించిన గుత్తేదారు 250 మీటర్ల పొడవునా కాల్వ పనులు చేపట్టాల్సి ఉండగా రూ.11లక్షల వ్యయంతో 93మీటర్ల పొడవునా కాల్వ పనులు పూర్తిచేశారు. భారీ వర్షాలు కురవడంతో మధ్యలోనే నిలిపివేశారు. రెండేళ్ల పాటు పనులు ప్రారంభం కాలేదు. దీంతో మురుగు ముందుకు సాగక పారిశుద్ధ్యం లోపించింది.

**మురుగు ఇళ్లలోకి చేరి..**

ప్రస్తుతం మురుగు కాల్వ పనులు ప్రారంభం కావడంతో విఘ్నేశ్వర కాలనీ వాసుల ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. గతంలో అసంపూర్తి పనులతో వర్షం పడితే చాలు కాల్వ మురుగంతా కాలనీలోని ఇళ్లలోకి ప్రవేశించేది. ఇళ్ల లోనికి వరద నీరు వచ్చేది. నీటితో పాటు మురుగు, చెత్తాచెదారం, మట్టి, ఇసుక, విష పురుగులు, కప్పలు రోడ్లపైకి వచ్చేవి. ఈనేపథ్యంలో పురపాలిక అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి సాధారణ సమావేశంలో పలుమార్లు తీర్మానాలు చేశారు. రూ.35లక్షల నిధులు కేటాయించి పనులు పునఃప్రారంభంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతి కొంత.. తరలింపు కొండంత



రెబ్బెన : ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతోంది. ఒక్క ట్రాక్టర్‌కు అనుమతి తీసుకొని పదుల సంఖ్యలో తరలిస్తూ దందా కొనసాగిస్తున్నారు. దొరికితే దొంగ, లేదంటే దొర అన్నచందంగా సాగుతోంది. రాత్రింబవళ్లు అడ్డూఅదుపు లేకుండా జరుగుతున్నా అడిగేవారు కరవయ్యారు. అప్పుడప్పుడు రెండు, మూడు ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్నారే తప్పితే.. పూర్తి చర్యలు లేవని, తెల్లవారితే మళ్లీ కొనసాగడం షరా 'మామూలే'నని విమర్శలు వస్తున్నాయి.
జిల్లాలోని రెబ్బెన మండలం లక్ష్మీపూర్, గంగాపూర్, రాళ్లపేట, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, అందవెల్లి తదితర వాగుల వద్ద లభించే నాణ్యమైన ఇసుకకు డిమాండ్ ఉండటంతో.. కొంత మంది దీనినే వ్యాపారంగా మల్చుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా తమకు అనుకూలమైన ప్రాంతాల్లో కుప్పలు పోసి, రాత్రి వేళల్లో పట్టణ ప్రాంతాలకు లారీల ద్వారా తరిస్తున్నారు. పులికుంట వాగు నుంచి నిత్యం ఇసుక అక్రమ దందా జరుగుతోంది. గోలేటి ప్రాంతంలో జరిగే సింగరేణి, ఇతర పనులకు వాగును అడ్డాగా మార్చుకుని అక్రమ రవాణా చేస్తున్నారు. రాళ్లపేట, గొల్లగూడ, దేవులగూడ, గోలేటి క్రాసు రోడ్డు సమీపంలోని వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక నిల్వచేసి, రాత్రి వేళల్లో జేసీబీ సాయంతో లారీల్లో తరలిస్తున్నారు. రాళ్లపేట, గొల్లగూడ, నక్కలగూడ, తదితర ప్రాంతాల్లో అక్రమంగా రవాణా చేసేందుకు వందల సంఖ్యలో ఇసుక కుప్పలు నిల్వ ఉండటం, వాటిని అధికారులు సీజ్ చేయడం, మళ్లీ కుప్పలు పోయడం కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది.

**జరిమానాలు పట్టించుకోవట్లే!**

ఒక ట్రాక్టర్ ఇసుక ట్రిప్పునకు అనుమతి తీసుకొని, అయిదారు ట్రిప్పులు తరలిస్తున్నారు. ఒకవేళ అధికారులకు పట్టుబడినా, ఎన్నిసార్లు ట్రాక్టర్ పట్టుబడినా రూ.5 వేలకు మించి జరిమానా విధించకపోవడంతో.. యాజమానులు తేలికగా తీసుకుంటున్నారు. జరిమానా కట్టి వాహనాలను విడిపించుకుని మళ్లీ దందా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో అయితే ఇసుక రవాణాకు అడ్డేలేకుండా పోతోంది.

**ఆ వాగు.. దళారుల సిరి**

నాణ్యమైన ఇసుక లభించే లక్ష్మీపూర్, రాళ్లపేట వాగులు దళారులకు వరంగా మారాయి. అనుమతులతో కొన్ని, లేకుండా మరి కొన్ని ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నాయి. కొందరు ట్రిప్పు కోసం రెవెన్యూ కార్యాలయంలో డబ్బులు చెల్లించిన పత్రం చూపించకపోగా.. మరి కొంతమంది ట్రాక్టర్ డ్రైవర్లు యజమానివద్ద ఉందని చెబుతూ మభ్యపెడుతున్నారు. వాగుల్లో ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తుండటంతో.. భూగర్భ జలాలు పడిపోతున్నాయి. మరోవైపు ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే కొంతమేరకైనా అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**చర్యలు తీసుకుంటాం**

అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తీసుకుంటాం. పట్టుబడిన ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్నాం. ఇప్పటికే సీజ్ చేసిన కుప్పలకు వేలం కూడా వేశాం.పి.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ రెబ్బెన

# బుగ్గి కాకముందే.. ఆర్పాలి అగ్గి!


కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఏటా వేసవిలోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఆయా ఘటనలు అపార నష్టాలను మిగుల్చుతున్నాయి. అసలు ప్రమాదాలకే ఆస్కారం లేకుండా అప్రమత్తమైతే నష్ట తీవ్రతను తగ్గించవచ్చు. ఈ విషయమై సంబంధిత అగ్నిమాపక, ఇతర శాఖలు ముందే అప్రమత్తం కావాలి. ప్రజల్ని చైతన్యపరచాలి.

**ప్రమాదాలకు ముఖ్య కారణాలు**

సాగు పనులు పూర్తయ్యాక పంట వ్యర్థాలకు రైతులు నిప్పంటించడం.
నాణ్యత లేని విద్యుత్తు ఉపకరణాలు, పరికరాలతో షార్ట్‌సర్క్యూట్‌లు సంభవించడం.
విద్యుత్తు తీగలకు సమీపంలో గడ్డివాములు ఏర్పాటు చేయడం.
వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల షార్ట్‌సర్క్యూట్ తలెత్తి మంటలు చెలరేగడం.సిగరెట్, చుట్ట, బీడీల పీకలను నిర్లక్ష్యంగా పడేయడం.
ప్లాస్టిక్ ఉత్పత్తుల పరిశ్రమలు, దుకాణాల్లో అగ్నిమాపక వ్యవస్థలేకపోవడం. వంట గదుల్లో సిలిండర్ రెగ్యులేటర్లను బంద్ చేయకపోవడం.

**కొత్త కేంద్రాల ఊసేదీ...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కూసుమంచి, వైరా, మధిర, సత్తుపల్లి, నేలకొండపల్లి, భద్రాచలం, పినపాక, మణుగూరు, కొత్తగూడెం, అశ్వారావుపేట, ఇల్లెందులో ప్రస్తుతం అగ్నిమాపక కేంద్రాలున్నాయి. ప్రస్తుత జనాభా అవసరాలకనుగుణంగా కొత్తగా గుండాల, కల్లూరు, జూలూరుపాడు(ఏన్కూరు), పాల్వంచ, చర్ల, పెనుబల్లి, బోనకల్లు ప్రాంతాల్లో కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అవి కార్యరూపం దాల్చలేదు.




ఒక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు డ్రైవర్లు/ఆపరేటర్లు, పది మంది ఫైర్‌మెన్లు, ఇతర కార్యాలయ సిబ్బంది ఉండాలి. కానీ, ఉభయ జిల్లాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. భద్రాద్రి జిల్లాలో 50కి గాను 29 మంది ఫైర్‌మెన్లు మాత్రమే ఉన్నారు. ఖమ్మం జిల్లాదీ ఇదే పరిస్థితి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాఠశాలలు, షాపింగ్‌మాల్స్, ఆసుపత్రుల్లో ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేసుకోవాలి.
సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్లను అందుబాటులో ఉంచుకోవాలి.
విద్యుత్తు ప్రమాదాల నియంత్రణకు సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి.
బీ వంట పూర్తికాగానే సిలిండర్ రెగ్యులేటర్లను ఆపివేయాలి.
ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే ఇంట్లోని విద్యుత్తు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.
గ్రామీణ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా నిప్పంటించకుండా, సిగరెట్ పీకలు పడేయకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలి. బీ ప్రమాదం సంభవిస్తే ఆలస్యం చేయకుండా '101, 100' టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారమివ్వాలి. 'వేసవిలో అగ్ని ప్రమాదాల నియంత్రణకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం ఇటీవల కొత్తగూడెం, భద్రాచలం కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున అదనపు ఫైర్ ఇంజిన్‌ను మంజూరు చేసింది. ఫైర్‌మెన్లు సహా మిగతావారు తగిన స్థాయిలో ఉన్నారు. గుండాల, చర్లలో వెంటనే కొత్త కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ప్రజల్ని అప్రమత్తం చేస్తాం'. – క్రాంతికుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి, భద్రాద్రి

# విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.
సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహమూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

# అత్యాధునిక వైద్యపరికరాలు రాక

అనంతపురం : ప్రభుత్వ వైద్యశాలలో కొన్ని పరీక్షలు, శస్త్రచికిత్సలు చేసేవారు కాదు. దీంతో రోగులు వ్యయప్రయాసలతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించేవారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం.. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోగులకు అవసరమయ్యే వైద్యసేవలు అన్నీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకొంటోంది. ఈమేరకు అనంతపురంలోని సూపర్‌స్పెషాలిటీ, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రూ.6.50 కోట్లకు పైగా విలువైన ఆధునిక వైద్యపరికరాలను సరఫరా చేసింది. ఇందులో రూ.60లక్షలు విలువ చేసే నాలుగు ల్యాప్రోస్కోపీలు, రూ.39లక్షలు విలువ చేసే టూడీ ఎకోమిషన్, రూ.47లక్షలు విలువ చేసే రెండు అల్ట్రాసౌండ్ మిషిన్లు, రూ.65 లక్షలు విలువ చేసే 10 అనస్తీషియా వర్క్‌స్టేషన్లతో పాటు మల్టీ పారామానిటర్స్, వెంటిలేటర్లు, పల్మనరీఫంక్షన్ యంత్రం తదితరాలు



ఉన్నాయి.

**తప్పనున్న తిప్పలు!**

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ల్యాప్రోస్కోపీ ఒకటే ఉండటంతో ఎక్కువ శస్త్రచికిత్సలు చేయడం ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం అదనంగా మూడు ఇవ్వటంతో శస్త్రచికిత్సలు ఎక్కువమందికి చేసే వీలు కలుగనుంది. సూపర్ స్పెషాలిటీలో సీటీవీఎస్, పీడియాట్రిక్ సర్జరీ విభాగాల్లో టూడీఎకో లేదు. ప్రస్తుతం రెండు విభాగాలకు ఇవ్వటంతో రోగులకు వ్యయప్రయాసలు తప్పనున్నాయి. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు హైఎండ్ అల్ట్రాసౌండ్ యంత్రం కేటాయించటంతో కాలేయంలో నెలకొనే దీర్ఘకాలిక సమస్యలకు సంబంధించిన వివిధ పరీక్షలు చేయడానికి మార్గం సుగమం కానుంది.

**త్వరలో అందుబాటులోకి తెస్తాం**

డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలఆధునిక పరికరాలు వచ్చాయి. ప్రస్తుతం క్రిటికల్ కేర్, సర్జికల్‌బ్లాక్ పూర్తికాకపోవటంతో వాటిని సర్వజన, సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలల్లో వినియోగించాలని నిర్ణయించాం. ఆయా ఆసుపత్రులలో రోగుల అవసరం మేరకు త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తాం.

# పోస్టులు ఖాళీ.. పర్యవేక్షణ కరవు..!

విశాఖపట్నం : జిల్లా పౌర సరఫరాల శాఖలో సరకుల పంపిణీపై సరైన నిఘా లేకపోవడంతో, దొడ్డిదారిన తరలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (డీసీఎస్ఓ) పోస్టు రెండు నెలల నుంచి ఖాళీగా ఉంది. ఇక్కడ డీసీఎస్ఓగా పని చేసిన భాస్కర్‌రావును డిప్యుటేషన్‌పై విజయవాడలోని పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయ ఓఎస్డీగా నియమించారు. అప్పటి నుంచి ఇంఛార్జి బాధ్యతల్ని ఏఎస్ఓ కల్యాణికి అప్పగించారు. దీంతో నేటికీ పూర్తిస్థాయి డీసీఎస్ఓ నియామకం జరగలేదు.

రాష్ట్రంలోనే పెద్ద నగరమైన జిల్లాకు పూర్తిస్థాయి డీసీఎస్ఓను నియమించాలని జాయింట్ కలెక్టర్(జేసీ) ఇప్పటికే పలుమార్లు శాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. జిల్లాకు నాలుగు ఏఎస్ఓ (సహాయ సరఫరా అధికారి) పోస్టులు ఉంటే ప్రస్తుతం ముగ్గురే విధుల్లో ఉన్నారు. ఓ పోస్టు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంది.

జిల్లాలో 625 రేషన్ డిపోలు, 350 మంది ఎండీయూ ఆపరేటర్లు, 5.25 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా 8వేల టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాకు అందిస్తున్న రాయితీ బియ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలకు రూ.33.60 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న జిల్లాలో అధికారుల నిఘా కొరవడింది.

**సమన్వయ లోపం..!**



అధికారుల మధ్య సమన్వయ లోపంతో తనిఖీలు సరిగా జరగడం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం సెలవులో ఉన్న ఓ సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ స్థానంలో ఇంఛార్జికి బాధ్యతలు అప్పగించారు. అయినా సరే సెలవులో ఉన్న అధికారి "ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయంటూ" తరచూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతూ, ఎండీయూ ఆపరేటర్లను బెదిరిస్తుండడంతో... విధుల్లో ఉన్న ఇంఛార్జి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదు.

కొద్దిరోజుల కిందట రైల్వే న్యూకాలనీలో ఓ డిపో డీలర్ మృతి చెందితే.. కొత్త డీలర్ నియామక వ్యవహారంలోనూ గందరగోళం నెలకొంది. దీంతో ఈ అంశం కోర్టు వరకు వెళ్లింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం కొత్త డీలర్‌ను నియమించకుండా ఇంఛార్జికి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికైనా పౌర సరఫరాల శాఖపై జేసీ దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. అయితే తమకు అందుతున్న ఫిర్యాదుల మేరకు అక్రమార్కులపై నిఘా ఉంచుతున్నామని ఇంఛార్జి డీసీఎస్ఓ కల్యాణి తెలిపారు. **నామమాత్ర తనిఖీలు...** ఇటీవల నల్లబజార్‌కు తరలిపోతున్న 8 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించడంతో పౌర సరఫరాల శాఖ అధికారులు అప్రమత్తమై.. తాటిచెట్లపాలెం, మధురవాడ డిపోల్లో సోదాలు చేశారు. అక్కడ నిల్వలకు మించి సరకులు ఉండడంతో రెండు డిపోలతో పాటు, మరో ఎండీయూ ఆపరేటర్‌పై 6ఎ కేసు పెట్టారు. ఫిబ్రవరి నెలలో అసలు కేసులే నమోదు కాలేదు.

# నేలకు సారం.. అన్నదాతకు ఆనందం



చిత్తూరు : సూక్ష్మపోషకాల వినియోగంతో పంట దిగుబడి 8శాతం నుంచి 15శాతం పెరుగుతుందన్న పంట కోత ప్రయోగాల్లో తేలింది. జిప్సం వినియోగిస్తే వేరుసెనగ ఉత్పత్తి ఎకరాకు 2.20క్వింటాళ్ల నుంచి 3.15 క్వింటాళ్ల వరకు అధికంగా వచ్చింది. వరి, కంది, మామిడి, పండ్ల తోటలు, కూరగాయల పంటల్లోనూ దిగుబడులు పెరిగాయని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులే వెల్లడించారు. ఇంత ప్రాధాన్యం ఉన్న జిప్సం, జింక్‌సల్ఫేట్, బోరాన్ సరఫరాకు గత వైకాపా ప్రభుత్వం కోత పెట్టింది. రైతులకు గుండెకోత మిగిల్చింది. అన్నదాత ఆవేదనను అర్థం చేసుకున్న 'కూటమి' ప్రభుత్వం రైతులకు ఉచితంగా వీటిని సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు జిల్లాలో నల్లరేగడి, ఎర్రరేగడి నేలలు విస్తారంగా ఉన్నాయి. వీటిలో క్షార గుణం మధ్యస్తంగా ఉన్నట్లు సేంద్రియ కర్బనం తక్కువగా ఉన్నట్లు 2018లో కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో పోషకాల లోపం ఉందని భూసార పరీక్షల్లో తేలింది. 35-40 శాతం నేలల్లో జింక్, 25శాతం నేలల్లో ఇనుము, ఐదు శాతం భూముల్లో మాంగనీసు, ఐదు శాతం నేలల్లో కాపర్, 20 శాతం నేలల్లో బోరాన్, 20-25శాతం నేలల్లో సల్ఫర్ లోపం ఉన్నట్లు గుర్తించారు.

**తెదేపా పాలనలో ఉచితంగా..**

గతంలో తెదేపా హయాంలో రైతులకు సూక్ష్మపోషకాలు ఉచితంగా అందజేశారు. జిప్సం 29,200 టన్నులు, జింక్ 1250 టన్నులు, బోరాన్ 90 టన్నులు పంపిణీ చేశారు. ఏటా రూ.9కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.40-42కోట్లు వెచ్చించారు. దీంతో రైతులకు పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగింది. వైకాపా అధికారంలోకి వచ్చాక సూక్ష్మపోషకాల రాయితీని 50 శాతానికి సగానికి తగ్గించారు. 2018-19లో మిగిలి ఉన్న నిల్వలు పంపిణీ చేశారు. ఆ తర్వాత వీటి పంపిణీ పూర్తిగా ఎత్తేశారు. రైతులు అడిగినప్పటికీ పట్టించుకోలేదు.

**ఉద్యాన రైతులకు ఉపయుక్తం..**

జిల్లా ఉద్యాన పంటల సాగుకు నిలయం. జిల్లాలో 73-75 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా మామిడి 55-40 వేల హెక్టార్లలో ఉండగా.. మిగిలిన విస్తీర్ణం టమాటా, కూరగాయలు, పండ్ల తోటలు ఉన్నాయి. ఉద్యాన పంటలకు సూక్ష్మపోషకాల వినియోగంతో నాణ్యమైన అధిక పంట ఉత్పత్తులు లభిస్తాయి. ఉచితంగా సూక్ష్మపోషకాల పంపిణీ నిర్ణయంతో ఉద్యాన రైతులకు ఎంతో లాభదాయకం కానుంది.

**జిల్లాలో సాగు వివరాలిలా..**

ఖరీఫ్ సాగు : 91,360 హెక్టార్లు
రబీ సాగు : 29,050 హెక్టార్లు
ఉద్యాన పంటల సాగు : 58 వేల హెక్టార్లు
రైతుల సంఖ్య : 3.25 లక్షలు

# సేవలెలా ఉన్నాయి గోవిందా..!



తిరుమల : శ్రీవారి భక్తుల వందశాతం సంతృప్తే లక్ష్యంగా తితిదే అధికారులు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే వారి అభిప్రాయాలు సేకరించి తితిదేలోని అన్ని విభాగాల్లో తమ పనితీరు మెరుగుపర్చుకుంటున్నారు. గత ప్రభుత్వంలో భక్తుల అభిప్రాయాలకు విలువలేకుండా ఇష్టారీతిన వ్యవహరించడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో అన్ని విభాగాల సేవలపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి దిశానిర్దేశం చేస్తున్నారు. ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టి ఫలితాలు తీసుకువస్తున్నారు.

**అభిప్రాయాలు ఇలా**

76% : రథసప్తమి సందర్భంగా తితిదే సేవలపై భక్తుల సంతృప్తికర స్థాయిని వ్యక్తం చేశారు. మరో 22% బావుందని, ఒకశాతం పర్వాలేదని, మరొకత శాతం మంది బాగాలేదని వెల్లడించారు.

74% : వైకుంఠం ఏకాదశి రోజున సేవలపై భక్తులు బావున్నట్లు వెల్లడించారు. మార్చి 9 నుంచి 14వ తేదీ వరకు సాధారణ రోజుల్లో తిరుమలకు వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధికస్థాయి సంతృప్తిని వ్యక్తం చేశారు.

**క్యూఆర్ కోడ్‌ల ఏర్పాటు**

తితిదే వివిధ రకాల సేవలు, సౌకర్యాలపై అభిప్రాయ సేకరణ చేపడుతోంది. శ్రీవారి దర్శనం, లడ్డూప్రసాదం, అన్నప్రసాదం, వసతి, దాతల విభాగంతోపాటు ఇతర విభాగాల వద్ద క్యూఆర్‌కోడ్‌లు ఏర్పాటు చేశారు. భక్తులు తమ చరవాణిలో వాటిని స్కాన్‌చేసి అభిప్రాయాన్ని వెల్లడించవచ్చు. ఎదురైన ఇబ్బందులు, సరిచేయాల్సిన అంశాలపై సూచన చేయవచ్చు.

క్యూలైన్ల నిర్వహణ, సౌకర్యాలపై 65%, వసతి, శుభ్రతపై 74%, లడ్డూ రుచి నాణ్యత, అన్నదానం, కల్యాణకట్ట, తితిదే ఉద్యోగుల ప్రవర్తన, లగేజీ విధానంపై 77% సంతృప్తి వ్యక్తమైంది.

మొత్తంగా ఐవీఆర్ఎస్ సర్వేలో 61 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేయగా, 27 శాతం పర్వాలేదని, 12 మంది భక్తులు బాగాలేదని వెల్లడించారు. భవిష్యత్తులో వందశాతం సంతృప్తికర సేవలు లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. ఇందుకు తితిదే ఛాట్‌బాట్ ద్వారా సమస్త సమాచారాన్ని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

# ప్లాట్లు కొంటే పాట్లు ఉచితం



నాయుడుపేట : జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రహదారులు, పట్టణ ప్రాంతాలు, పారిశ్రామికవాడలకు దగ్గర భూములను స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. రాజకీయ నాయకుల అండతో ప్రైవేట్ భూములు, చెరువులు, వాగులు నది పోరంబోకు స్థలాలు సమీప ప్రాంతాల్లోనే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇలాంటి లే అవుట్లలో ప్లాట్లు కొంటే భవన నిర్మాణాలకు అనుమతులు పొందలేక పాట్లు పడాల్సి వస్తోందని పలువురు బాధితులు వాపోతున్నారు.

**ఇవే దందా ప్రాంతాలు**

నాయుడుపేటలో ఎల్.ఎ.సాగరం, జువ్వలపాళెం, విన్నమాల, పుదూరు, తుమ్మూరు, బిరదవాడ, మేనకూరు, తాళ్వావాయిపాడు, పెన్నేపల్లి, శిరసనంబేడు, దిగువచావాలి, చిల్లకూరు, బూదనం, శ్రీకాళహస్తి, రేణిగుంట, సూళ్లూరుపేట, గూడూరు పట్టణ ప్రాంతాలకు సమీప గ్రామాల్లోనూ దందా అధికంగా సాగుతోంది.

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చి..** చిట్టమూరు మండలానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి నాయుడుపేట ఎల్.ఎ.సాగరంలో అనధికార లేఅవుట్‌లో 40 అంకణాల ప్లాటు రూ.60 లక్షలతో నాలుగేళ్ల కిందట కొనుగోలు చేశారు. తర్వాత అది ప్రభుత్వ భూమి అని తేలడంతో బాధితుడు మోసపోయాడని పోలీసులను ఆశ్రయించారు. ఇలాంటివే చాలానే ఉన్నాయి.

మేనకూరులోని అక్రమ లేఅవుట్‌లో ఓ వ్యక్తి ప్లాటు కొనుగోలు చేశారు. చివరికి అది మామిడి కాలువ బఫర్‌జోన్ పరిధిలో ఉండటంతో ఇటీవల పెద్ద వివాదం రేగింది. నాయుడుపేట పట్టణంలో భూపయ్య కాలనీ ప్లాట్లు విక్రయించినప్పుడు ఉన్న రోడ్డు తర్వాత లేకపోవడంతో స్థానికులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. **కొనేముందు.. ఇవి చూసుకోండి** ప్లాట్లు కొనేముందు ఎల్‌పీ నంబరు, రేరాలో రిజిస్ట్రేషన్, యాజమాన్య హక్కులు ఎవరి పేరిట ఉన్నాయి.. కోర్టు వివాదాలు ఉన్నాయా? వంటివి పరిశీలించకుంటే మోసపోవ డమే.. గ్రామాల్లో అనధికార లేఅవుట్ల వివరాలు సేకరించి పంచాయతీ కార్యదర్శులు ద్వారా బోర్డులు ఏర్పాటు చేస్తాం. వెంకటరమణ, రవీంద్ర, డీఎల్‌పీవోలు

# నీరుగారిన వైభవం..నిర్లక్ష్య సాగరం

త్రిపురాంతకం : జిల్లాలో తాగునీటి వ్యవస్థకు గుండెకాయలాంటి సాగర్ కాలువల నిర్వహణను గత పాలకులు గాలికొదిలేశారు. దీంతో ప్రధాన కాలువతో పాటు బ్రాంచి, మేజర్, మైనర్ కాలువలు అధ్వానంగా మారాయి. విపరీతంగా కంప పెరిగి కాలువ కరకట్టలు అడవిని తలపిస్తున్నాయి. అనేకచోట్ల సిమెంటు కాంక్రీటు లైనింగ్ దెబ్బతినడంతో కాలువల ఛిద్రమయ్యాయి. అయిదేళ్ల వైకాపా పాలనలో అత్యవసర పనులకు సైతం నిధులు మంజూరు చేయలేదు. గతంలో నీటితో పరవళ్లు తొక్కే కాలువలు నేడు నిస్తేజంగా మారాయి. దీంతో కాలువల్లో పూడిక పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు, తూటాకు పెరిగి నీరు దిగువకు ప్రవహించడం లేదు. దీంతో నీరు నిలిచిపోయి కాలువ కరకట్టలు దెబ్బతింటున్నాయి. **ప్రధాన కాలువనూ పట్టించుకోక..** ప్రధాన కాలువను కూడా పట్టించుకోకపోవడం ఆవేదన కలిగిస్తోంది. వైకాపా హయాంలో మరమ్మతులు విస్మరించడంతో ఏటా సాగర్ నీరు విడుదల చేసినప్పుడు నీరు వాగులకు తరలిపోతోంది. ఫలితంగా చివరి ఆయకట్టు రైతులకు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా ముడివేముల, ఉమ్మడివరం, మిరియంపల్లి మేజర్ కాలువల పరిధిలో చివరి ఆయకట్టు రైతులు ఈ పరిస్థితి ఎదురవుతోంది. కురిచేడులో కాలువల నిర్వాహణ అధ్వానంగా ఉన్నాయి. జిల్లాలో 97 మైళ్ల పరిధిలో ప్రధాన కుడి కాలువతో పాటు దర్శి, పమిడిపాడు, ఒంగోలు బ్రాంచి కాలువలు విస్తరించి ఉన్నాయి. మరో 585 మైళ్ల మేర మేజర్, మైనర్ కాలువలున్నాయి. 10 డీసీలు, 97 సాగునీటి సంఘాలున్నాయి. జిల్లాలో వాటి పరిధిలో 2,55,699 ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. **కూటమిపై కొండంత ఆశలు**కూటమి ప్రభుత్వం సాగర్ కాలువల నిర్వహణకు నిధులు విడుదల చేసి మరమ్మతులు చేపట్టి సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టాలని రైతులు కోరుతున్నారు.

# రొయ్య పంట పై ట్రంప్ దెబ్బ

ఒంగోలు : కూటమి ప్రభుత్వ ప్రోత్సాహకాలతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆక్వా రంగం... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల ప్రభావంతో కుదేలైంది. మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పతనమయ్యాయి. ఇదే పరిస్థితి కొనసాగితే నిండా మునిగిపోక తప్పదని సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుబంధ రంగాలకూ ప్రతికూలతలు తప్పవని విశ్లేషకులు చెబుతున్నారు.

**వంద కౌంట్‌కు రూ.200లే..**

వారం రోజుల కితం వంద కౌంట్ కిలో ధర రూ.250గా ఉంది. అమెరికా సుంకాల ప్రభావంతో మార్కెట్‌లో సంక్షోభం తలెత్తింది. ఒక్క రోజులోనే ధర రూ.40 తగ్గింది. దీంతో రైతుల్లో భయాందోళన నెలకొంది. ప్రస్తుతం 100 కౌంట్ ధర రూ.200 నుంచి రూ.210 వరకు కొనుగోలు చేస్తున్నారు. కానీ వంద కౌంటు వచ్చేందుకు రైతుకు రూ.240 వరకు ఖర్చవుతోంది. చెరువులో వేసిన పిల్ల కనీసం 80 శాతం పెరిగితేనే పెట్టుబడులు వస్తాయి. రూ.240 కంటే ధర తగ్గినా.. ఆశించిన స్థాయిలో పిల్ల పెరగకపోయినా ఎకరాకు రూ.2 లక్షల మేర నష్టం తప్పదని సాగుదారులు వాపోతున్నారు.

**90 శాతం ఎగుమతులే...**

జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో ఆక్వా సాగు ఎక్కువ. సముద్ర ఆటుపోట్ల కారణంగా కాలువల్లో ఉప్పునీటి లభ్యత పుష్కలంగా ఉంటుంది. దీంతో ఏటా రెండు సీజన్లలో పంట సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టైగర్ రకం ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తయ్యే పంటలో 90 శాతం విదేశాలకే ఎగుమతి అవుతుంది. అందులోనూ సింహభాగం అమెరికాకే వెళ్తోంది. పెద్ద కౌంట్ (20, 30, 40) రొయ్యలు అక్కడకు పంపిస్తున్నారు. తరువాతి ప్రాధాన్యంగా జపాన్,



చైనా తదితర దేశాలకు పంపిస్తున్నారు. తద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.3 వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం లభిస్తోంది.

**అనుబంధ రంగాలకూ ఇబ్బందే...**

ఏటా రెండు సీజన్లలో 30 వేల టన్నుల మేర పంట ఉత్పత్తి అవుతోంది. చెరువులపై నిరంతరం పది వేల మంది పని చేస్తుంటారు. కొత్తపట్నం మండలంలోని రాజుపాలెం, గవండ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు ప్రాంతాల్లో హేచరీలు ఉన్నాయి. నాణ్యమైన రొయ్య పిల్లల లభ్యత కారణంగా... పొరుగు జిల్లాల రైతులు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. హేచరీల్లో దాదాపు 12 వేల మందిబీ జిల్లాలో ఉన్న అయిదు ప్రాసెసింగ్ ప్లాంట్ల వద్ద దాదాపు పది వేల మంది ఉపాధి పొందుతున్నారు. మేత, మందుల తయారీ పరిశ్రమలు, జనరేటర్లు అద్దెకు ఇచ్చేవారు, ఐస్ ప్లాంట్లు, రవాణా కార్మికులు వందల్లో ఉన్నారు. పరిశ్రమ దెబ్బతింటే ఈ రంగాలన్నిటి పైనా ప్రతికూల ప్రభావం తప్పదు.

**జిల్లాలో ఆక్వా ముఖచిత్రం...**

సాగు మండలాలు : ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ
విస్తీర్ణం : 18 వేల ఎకరాలు
ఆక్వా రైతులు: 5 వేల మంది
రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాలు : 25

# ఆక్రమణలో వక్ఫ్‌బోర్డు భూములు

కనిగిరి : పొదిలి పట్టణంలోని విలువైన వక్ఫ్ బోర్డు భూములు ఆక్రమణల చెరలో చిక్కుకుంటున్నాయి. ఒంగోలు-కర్నూలు రహదారి పక్కనే వ్యాపారాల నిర్వహణకు అనువుగా ఉండడంతో ఒకరిని చూసి ఒకరుగా ఆక్రమిస్తున్నారు. ముందుగా ఓ పాక నిర్మించి... తరువాత కొనుగోలు చేశామంటూ శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వీటి తొలగింపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**అధికారుల సమీక్ష...**

ఈ భూముల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల ఆదేశించారు. ఈ నేపథ్యంలో వక్ఫ్‌బోర్డు అధికారులు... తహసీల్దారు కార్యాలయంలో కమిటీ, రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులతో రెండు రోజుల క్రితం సమావేశమయ్యారు. గతంలో శాశ్వత



నిర్మాణాలను ఖాళీ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా వ్యతిరేకత ఎదురైంది. ఈసారీ అదే పరిస్థితి తలెత్తే అవకాశం ఉన్నందున రక్షణ కల్పించాలని స్థానిక పోలీసు అధికారులను కోరారు. ఎస్పీ స్థాయిలో ఆదేశిస్తే చర్యలు తీసుకుంటామని వారు చెప్పడంతో... మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి కలెక్టర్ దృష్టికి విషయం తీసుకువెళ్లారు. ఆమె ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**నోటీసులు జారీ...**పొదిలి పట్టణంలో వివిధ సర్వే నంబర్లలో 322 ఎకరాల్లో వక్ఫ్ బోర్డుకు భూములున్నాయి. వీటిలో ఇప్పటికే 51 మంది శాశ్వత గృహాలు నిర్మించుకున్నారు. తాజాగా వీరికి నోటీసులు జారీ చేశారు. 'సదరు స్థలాన్ని ఎవరి వద్ద, ఎప్పుడు కొనుగోలు చేశారన్న ఆధారాలను పదిహేను రోజుల్లో చూపాల'ని అందులో పేర్కొన్నారు. ఇటీవల మరో 15 తాత్కాలిక నిర్మాణాలు వెలిశాయి. వీరంతా రోడ్డు పక్కన దుకాణాలు ఏర్పాటుచేసుకొని... లోపలి వైపు తాత్కాలిక గృహాలు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు వీరికి కరెంటు కనెక్షన్ అందజేయడం గమనార్హం. ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని వక్ఫ్‌బోర్డు అధికారులు పొదిలిలో టాంటాం వేశారు. అనధికార నిర్మాణాలు తొలగించుకోవాలని... లేనిపక్షంలో చర్యలు తప్పవని పేర్కొన్నారు. నగర పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో తాత్కాలిక దుకాణాలు, పాకలు తొలగిస్తామని మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

# కల్యాణ కళ ఎప్పుడు గణనాథా..?

కాణిపాకం: ప్రమథ గణాలకు అధిపతి వినాయకుని చెంత కల్యాణం(పెళ్లి) చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.. ఈమేరకు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో ముహూర్తాల సమయంలో గతంలో వందలాది వివాహాలు జరిగేవి.. ప్రస్తుతం ఆశోభ పూర్తిగా కనుమరుగైంది.. స్వామివారి ఆలయంలో కల్యాణాలు నిర్వహించి మళ్లీ నాటి కళ తీసుకురావాలని, ఇది కూటమి ప్రభుత్వంలో సాధ్యం కావాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు. దేశవిదేశాల నుంచి స్వామివారి దర్శనానికే కాకుండా ఇక్కడ వివాహాలు చేసుకోవడానికి భక్తులు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ఇదే తరహాలో గతంలో ఆలయ అధికారులు కల్యాణాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. గతంలో ఆలయంలో ముహూర్తాల సమయాల్లో అత్యధిక సంఖ్యలో వివాహాలు జరుగుతున్న నేపథ్యంలో భక్తులు చాలా ఇబ్బందులు పడేవారు. దీన్ని గుర్తించి అధికారులు ఒక్కసారిగా వందలాది పెళ్లిళ్లు జరిపేలా ఆలయానికి సమీపంలో రెండంతస్తులతో సామూహిక కల్యాణ మండపాన్ని నిర్మించారు.

**వసతుల కరవు..**

ఆలయం వద్ద వివాహాలు చేసుకోవడానికి అధికంగా పేదలు మొగ్గుచూపేవారు. ఇందుకు ప్రధాన కారణం తక్కువ ఖర్చులతో పెళ్లి చేసుకోవచ్చని నమ్మకం. పేదల నమ్మకాన్ని అధికారులు పూర్తిగా విస్మరించారు. ప్రధానంగా గత వైకాపా ప్రభుత్వంలో వివాహాలు చేసుకోవడానికి కనీస వసతులు కల్పించకపోవడంతో పెళ్లిళ్ల సంఖ్య



వందల నుంచి పదులకు పడిపోయింది. వైకాపా ప్రభుత్వంలో సామూహిక కల్యాణ మండపాన్ని కాస్త అన్నదాన భవనంగా మార్పు చేయడానికి నిర్ణయించి వెంటనే పనులు ప్రారంభించడంతో కనీస వసతులు కరవయ్యాయి. కాణిపాకంలో పేదలకు దూరమైన కల్యాణాలను మళ్లీ కూటమి ప్రభుత్వ హయాంలో అందుబాటులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని కోరుతున్నారు.

**పూర్వ వైభవం తీసుకొస్తాం..**


శ్రీ వరసిద్ధి వినాయకుడి చెంత కల్యాణాలకు పూర్వవైభవం తీసుకొస్తాం. ప్రస్తుతం ఆలయానికి దూరంగా జరుగుతున్న సామూహిక వివాహాలను ఆలయానికి సమీపంలో ఉన్న కల్యాణ మండపానికి మార్పు చేస్తాం. పేదలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం.పెంచల కిషోర్, ఈవో, కాణిపాకం ఆలయం

# బొక్కేస్తున్నారు బకాసురులు

ఎలమంచిలి: మునగపాక మండలం మల్లవరం గ్రామంలో రెండురోజుల కిందట 1,400 కేజీల కోటా బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇదంతా కార్డుదారుల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ ఏడాది మార్చిలో నక్కపల్లి మండలం గుల్లిపాడులో 500 కేజీల కోటా బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. నిల్వలు స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

గతేడాది అక్టోబరులో నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వద్ద 25 టన్నుల వరకు అధికారులు పట్టుకుని సీజ్ చేశారు.

ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో గత ఏడాది 500 కేజీల కోటా బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. దీంతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారింది. ఐదేళ్ల వైకాపా పాలనలో వీరు ఆడిందే ఆటగా మారింది. రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాల వెనుకే కొనుగోలుదారులు తిరుగుతున్నారు. కార్డుదారుడు వాహనం వద్ద తీసుకున్న బియ్యాన్ని ఇంటికి తీసుకెళ్లకుం డా అక్కడే కొనుగోలు చేస్తున్నారు. ఇలా కోటా ఇచ్చిన నాలుగు రోజుల్లోనే వందలాది క్వింటాళ్లు కొనుగోలు చేసి మిల్లులకు పంపిస్తున్నా రు. అక్కడి నుంచి లారీల్లో తరల్తిస్తున్నారు. పట్టపగలే ఈ వ్యవహారం సాగుతున్నా పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే దాడులు చేసి అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నారు. కార్డుదారుల వద్దకు ప్రభుత్వ వాహనంలో బియ్యం తెచ్చి ఇస్తున్నారు. వీరి వెనుకే ఒకరు ఆటోలో వెంబడిస్తూ కార్డుదారుల వద్ద కేజీ రూ. 10 నుంచి రూ. 12కు కొనుగోలు చేస్తున్నాడు. కొన్ని చోట్ల ప్రభుత్వం వాహనంలో ఉండేవారే వేలిముద్ర వేయించుకుని బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇచ్చేస్తున్నారు. సాయంత్రం అయ్యాక ఆ బియ్యాన్ని కేజీకి రూపాయి



లాభం వేసుకుని విక్రయిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని కేజీ రూ. 20లకు మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. మిల్లర్లు వీటికి పాలిష్ పెట్టి కేజీ రూ.40లకు విక్రయిస్తున్నారు. ఈ మాఫియాకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయి. ఇప్పటికీ వీరికి వైకాపా నాయకుల మద్దతు ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో పట్టుకున్న కోటా బియ్యంలో ఎక్కువ శాతం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నవే. పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకుంటున్నది చాలా తక్కువ. మార్కెట్‌లో నూకలు కేజీ రూ.40లకు అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు కోటా బియ్యం కేజీ రూ. 10లకు కొని నూకలు ఆడించి వ్యాపారులకు కేజీ రూ. 30 కు అమ్ముతున్నారు.

**500 కేజీల రేషన్ బియ్యం పట్టివేత**

రాజవొమ్మంగిలో ఒకరి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు తహసీల్దార్ ఎ.సత్యనారాయణ తెలిపారు. రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 11 బస్తాల్లో నిల్వ ఉంచిన దాదాపు 500 కేజీల బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం అక్రమంగా నిల్వచేసిన వ్యక్తిపై 6 ఎ కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జడ్డంగి ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామన్నారు. వీఆర్వో సూర్యకాంతం పాల్గొన్నారు. కేసులు నమోదవుతున్నా రాజవొమ్మంగిలో అక్రమంగా బియ్యం తరలిస్తూ పట్టుబడుతుండటం గమనార్హం.

# అందని జీతం.. ఆగిన జలం



మడకశిర :ఉమ్మడి అనంతపురం జిల్లాలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వందలాది గ్రామాల ప్రజల దాహార్తి తీరుస్తోంది. ప్రారంభం నుంచి ఎంతో మంది కార్మికులు పనిచేస్తూ కుటుంబాలను పోషించుకొంటున్నారు. గుత్తేదార్లు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో చేసేదిలేక 6వ తేదీ నుంచి నీటి సరఫరాను ఆపేసి కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని గ్రామాలు దాహార్తితో తల్లడిల్లాల్సిన పరిస్థితి నెలకొంది.

పథకం నీటిపైనే ఆధారపడి ఉన్న మడకశిర నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇబ్బందులు పడక తప్పే పరిస్థితి కనిపించడం లేదు. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలోని కార్మికులకు ఐదు నెలల జీతాలు, బెళుగుప్ప పరిధిలో ఏడు నెలలు, హిందూపురం పరిధి పది నెలలు, పీఏబీఆర్ డ్యాం పరిధిలోని కార్మికులకు నాలుగు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉంది. దీంతోపాటు 25 నెలల పీఎఫ్ బకాయిలు చెల్లించాలి. గత వైకాపా ప్రభుత్వ పాలనలో పలు మార్లు గోడు వెల్లబోసుకున్నా స్పందన లేదని కార్మికులు వాపోతున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదని చెబుతున్నారు.

పథకం తీరు ఇలా..

నీరు సరఫరా అయ్యే గ్రామాలు: 1,059

రోజుకు సరఫరా చేసేది: 2.67 లక్షల లీటర్లు

కార్మికులు : 630

సూపర్‌వైజర్లు : 20

జీతాల బకాయి: రూ.4 కోట్లు

**జీవనం దుర్భరం..-రాజేష్, ఆపరేటర్, దుద్దేకుంట**

నీటి పథకంలో 14 ఏళ్లపాటు ఆపరేటర్ పని చేస్తున్నా. ప్రస్తుతం రూ.15,200 వస్తుంది. అవి సక్రమంగా రాకపోవడంతో కుటుంబం గడవటం ఇబ్బందిగా ఉంది. పిల్లల చదువులకు అవస్థలు తప్పడం లేదు. సుమారుగా రూ.2.10 లక్షలు అప్పు చేశా.

**సమస్యలతో తల్లడిల్లుతున్నాం-వన్నూరస్వామి, లైన్‌మెన్, కంబదూరు**

ఇటీవల నాకు ఊపిరితిత్తుల సమస్య ఏర్పడింది. ఒక పక్క కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అనారోగ్య సమస్యతో తల్లడిల్లుతున్నాను. వైద్యం చేయించుకోవాలంటే డబ్బులు లేవు. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నాను.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం- సురేశ్, ఎస్ఈ, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం**

గుత్తేదార్లతో చర్చించి రెండు నెలలు జీతాలు వేయించాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇందుకు సంబంధించి గుత్తేదారులకు నోటీసులు ఇచ్చాం. ఏప్రిల్ నెలాఖరుకు జీతాలు అందజేసి ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పాం. మరోసారి కార్మిక సంఘాల నాయకులతో చర్చించి సమస్య పరిష్కరిస్తాం.

# చెరువుల మరమ్మతుల పేరుతో దోపిడీ



గుత్తి : చెరువుల మరమ్మతులు పేరుతో గుత్తి మండలంలో దోపిడీ సాగుతోంది. ప్రతిసారి మరమ్మతులకని ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తున్నారు. తూతూమంత్రంగా పనులు చేస్తూ నిధులు స్వాహా చేస్తున్నారు. ఈనేపథ్యంలో క్షేత్రస్థాయిలోని పరిస్థితిపై కథనం.

గుత్తిమండలంలో జక్కలచెరువు, తొండపాడు చెరువులు వర్షపునీరు చేరితే చాలు కట్టలకు గండ్లుపడుతున్నాయి. మరమ్మతులకు రూ.లక్షలు వ్యయం చేస్తున్నారు.రెండు చెరువుల కింద కేవలం 117.36 ఎకరాల ఆయకట్టు ఉంది. ఎప్పుడు పంటలు సాగు ఉండదు. ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు మాత్రం గండ్లు పూడ్చివేత, కట్టల మరమ్మతుల పేరుతో నిధులు వెచ్చిస్తూ వస్తున్నారు. వర్షపునీటిని ఒడిసిపట్టాలని గత తెదేపా ప్రభుత్వం ఏటా నిధులు విడుదల చేసేది. ఇప్పుడూ కూడా కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వనుంది. చేసిన పనులనే తిరిగి చేయించాల్సి వస్తోంది.

**ప్రతిసారి నిధులు స్వాహానే..**

గుత్తి మండలంలోని జక్కలచెరువులో చిన్న చెరువు ఉంది. ఆయకట్టు 97.36 ఎకరాలు ఉంది. 15 ఏళ్ల కిందటి వరకు ఆయకట్టు సాగులో ఉండేది. ఇప్పుడు సాగు లేదు. ఆయకట్టులో గ్రామ ప్రజలు ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 4 ఎకరాల్లో గృహాలు వెలిశాయి. ఆయకట్టు కనుమరుగవుతున్నా చెరువు కట్ట మరమ్మతులకు నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇంజినీర్లు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ రాజ్‌శాఖకు ఏటా నిధులు విడుదల అయ్యేవి. ఆ నిధులతో చెరువు కట్ట మరమ్మతులు నామమాత్రంగా చేసేవారు. గండ్లుపడితే ఇరిగేషన్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. చెరువుకట్టపై గ్రావెల్‌వేసి పటిష్టత పనులకోసం నాయకులు పోటీపడుతున్నారు. 10 ఏళ్ల కిందట ఓ నాయకుడు పనులకోసం ఆయకట్టులో భూమిని కొన్నాడు. వినియోగదారుల కమిటీతోనే పనులు చేయించాల్సి రావడంతో ఆనాయకుడు భూమికొని పనులు దక్కించుకున్నాడు. ఇప్పుడు ఈచెరువు కట్ట మరమ్మతులకు రూ.65.76 లక్షలు కావాలని ప్రతిపాదించారు.

**తొండపాడు చెరువుకూ అంతే...**


తొండపాడు చెరువు కింద కేవలం 20 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆయకట్టులో రైతులు బోర్లు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. చెరువు అతి చిన్నది. కట్ట బలహీన పడింది. దీన్ని ఆసరాగా చేసుకుని పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు నిధులు వెచ్చిస్తున్నారు. చెరువుకట్టపై కంపచెట్లను తొలగించి కట్టకు రాతి కట్టడం చేసి గ్రావెల్ వేసి చేతులు దులిపేసుకుంటూ వచ్చారు. ప్రతిసారి గుత్తేదారులు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు బిల్లులు పెట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.చెరువు లోతట్టులోని సుమారు 4 ఎకరాల భూమిని ఓ రైతుకు రెవెన్యూ అధికారులు ముందు వెనుక చూడకుండానే పట్టా మంజూరు చేశారు. పట్టా రద్దుకు రెవెన్యూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. చెరువులోతట్టులో ప్రస్తుతం ఎకరా భూమి కూడాలేదు.

**పనులు నాణ్యతగానే చేయిస్తున్నాం- విజయకుమార్, ఏఈఈ, ఇరిగేషన్‌శాఖ, గుత్తి**చెరువు కట్టల మరమ్మతులు సక్రమంగానే జరిగాయి. గతంలో ఉన్న అధికారులు పనులు నాణ్యతగానే చేయించారు. ఎక్కడా నిధుల దుర్వినియోగం జరగలేదు. పనులు పక్కాగా చేయించారు.

# తుంగభద్రమ్మకు భరోసా!

అనంతపురం: అనంత జిల్లా జీవనాడిగా పేరొందిన తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ(టీబీ హెచ్చెల్సీ)ను పటిష్టం చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శిథిలావస్థలో కొట్టుమిట్టాడుతున్న జల వరప్రదాయినికి భరోసా కల్పించేందుకు శాశ్వత మరమ్మతులకు నడుం బిగించారు. వర్క్ ఆర్డర్ ఇచ్చిన నెల రోజులు ఆలస్యంగానైనా క్షేత్రస్థాయిలో నిర్దేశిత గుత్తేదారులు పనులు మొదలు పెట్టారు. ఎక్కడికక్కడ ప్రధాన కాలువ ఇరువైపులా గట్లపై కంప చెట్లను తొలగిస్తున్నారు. వెనువెంటనే ఎంపిక చేసిన పనులకు మరమ్మతు చేపడతారు. గడిచిన ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో హెచ్చెల్సీ కాలువ నిర్వహణ, మరమ్మతు కోసం నయాపైసా ఖర్చు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక తొమ్మిది మాసాల్లోపే ఏకంగా రూ.34.95 కోట్లు మంజూరు చేయడం విశేషం. నీటి సీజన్ ముగియగానే టెండర్లను ఆహ్వానించి గుత్తేదారులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రక్రియ జనవరి నుంచి ఫిబ్రవరి మాసాల్లో పూర్తి అయింది. మార్చి మొదటి వారంలో గుత్తేదారులకు పని ఉత్తర్వు ఇచ్చారు.

**రూ.26.25 కోట్లతో మరమ్మతు** హెచ్చెల్సీ ప్రధాన కాలువ జిల్లా సరిహద్దులోని 105 కి.మీ. నుంచి మొదలై 189 కి.మీ. దాకా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. మొత్తం 84 కి.మీ. పొడువు ఉంది. ఈ మధ్యలో శిథిలావస్థలో



ఉన్న కాలువ గట్లు, వంతెనలు, రెగ్యులేటర్లు.. వంటివాటికి మరమ్మతు చేయడానికి రూ.34.25 కోట్ల ఖర్చు పెడుతున్నారు. ఇందులో గుత్తేదారుల టెండర్ల ప్రకారం రూ.26.25కోట్లకు ఒప్పందం జరిగింది. మార్చి మొదటి వారంలోనే ఉత్తర్వు జారీ చేసినా పనుల నిర్వహణకు జాప్యమైంది. ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో గుత్తేదారులు రెండు మూడు రోజుల క్రితం పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం పది పనులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్నాయి. ఇప్పటికే జేసీబీలతో కాలువ గట్లపై ఉన్న ముళ్ల కంపలను తొలగిస్తున్నారు. వంతెనల ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే చేసి కొత్తవి నిర్మించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. వచ్చే జులై ఆఖరు నాటికి నిర్దేశిత పనులను పూర్తి చేయడానికి హెచ్చెల్సీ అధికారులు చర్యలు చేపట్టారు.

# లక్ష్యం చేరింది సగమే!

నక్కపల్లి : ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే శాఖల్లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ ఒకటి. నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో గడిచిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఆదాయ పరంగా బాగానే ఉన్నా, లక్ష్యపరంగా దాదాపు 60 శాతం మాత్రమే రాబట్టగలిగింది. నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరంతోపాటు ఎలమంచిలి మండలంలో ఒకట్రెండు గ్రామాలు ఈ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 45.5 కోట్ల వరకు ఆదాయాన్ని లక్ష్యంగా నిర్ణయించారు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ. 26 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. గడిచిన ఆర్థిక సంవత్సరం



లో ఎన్నికలు రావడం, నక్కపల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు అదనపు భూసేకరణ తదితర కారణాలతో కొనుగోళ్లు, అమ్మకాలు అనుకున్నంతగా సాగలేదు. ఈ ఆదాయంలో కూడా డిసెంబరు, జనవరిలోనే దాదాపు రూ. అయిదారు కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం పారిశ్రామికంగా ఇక్కడ మొదలైన అభివృద్ధితో మూడు మండలాల్లో కొన్ని ముఖ్య గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారం జోరందుకోనుంది. దీనికితోడు పరిశ్రమల నిమిత్తం నిర్వాసితులైన వారికి పెదబొదుగల్లం వద్ద ప్రభుత్వం పునరావాసం కల్పిస్తోంది. ఇది కొలిక్కి వస్తే స్తిరాస్థి వ్యాపారం కచ్చితంగా పెరగనుందని భావిస్తున్నారు.

**ఈ ఏడాదిపై ఆశలు** గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన లక్ష్యంలో 60 శాతం వరకు చేరుకున్నాం. ప్రస్తుతం నక్కపల్లి మండలంలో జరుగుతున్న పారిశ్రామి కీకరణ ప్రభావంతో ఈ ఏడాది క్రయ, విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఆదాయం మరింత ఎక్కువ వస్తుందని ఆశతో ఉన్నాం. సీహెచ్ నరసింహమూర్తి, నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్

# ఉద్యోగుల భూ మాయ!

విశాఖపట్నం : నగరంలోని భూములకు విలువ పెరగడంతో గజం స్థలమైనా కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో ఖాళీ స్థలాల మీద కన్నేసి వాటిని దక్కించుకునేందుకు అక్రమార్కులు వ్యూహాత్మకంగా వెళ్తున్నారు. ఇందుకు విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మిగులు స్థలాలను కబ్జాకు అనుకూలంగా చేసుకుంటున్నారు. వీఎంఆర్‌డీఏలో పనిచేస్తున్న ఉద్యోగులే వీటి వెనుక చక్రం తిప్పుతున్నారు. ఆయా లేఅవుట్లలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలున్నాయో ముందే గుర్తించి మధ్యవర్తుల ద్వారా మొత్తం కథ నడిపిస్తున్నారు. పూర్తిస్థాయిలో అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు.

**రూ.పది కోట్ల స్థలాన్ని ఆక్రమించి..**

వీఎంఆర్‌డీఏకు చెందిన ఓ ఉద్యోగి రూ.పది కోట్ల స్థలాన్ని ఆక్రమించి మధ్యవర్తులతో వ్యాపారాలు సాగిస్తున్నాడు. మధురవాడ వుడా కాలనీ ప్రధాన మార్గంలోని పాత పోలీసు స్టేషన్ పక్కన సర్వే నంబరు 285లోని 800 గజాల స్థలం వీఎంఆర్‌డీఏది ఉంది. గతంలో అక్కడ వుడా కాలనీ బస్‌స్టాండు ఉండేది. అయినప్పటికీ ఆ స్థలం మీద కన్నేసి నెమ్మదిగా హస్తగతం చేసుకునేలా వ్యూహం పన్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఆ ఉద్యోగి బంధువు ద్వారా మొదట అక్కడ ఆలయం నిర్మించారు. ఆ తర్వాత దాని చుట్టుపక్కల దుకాణాలు పెట్టించి వాటిని అద్దె, లీజులకు అప్పగించి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. కొందరు అధికారులకు ఈ వ్యవహారం తెలిసినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.



**తప్పుడు పత్రాలతో..**

మిథిలాపురి వుడా కాలనీలో ఆదిత్య గేటెడ్ కమ్యూనిటీ పక్కన సర్వే నంబరు 272లో రూ.11 కోట్ల విలువైన 1400 గజాల స్థలానికి తప్పుడు పత్రాలు సృష్టించారు. 30 ఏళ్ల కిందట వుడా వేసిన లేఅవుట్‌లో ఆ సర్వే నంబరులోని స్థలాన్ని వాణిజ్య సముదాయానికి కేటాయించారు. ఏళ్లు గడిచినా ఆ స్థలంలో ఎటువంటి దుకాణాలు నిర్మించలేదు. ఖాళీగా ఉన్న ఆ స్థలం మీద వీఎంఆర్‌డీఏ ఉద్యోగి సాయంతో ఓ స్థానిక వైకాపా నేత కన్నేసి సర్వే నివేదికలు మార్చేశారు. అప్పటి వుడాకు భూములు అప్పగించక ముందున్న పత్రాల ద్వారా ఆ స్థలం తమదంటూ ఆక్రమించేశారు. దీనిపై కాలనీ సంఘం పలుమార్లు ఫిర్యాదు చేయడంతో ఆరు నెలల కిందట స్థలాన్ని స్వాధీనం చేసుకొని వీఎంఆర్‌డీఏ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. పది రోజుల కిందట ఆ బోర్డు పీకేశారు. ఇప్పుడు మళ్లీ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. ఇంత జరిగినా అధికారులు దృష్టి సారించడం లేదు. ఎంవీపీ కాలనీలోని వీఎంఆర్‌డీఏకు చెందిన 300 గజాల స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి తప్పుడు పత్రాలతో స్వాధీనం చేసుకున్నాడు. దీన్ని అధికారులు గుర్తించి ఇటీవల హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ కబ్జా వెనుక అధికారుల హస్తముందంటున్నారు. గాజువాక, కూర్మన్నపాలెం, మద్రిపాలెం, దువ్వాడ, మధురవాడ ప్రాంతాల్లోని స్థలాల కబ్జా వెనుక కొందరు ఉద్యోగుల హస్తముందన్న విమర్శలున్నాయి.

# 300 చెక్‌డ్యాంలు మాయం!

కనిగిరి: నిత్యం కరవుతో సతమతమయ్యే కనిగిరి ప్రాంతం రూపు మార్చేందుకు తెదేపా హయాంలో నిర్మించిన చెక్‌డ్యాంలు, నీటి కుంటలు... గత పాలకుల నిర్లక్ష్యం, నాయకుల ఆక్రమణల కారణంగా జాడ లేకుండా పోయాయి. దాదాపు 300 వనరుల ఆనవాళ్లే లేవంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

**నీరు నిలవడం లేదు...**కనిగిరి, పామూరు, వెలిగండ్ల, పిసిపల్లి, హనుమంతునిపాడు, సీఎస్‌పురం మండలాల్లో దాదాపు 300 చెక్‌డ్యాంలు, కుంటల ఆనవాళ్లు లేకపోవడంతో వర్షాలు పడినా చుక్కనీరు నిలవడం లేదు. అంతా దిగువకే వెళ్తోందని... ఈ క్రమంలో సారవంతమైన మట్టీ పోతోందని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ పనులకు ప్రాధాన్యమిస్తున్నందున... ఆయా వనరుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ మాట్లాడుతూ... చెక్‌డ్యాంల ఆక్రమణపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. దెబ్బతిన్న వాటి బాగుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. ఆయా మండలాల రెవెన్యూ అధికారులూ వీటిపై దృష్టి సారించాలన్నారు. **రూ.30 కోట్లతో నిర్మాణం...**వర్షాభావం కారణంగా ఏటా జిల్లాలో సమస్య నెలకొంటోంది. కనిగిరిలో పరిస్థితి మరీ దారుణం. భూగర్భ జలాలు ఎప్పుడూ పాతాళంలోనే ఉంటాయి. ఈ పరిస్థితి మార్చేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం వాటర్ షెడ్, నాబార్డు పథకాల కింది జిల్లాలో 3,834 చెక్‌డ్యాంలు, నీటి కుంటలు నిర్మించింది.

# బ్యాంకర్ల రుణపాశం

భీమవరం : డ్వాక్రా సంఘాల ద్వారా సామాన్య, మధ్యతర గతి మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతమవడమేమో గాని కొన్నిచోట్ల చేయని అప్పులకు సైతం వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. బ్యాంకర్లు తమ టార్గెట్లు పూర్తిచేసుకునేందుకు కొన్ని డ్వాక్రా సంఘాల ఖాతాలకు అప్పులిచ్చినట్లు నిధులు జమ చేస్తూ అవసరం లేకపోయినా అప్పుల పాల్జేస్తున్నారు.

మండపాకలోని ఓ డ్వాక్రా గ్రూపునకు వెంకట్రాయపురంలోని ఓ బ్యాంకు సిబ్బంది వారి ప్రమేయం లేకుండా ఖాతాలో కొంత సొమ్ము జమ చేశారు. రోజుల వ్యవధిలో తిరిగి వెనక్కి తీసుకున్నారు. వేల్పూరులోని మరో బ్యాంకు సిబ్బంది సైతం ఇలాగే చేశారు. గమనించిన గ్రూపు సభ్యులు బ్యాంకు సిబ్బందిని నిలదీయగా సమాధానం దాటవేశారు.

కొంతమంది బ్యాంకర్లు తమ టార్గెట్ల కోసం మహిళల ఖాతాలకు రుణం మంజూరు చేసినట్లు సీసీ ఖాతా ద్వారా సొమ్ములు వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే రుణం అవసరం లేదా అంటూ వడ్డీ సహా వెనక్కి తీసుకుంటున్నారు. బ్యాంకర్లకు అటు రుణం మంజూరు చేసినట్లు, ఇటు రికవరీ చేసినట్లు అవుతుంది. సామాన్యులపై ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ, ఇతరత్రా అంటూ బాదేస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో ఇలాంటివి ఎక్కువైనట్లు పలువురు ఏపీఎంలు వాపోతున్నారు.

భారంగా.. పది మంది మహిళలు కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి, బ్యాంకు ద్వారా రుణం పొందుతారు. దీనికి సభ్యులందరి తీర్మానం, వారి ఫొటోలు, సంతకాలు తదితర పత్రాలు సమర్పిస్తే బ్యాంకర్లు రుణం మంజూరు చేస్తారు. వీటిని ఆర్పీలు, వారిపైన సీవో(కమ్యూనిటీ ఆర్గనైజర్)లు పర్యవేక్షించాలి. రుణం పొందిన సంఘం ప్రతినెలా



కొంతమొత్తం చెల్లిస్తుంది. తీసుకున్న రుణం పూర్తికాకుండా మరో రుణం ఇచ్చేందుకు అనేక పత్రాలు బ్యాంకుకు సమర్పించాలి. ఒక్కోసారి అన్ని అర్హతలున్నా ఇవ్వరు.

**కానీ టార్గెట్ల సాకుతో..** కొంతమంది బ్యాంకు సిబ్బంది మహిళా సంఘాల ఖాతాలకు వారి అనుమతి లేకుండానే సీసీ (క్యాష్ క్రెడిట) అకౌంటు ద్వారా రుణం ఇచ్చినట్లు సొమ్ములు వేసేస్తున్నారు. రుణం మంజూరు చేసినందుకు ప్రాసెసింగ్ ఫీజు, వడ్డీ మినహాయిస్తున్నారు. ముందుగా తీసుకున్న రుణానికి అసలు, వడ్డీతో పాటు ఖాతాలో వేసిన నగదుకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందని, తిరిగి కట్టే సమయంలో భారమవుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ కోసం.. డ్వాక్రా సంఘాల్లోని ఆర్థిక లావాదేవీలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించాల్సిన ఆర్పీలు, సీవోలు(కమ్యూనిటీ ఆర్గనైజర్లు) కొంతమంది తమకొచ్చే కమీషన్ కోసం ఏమీ చెప్పడం లేదు. కొన్నిచోట్ల బ్యాంకర్లతో కలిసి దగ్గరుండి వారే ఈ మోసాలకు పాల్పడుతున్నారు.

డ్వాక్రా గ్రూపు సభ్యుల తీర్మానం లేకుండా వారి ఖాతాల్లో రుణం వేయడానికి లేదు. బ్యాంకర్లకు దీనిపై స్పష్టమైన సూచనలు చేశామని డీఆర్డీఏ పీడీ వేణుగోపాల్ తెలిపారు.

2024-25 ఆర్థిక సంవత్సరం
గ్రూపుల సంఖ్య: 7018
రుణ లక్ష్యం: రూ. 130.67 కోట్లు

# పల్లె పండగకు బిల్లుల బెంగ

తాడేపల్లిగూడెం : అయిదేళ్ల వైకాపా పాలనలో అస్తవ్యస్తంగా మారిన రహదారులను బాగు చేయడానికి కూటమి ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున సీసీ, బీటీ, డబ్ల్యూబీఎం రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టగా వివిధ కారణాలతో పూర్తికాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తి చేయాలని భావిస్తున్నా బిల్లులు రాకపోవడంతో పనులు మందగించాయి.

ఉభయ జిల్లాల్లో పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన 2,469 పనులకు గత ఏడాది అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు ప్రజాప్రతినిధులు భూమి పూజలు, శంకుస్థాపనలు చేశారు. ఈ పనులకు కూటమి ప్రభుత్వం రూ.173.60 కోట్లు కేటాయించింది. సంక్రాంతి పండగ నాటికి గ్రామాల్లో పల్లె పండగ పేరుతో చేపట్టే అన్ని పనులు పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు. సీసీ, బీటీ, డబ్ల్యూబీఎం రహదారుల నిర్మాణానికి మొదట్లో బిల్లుల సమస్య లేదు. పని ప్రారంభించిన తర్వాత ఉపాధి హామీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే వచ్చేవి. వారం వారం చెల్లింపులు జరిగేవి. రెండు నెలలుగా గుత్తేదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. 60 శాతం పూర్తయినా.. ఉభయ జిల్లాల్లో రూ.67.91 కోట్లు బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు 60 శాతం పైనే పనులు పూర్తయ్యాయి. మినీ గోకులం షెడ్లదీ ఇదే పరిస్థితి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల డ్వామా పీడీలు సుబ్బారావు, అప్పారావులు మాట్లాడుతూ ఈ నెలాఖరుకు నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. మందలపర్రు-క్రొవ్విడి మధ్య రూ.1.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న డబ్ల్యూబీఎం రహదారి పనులు 50 శాతం పూర్తయ్యాయి. బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు మందగించాయి.

# వాహన బీమా.. యజమానికి ధీమా



అనకాపల్లి : రోడ్లపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఇలాంటి సందర్భాల్లో వాహనానికి, అవతలి వారికి జరిగిన ఆర్థిక నష్టానికి వాహన బీమా పరిహారం అందిస్తుంది. ఇంతటి సౌకర్యం కలిగిస్తున్న బీమాను మాత్రం చాలామంది వాహనదారులు విస్మరిస్తున్నారు. వాహనం కొనుగోలు చేసేటప్పుడు మినహా ఆ తర్వాత బీమా చేయించుకోవడం లేదు. అధిక శాతం మంది బీమా భారంగా భావించి పునరుద్ధరించుకోవడం లేదు. దీంతో అనుకోని ఘటనలు జరిగి కుటుంబ పెద్దను కోల్పోయి అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహన బీమా చాలా ముఖ్యమని రవాణా, పోలీస్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 45 శాతం వాహనాలకు..**

రూ.లక్షలు వెచ్చించి వాహనాలు కొనుగోలు చేసి రూ.వేలల్లో చెల్లించే బీమాకు మాత్రం ముందుకు రావడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో రూ.15 లక్షల వరకు ద్విచక్ర వాహనాలు ఉండగా వీటిలో దాదాపు 45 శాతం వాహనాలకు బీమా లేకుండానే రహదారులపై తిరుగుతున్నట్లు రవాణా, పోలీసు శాఖ విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. బీమా పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనం, ఆటో, కారు, లారీ బస్సు ఏ వాహనం నడిపినా ఎంవీ యాక్ట్ ప్రకారం రూ.3500 వరకు జరిమానా చెల్లించాల్సిందే.

**సంఘటన-1**

ఆర్అండ్‌బీ ప్రాంతానికి చెందిన కె.అప్పారావుకు జనవరిలో తాటిచెట్లపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలవ్వడంతో పాటు, వాహనం పూర్తిగా దెబ్బతింది. వాహనం కొనేటప్పుడు చేసిన బీమా ఉన్నప్పటికీ, సమయం ముగిసిన తర్వాత పునరుద్ధరించుకోకపోవడంతో బీమా వర్తించలేదు. దీంతో అతను రూ.లక్ష వరకు ఖర్చు చేసి వాహనాన్ని బాగు చేయించుకోవాల్సి వచ్చింది.

**సంఘటన-2**

గత నెలలో మద్రిపాలెంలో లారీ ఢీకొన్న ప్రమాదంలో కంచరపాలేనికి చెందిన పి.ప్రసాదరావు స్వల్ప గాయాలయ్యాయి. వాహనం ముందు, వెనుక భాగాలు పూర్తిగా నుజ్జయ్యాయి. వాహనం బాగు చేసేందుకు రూ.80 వేలు ఖర్చు చేయగా వాహనానికి బీమా ఉండటంతో పూర్తి వివరాలతో క్లెయిం చేయడంతో వెసులుబాటు పొందాడు.

**ఎక్కువగా ద్విచక్రవాహనాలే..:** ఉమ్మడి విశాఖ జిల్లాలో ద్విచక్ర వాహన విక్రయ షోరూంలు 45 వరకు ఉన్నాయి. ఒక్కోదాంట్లో ప్రతి రోజు 7 నుంచి 10 వరకు వాహన విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు తప్పనిసరి కావడంతో బీమా చేయించుకుంటున్నారు. ఆ తర్వాత పూర్తిగా విస్మరిస్తున్నారు. ద్విచక్ర వాహనదారుల్లో ఈ నిర్లక్ష్యం ఎక్కువగా కనిపిస్తోందని, బీమా పునరుద్ధరణకు కొంతమంది ముందుకురావడం లేదని రవాణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఇదే విషయమై నగరంలో 15 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో వాహనాలు (సుమారు)
ద్విచక్ర: 15.23 లక్షలు
కార్లు: 2.75 లక్షలు
ఆటోలు: 48,000
సరకు రవాణా: 35,568

# చిక్కినా .. బరి తెగింపే!



విశాఖపట్నం :గంజాయి మత్తు కొందరి నిత్య జీవితంలో భాగమైంది. అది లేనిదే రోజుగడవదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆకు రూపంలో, ఆయిల్ రూపంలో ఎలాగైనా గంజాయి సిగరెట్లలో పెట్టి పొగ పీల్చాల్సిందే అన్నట్లు అలవాటు పడిపోయారు. కేసుల్లో చిక్కి కేంద్ర కారాగారానికి వచ్చే రౌడీషీటర్లు, నిందితులు గంజాయి కోసం బరితెగిస్తున్న తీరు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే.

**అలా రహస్యంగా..:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న 11 మందిపై ఇప్పటికే పీడీ యాక్టు అస్త్రం ప్రయోగించి రిమాండ్‌కు పంపారు. ఈ క్రమంలో ఇటీవల రిమాండ్ విధించిన ఓ రౌడీషీటర్‌ను బ్యారక్‌లోకి పంపే ముందు దుస్తులు తీసేసి తనిఖీలు నిర్వహించగా జైలు అధికారులు విస్తుబోయారు. ఐడ్రాప్స్ బాటిల్‌లో ద్రవ రూప గంజాయి నింపి దానిని రహస్యభాగంలో దాచిపెట్టాడు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆరిలోవ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే..కోర్టు నుంచి కారాగారానికి తరలించే సమయంలో ఎవరు.. ఎక్కడ...ఎలా గంజాయిని రౌడీషీటర్‌కు అందించారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే వారిని గుర్తించినట్లు సమాచారం.

గతేడాది నవంబరులో కారాగారంలో డిప్యుటేషన్‌పైవచ్చిన ఓ ఫార్మాసిస్టును రిమాండ్ ఖైదీగా ఉన్న గుర్రాల సాయి పరిచయం చేసుకున్నాడు. భోజన బాక్సులో 95 గ్రాముల గంజాయి తెచ్చిన ఆ ఫార్మాసిస్టు సాయికి అందించేందుకు యత్నిస్తూ తనిఖీల్లో పట్టుబడ్డారు. అంతకుముందు ములాఖత్‌కు వచ్చిన ఓ పాత నేరస్తుడు గోడపై నుంచి ఖైదీలున్న చోటికి గంజాయి ప్యాకెట్లు విసిరేయగా గమనించిన సిబ్బంది పట్టుకుని ఆరిలోవ స్టేషన్‌లో అప్పగించారు.

**సిబ్బందికి కాసులు:** కేంద్ర కారాగారంలో వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న, రిమాండ్ ఖైదీలు 2వేల మందికి పైగా ఉన్నారు. అందులో సుమారు 1,145 మంది గంజాయి కేసుల్లోని రిమాండ్ ఖైదీలే. కారాగారానికి రాకముందు మత్తుకు అలవాటుపడిన చాలా మంది... జైల్లో ఉన్నప్పుడూ గంజాయి కోసం దారులు వెతుక్కుంటున్నారు. ఎలాగైనా కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కారాగారంలో గంజాయి సరఫరాకు డిమాండ్ పెరిగిపోయింది. ఇదే అవకాశంగా సొమ్ములు ఆశించి గతంలో కొందరు సిబ్బంది సరఫరా చేశారన్న ఆరోపణలున్నాయి. కొన్ని ఉదంతాలు సైతం వెలుగులోకొచ్చాయి. ప్రస్తుతం కారాగారంలో తనిఖీలు పెంచారు. మత్తుకు అలవాటు పడిన ఖైదీల కోసం డి-అడిక్షన్ కేంద్రాన్ని కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది.

# సు'జలం'.. సఫలమయ్యేలా



చిత్తూరు: హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. వైకాపా హయాంలో ఎన్నికలకు ముందు తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకుని నామమాత్రంగా నీరు విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం లక్ష్యానికి అనుగుణంగా కృష్ణా జలాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తెచ్చేందుకు యత్నిస్తోంది. ఇప్పటికే పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల లైనింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రధాన, నీవా బ్రాంచినీ పట్టాలెక్కించాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. ఇందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కోరారు.

తెలుగుదేశం హయాంలో 2014- 19 మధ్య ఉమ్మడి చిత్తూరు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ పనులు వేగంగా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటపడి మరీ పుంగనూరు, కుప్పం బ్రాంచి కాలువల నిర్మాణంతో పాటు ప్రధాన, నీవా ఉప కాలువల నిర్మాణ పనులు చేయించారు. ఈ క్రమంలో కేవీపల్లె మండలం అడవిపల్లె రిజర్వాయర్‌ను పూర్తి చేశారు. ప్రధాన కాలువ నిర్మాణం సింహభాగం అప్పట్లోనే జరిగింది. కేవలం 1.40 కి.మీ మేర మట్టి పనులు, 51 స్ట్రక్చర్లు అసంపూర్తిగా ఉన్నాయి.

**బకాయిలు, లైనింగ్‌కు రూ.500 కోట్లు!**

గతంలో పనులు చేసిన గుత్తేదారులకు రూ.125 కోట్ల బకాయిలు చెల్లించాలి. ప్రధాన, నీవా బ్రాంచి కాలువల లైనింగ్‌తో కలుపుకొని సుమారు రూ.500 కోట్లు అవసరమని ఇప్పటికే హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు విన్నవించారు. పాలనా అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలవాలని కోరారు. త్వరలోనే ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయితే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 మండలాల్లోని 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుంది. చిత్తూరు నగరానికి తాగునీటి ఎద్దడి ఉండదు.

**ఐదేళ్లలో అడుగు పనీ జరగక**

చిన్నమండ్యం మండలం పడమటి కోన వద్ద 200 మీటర్లు, కలకడ దగ్గర 300 మీటర్లు మాత్రమే కాలువ తవ్వాలి. రెండు- మూడు నెలల్లోనే చేసే అవకాశం ఉన్నప్పటికీ సీమ బిడ్డనని చెప్పుకొనే జగన్ పట్టించుకోలేదు. ఐదేళ్ల పాలనలో తట్ట మట్టీ ఎత్తిన పాపాన పోలేదు. ఒక్క అడుగు పనీ జరగలేదు. హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు పదేపదే గుర్తు చేసినా ఫలితం లేదు.

పోలవరం తర్వాత అత్యధిక నిధులు

ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షలతో కాలయాపన చేయకుండా 2024-25 బడ్జెట్‌లో రూ.1,867.76 కోట్లు కేటాయించడమే కాకుండా ఈ ఏడాది జనవరి నాటికి రూ.1,586.18 కోట్లు ఖర్చు చేశారు. మిగతాదీ ఈ నెలలోగా వెచ్చిస్తామని అధికారులు చెబుతున్నారు. 2025- 26 బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు తర్వాత అత్యధికంగా హంద్రీ- నీవా సుజల స్రవంతికే నిధులు ఇచ్చారు.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి



వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు.సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.

క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్ధతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.

# సౌర.. ఔరా!

తిరుపతి : సహజ వనరుల వినియోగంలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం దూసుకెళ్తోంది. సౌరవిద్యుత్‌ను ఉపయోగించుకుం టూ ఏటా రూ.15 లక్షలు ఆదా చేస్తోంది. మంచి ఫలితాలు రావడంతో అధికారులు సౌర విద్యుత్తు ప్లాంట్ విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మహిళా వర్సిటీలో న్యూ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ (నెడ్ క్యాప్) సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు వినియోగించుకుంటూ రెండు ప్రాంతాల్లో సౌరవిద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసి.. విద్యుత్ అవసరాలను తీర్చుకుంటున్నారు. పరిపాలనా భవనంపై 300 చదరపు అడుగుల్లో 30కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేశారు. దీనికి రూ.30 లక్షలు అవసరం కాగా.. నెడ్‌క్యాప్ రాయితీ రూ.9 లక్షలు (30 శాతం) ఇచ్చింది. దీని నుంచి రోజుకు 135 కిలోవాట్లు, నెలకు 4,050 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. దీనివల్ల నెలకు రూ.33,440, ఏటా రూ.3,89,280 విద్యుత్ బిల్లు ఆదా చేస్తున్నారు.

హ్యుమానిటీస్ బ్లాకుపైన 900 చదరపు అడుగుల స్థలంలో 90 కిలోవాట్లతో మరో సౌర ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని వ్యయం రూ.62,10,000 కాగా.. నెడ్‌క్యాప్ 20 శాతం సబ్సిడీ ఇవ్వడంతో రూ.51,82,245/-తో ప్లాంటు నిర్మించారు. దీని నుంచి రోజుకు



405 కిలోవాట్లు, నెలకు 12,150 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. తద్వారా నెలకు రూ.98,321, సంత్సరానికి రూ.11,67,858 విద్యుత్ బిల్లును ఆదా చేస్తున్నారు. రెండు ప్లాంట్ల ద్వారా ఏటా రూ.15 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. త్వరలో పీఎం నిధులతో 230 కిలోవాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్‌ను వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల భవనంపై ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనికి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తారు.

**పూర్తిస్థాయిలో సౌర పలకాల ఏర్పాటుకు కృషి**

ప్రస్తుతం వర్సిటీలోని రెండు ప్లాంట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇస్తుండటంతో విద్యుత్ బిల్లు తగ్గుతోంది. వర్సిటీ అవసరాలన్నింటినీ సౌర విద్యుత్తు ద్వారా తీర్చుకునేందుకు పీఎం ఉష పథకం కింద రూ.కోటితో ఇంజినీరింగ్ కళాశాలపై పలకల ఏర్పాటుకు అనుమతి పొందాం. త్వరలో టెండర్లకు వెళ్తున్నాం. ఆచార్య వి.ఉమ, వీసీ, మహిళా వర్సిటీ

# వేసవి జలాశయానికి ముప్పున్నా.. గ్రావెల్ తవ్వకాలు



సూళ్లూరుపేట : ప్రజలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన వేసవి జలాశయం (సమ్మర్ స్టోరేజీ ట్యాంకు) చెంతే మట్టి తవ్వకాలు చేపడుతుండటంతో ముప్పు పొంచి ఉంది. సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు చెరువులో రాత్రి సమయాల్లో భారీ యంత్రాలతో గ్రావెల్, మట్టి తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. సూళ్లూరుపేట పురపాలక సంఘంలో శాశ్వత తాగునీటి ఎద్దడి నివారణకు రూ.162 కోట్లతో ఏడీబీ నిధులతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఇక్కడ నీటి నిల్వలను అన్నీ ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా తరలించాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ఇబ్బడిముబ్బడిగా తవ్వుతుండటంతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా.. మట్టి మాఫియా మాత్రం తగ్గడం లేదు. ఈ విషయమై జల వనరుల శాఖ డీఈఈ శ్రీధర్‌ను అడగ్గా మంగళంపాడు చెరువులో మట్టి, గ్రావెల్ తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదన్నారు. ట్యాంకు విషయమై ప్రజారోగ్యశాఖ డీఈఈ శ్రీనివాసులురెడ్డి అడగ్గా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతుల్లేవని తెలిపారు.

# ఆదర్శ పాఠశాలల ఆహ్వానం

విశాఖపట్నం : ఆదర్శ విద్యాలయాల్లో ప్రవేశం పొందితే ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా చదువుకోవచ్చు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని బాలబాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2011లో అక్షరాస్యతాపరంగా వెనకబడిన ప్రాంతాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఐదు ఆదర్శ పాఠశాలలు ఉండగా.. 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రాత పరీక్ష నిర్వహించి సాధించిన మార్కుల ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తారు.

జిల్లాలోని చీడికాడ మండలం మంచాల, రావికమతం మండలం మరుపాక, నర్సీపట్నం మండలం వేములపూడి), కశింకోట మండలం తేగాడ, మునగపాక మండలం పాటిపల్లిలో ఈ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో వంద చొప్పున మొత్తం 500 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీటు సాధిస్తే ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు.

**అర్హతలు ఇవీ..**ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2015 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2015 మధ్య జన్మించి ఉండాలి.ప్రభుత్వ/ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఒకేచోట 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో చదివి ఉండాలి. ప్రస్తుత సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఆరో తరగతికి ప్రమోట్ అయి ఉండాలి. రాత పరీక్షలో సాధించిన మార్కులు, రోస్టర్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. **దరఖాస్తు ఇలా** ఆసక్తి, అర్హత ఉన్న బాలబాలికలు ముందుగా %www.apms.apcfss.in, www.csc.ap.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అభ్యర్థులు ఫీజు చెల్లించగానే ఓ ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఆ నంబరు ఆధారంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. **ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష..** ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకు న్న విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఏప్రిల్ 20వ తేదీ ఉదయం 10 గంటల మధ్యాహ్నం 12 గంటలకు వరకు పరీక్ష ఉంటుంది. ఎంపిక చేసుకున్న కేంద్రంలోనే పరీక్ష రాయాలి. ఐదో తరగతి సిలబస్ నుంచి తెలుగు, ఆంగ్లంలో ప్రశ్నపత్రం ఉంటుంది. గణితంలో 20, తెలుగులో 20, సాంఘిక శాస్త్రంలో 20, ఆంగ్లంలో 20, సైన్సులో 20 మార్కుల చొప్పున మొత్తం వంద మార్కులకు పేపర్ ఇస్తారు. ఏప్రిల్ 27న మెరిట్ జాబితా విడుదల చేస్తారు. 30న ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తారు. వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల, చీడికాడ

# 'వక్క' దిగుబడి ఉన్నా దిగాలే!



మడకశిర : రాష్ట్రంలోనే వాణిజ్య పంటగా వక్కను ఉమ్మడి అనంత జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా మడకశిర, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకర్గాల్లో పండిస్తున్నారు. దిగుబడి బాగున్నా మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో అమ్ముకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రెండేళ్లుగా పండించిన వక్క పంటను రైతులు ఇళ్లల్లోనే నిల్వ ఉంచుకున్నారు. ఇదిలా ఉండగా మళ్లీ దిగబడి చేతికి రావడానికి సిద్ధమైంది. ఎకరాకు సుమారు 6 క్వింటాళ్ల చొప్పున 40 వేల క్వింటాళ్ల పంట వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**కర్ణాటకకు వెళ్లాల్సిందే..**

మడకశిర నియోజకవర్గంలో 3 వేల మంది రైతులు దాదాపు 10వేల క్వింటాళ్ల ఎండబెట్టిన వక్క ఇళ్లల్లోనే ఉంచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు రూ.46వేల నుంచి రూ.48 వేల వరకు ధర పలుకుతోంది. ధర ఆశాజనకంగా ఉన్నా నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. దీంతో రూ.46 కోట్లు విలువ చేసే వక్క రైతుల ఇళ్లల్లో మూలుగుతోంది. దిగుబడిని అమ్ముకోవాలంటే కర్ణాటక రాష్ట్రంలోని భీమసముద్రం, తుమకూరు, శివమొగ్గ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు 150 కిమీ వ్యయప్రయాసలకు ఓర్చి తరలిస్తే క్వింటాకు రూ.2వేలు వరకు ఖర్చు వస్తుందని రైతులు వాపోతున్నారు.

**ముఖ్యమంత్రి మాటిచ్చారు..**

గత ఏడాది ఆగస్టు 1న ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర మండలంలో పర్యటించిన సందర్భంగా వక్క మార్కెట్, పరిశ్రమ ఏర్పాటుతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. మార్కెట్, పరిశ్రమ నిర్మాణం ఎప్పుడు మొదలవుతుందో..కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని కర్షకులు ఎదురుచూస్తున్నారు. **అప్పు చేయాల్సి వస్తోంది- సిద్ధేశ్వర, నాగోనపల్లి, అమరాపురం మండలం**

వక్క తోట 5 ఎకరాల్లో సాగు చేశాను. ఏడాదికి 20 క్వింటాళ్ల ఎండిన వక్క దిగుబడి వస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో 25 క్వింటాళు ఇంట్లోనే నిల్వ చేసుకున్నా. రెండేళ్లుగా పెట్టుబడి, ఇంటి ఖర్చుల కోసం రూ.8 లక్షలు అప్పు చేశాను. **మార్కెట్ అందుబాటులోకి రావాలి- ఉగ్రనరసింహ, వక్క సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, గౌడనకుంట**గత ఏడాది ఎండలు, తెగుళ్ల కారణంగా నాణ్యత తగ్గింది. వెయ్యి అడుగులు తవ్వించిన బోర్లలో ఫ్లోరైడ్ నీరు వస్తోంది. మరోవైపు వాటిని తోటకు పెట్టడం వల్ల దిగుబడిపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం త్వరితగతిన మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

# అ 'జెండా' లేని శాఖ



విశాఖపట్నం : పర్యాటక పరంగా దేశంలో విశాఖకు ప్రత్యేక స్థానం ఉంది. బీచ్‌లకు సందర్శకుల సంఖ్య పెరగాలంటే సౌకర్యాల స్థితి పరిశీలించి ఇచ్చే 'బ్లూఫ్లాగ్' గుర్తింపు కీలకం. అది రాష్ట్రంలో రుషికొండ బీచ్‌కే ఉంది. అయితే.. ఆ ప్రతిష్ఠను నిలబెట్టుకోవాల్సిన తరుణంలో ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడి అసౌకర్యాల నేపథ్యంలో 'బ్లూఫ్లాగ్' గుర్తింపును నిర్వాహకులు తాత్కాలికంగా ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ శాఖలో ఎప్పుడు ఏం చేయాలనే శ్రద్ధ కరవైనట్లు చర్చ సాగుతోంది. పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం, ఉన్నతాధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం, అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టమవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా... ఇప్పుడు కళ్లుతెరిచి దిద్దుబాటు చర్యలకు దిగారు. రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ నిర్వహణపై ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందనే విమర్శలున్నాయి. గత ఏడాది అక్టోబరుతో నిర్వహణ ఏజెన్సీ గడువు ముగిసింది. ఆ నివేదిక పంపినా తర్వాత ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. పాత ఏజెన్సీ సక్రమంగా నిర్వహించకపోయినా కొత్తగా టెండర్లు పిలిచి అప్పగించలేదు. రాష్ట్రంలో బీచ్‌ల పర్యవేక్షణకు ప్రత్యేక కన్సల్టెన్సీ ఉన్నా రుషికొండ బీచ్‌పై దృష్టిసారించలేదు. పర్యవేక్షణ లోపాన్ని పట్టించుకోకుండా కేవలం జిల్లా అధికారులను మార్చుతూ మమ అనిపించారు. ఏపీటీడీసీ ఛైర్మన్ బాలాజీ గత డిసెంబరులో బీచ్‌ను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు చెప్పినా... నత్తనడకన చేయడంతో బ్లూఫ్లాగ్ గుర్తింపు పైనే ప్రభావం పడింది.

త్వరలో కమిటీ రాక: బ్లూఫ్లాగ్ గుర్తింపు తాత్కాలిక ఉపసంహరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై పనులు ఆరంభించినా కొన్ని నెమ్మదిగా సాగుతున్నాయి. ఈ నెల 15కు వాటన్నింటినీ పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే బీచ్‌లో చేపట్టే పనులపై ఓ నివేదికను కలెక్టరు హరేంధిరప్రసాద్ బ్లూఫ్లాగ్ బృందానికి పంపించారు. వీటిపై ఆ కమిటీ కొంత సంతృప్తి వ్యక్తం చేసింది. త్వరలో ఆ కమిటీ బీచ్‌ను తనిఖీ చేయనుంది.

**ఇన్‌ఛార్జ్‌ల పాలనే:** శాఖలో సమస్యలకు ప్రధాన కారణాలను విశ్లేషించకుండా ఒకరిద్దరు అధికారులను మార్చి ఉన్నతాధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఇటీవల జిల్లా పర్యాటకశాఖాధికారిగా ఉన్న జ్ఞానవేణిని తప్పించి అదే శాఖలోని దాసుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఉన్నతాధికారులు హడావుడిగా కాంట్రాక్టు ఉద్యోగికి బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు రావడంతో అతన్నీ తప్పించారు. ప్రస్తుతం జిల్లా పర్యాటకాధికారిగా హెచ్‌పీసీఎల్ ప్రత్యేక ఉపకలెక్టరు సుధాసాగర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. గత ప్రభుత్వం నుంచి ఈ పోస్టు ఇన్‌ఛార్జులతోనే సాగుతుంది. పర్యాటకశాఖ ఆర్‌డీ పోస్టును కూడా ఇన్‌ఛార్జితోనే నడిపిస్తుండటం గమనార్హం.

# అనుమతా.. అదొక్కటీ అడగొద్దు!



అనకాపల్లి : క్వారీలు నడపాలంటే ముందు మైనింగ్ ప్లాన్ ఉండాలి. పర్యావరణ అనుమతులు (ఈసీ) తెచ్చుకోవాలి. ఎంత విస్తీర్ణంలో తవ్వేది ముందస్తు సమాచారం ఇవ్వాలి. రవాణాకు పర్మిట్లు తీసుకోవాలి. ఇవేవీ లేకుండానే అక్రమార్కులు కొండలను కరిగించేస్తున్నారు. సర్కారు ఖజానాకు కన్నం పెడుతున్నారు. అనకాపల్లి జిల్లా గనులశాఖ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారు. రాత్రీ పగలు తేడా లేకుండా యంత్రాలు పెట్టి కొండలను తొలిచేసి మెటల్ మాయం చేస్తున్నారు. అధికారులకు తెలిసినా నేతల ఒత్తిళ్లు, నెలవారీ మామూళ్లకు తలొగ్గి అటుగా కన్నెత్తి కూడా చూడడం లేదు. పైగా తమశాఖ విజిలెన్స్ బృందం వచ్చి పట్టుకున్నా స్థానిక అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం.అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో సుమారు 236 క్వారీలకు పర్యావరణ అనుమతులే లేవు. వేటజంగాలపాలెం సర్వే నంబర్ 84లో ఒకే కొండ చుట్టూ 20 పైగా రాయి క్వారీలున్నాయి. వాటిలో ఒక్కదానికి కూడా అనుమతుల్లేకపోయినా దర్జాగా పేలుళ్లు జరుపుతున్నారు. రాళ్లను భారీ లారీలు, టిప్పర్లలో లోడ్ చేసి అధికారుల కళ్లెదుటే తరలించుకుపోతున్నారు. విజయనగరం కేంద్రంగా పనిచేస్తున్న గనుల శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి పట్టుకుంటున్నారు తప్పా జిల్లాలో అధికారులు మాత్రం క్వారీలు తనిఖీలు చేసింది లేదు.. అక్రమ మైనింగ్ అడ్డుకున్నదీ లేదు.. ఎవరైనా అడిగితే మాకు తగినంత సిబ్బంది లేరు. ఫిర్యాదులపై విచారణలతో సరిపోతుందని సర్దిచెప్పుకొంటున్నారు. కుంచంగి సర్వే నంబర్ 316లోని క్వారీల్లో కూడా అనుమతుల్లేకుండానే కొండలను కరిగించేస్తున్నారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి, అడ్డతీగల, జి.మాడుగుల లోనూ అక్రమ మైనింగ్ జోరుగా సాగుతోంది.

గనులశాఖ తవ్వకాలకు, రవాణాకు జారీచేసే పర్మిట్లతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఖనిజాన్ని బట్టి క్యూబిక్ మీటర్‌కు రూ.100 నుంచి రూ.207 వరకు రాయల్టీ రూపంలో చెల్లించాలి. అక్రమ మైనింగ్ చేయడం వల్ల ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదు. అక్రమార్కుల జేబుల్లోకి పోతోంది.

**అక్రమ మైనింగ్ చేస్తే కేసులే..**

అనుమతుల్లేకుండా ఎవరు మైనింగ్ చేసినా కేసులు పెట్టి భారీగా జరిమానాలు విధిస్తాం. ఇటీవల సబ్బవరంలో ఓ గ్రావెల్ లారీని పట్టుకుని రూ.లక్ష అపరాధ రుసుం కట్టించాం. వేటజంగాలపాలెంలో క్వారీల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నారనే సమాచారంతో దాడిచేసి యంత్రం సీజ్‌చేశాం. నిర్వాకులపై కేసులు పెడతాం. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిని విడిచిపెట్టం. -అశోక్‌కుమార్, గనుల శాఖ విజిలెన్స్ సహాయ సంచాలకులు

# ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

తాడిపత్రి : అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కొంతమంది రాజకీయ నాయకుల తోడ్పాటు అందించడంతో మున్సిపాలిటీల పరిధిలో ప్రజల ఉపయోగార్థం కేటాయించిన రిజర్వుడు స్థలాల్లో కొన్ని అన్యాక్రాంతమయ్యాయి. ఈ స్థలాల్లో కొందరు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటుండగా మరికొందరు ఇతరులకు అద్దెకిచ్చి బాడుగలు తీసుకుంటున్నారు. గుంతకల్లులో డీఎస్పీ కార్యాలయం, రెండో పట్టణ పోలీసుస్టేషన్ తదితర ప్రభుత్వ భవనాలు కూడా రిజర్వుడు స్థలాల్లో నిర్మించడం గమనార్హం. ప్రారంభంలోనే స్థలాల రక్షణకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గుంతకల్లు పట్టణంలో 11 కాలనీల్లో దాదాపు రూ.79 కోట్ల విలువచేసే రిజర్వుడు స్థలాల్లో 53,240 చదరపు గజాల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. మున్సిపాలిటీలో మొత్తం 111 రిజర్వుడు స్థలాలుండగా 11 అన్యాక్రాంతమయ్యాయి. అధికారులు ఇందులో 71 స్థలాలకు కంచె, గోడలు ఏర్పాటు చేశారు. అన్యాక్రాంతమైన స్థలాలతో పాటు మిగిలిన 29 స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలో ఇళ్లను నిర్మించుకున్న వారు కొందరు రిజర్వుడు స్థలాల్లో కొంత స్థలాన్ని ఆక్రమించి అనుభవిస్తున్నారు. రిజర్వుడు స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్నవారిలో 90 శాతం మందికి వేరేచోట స్థలాలు కేటాయించారు. కానీ, వారు ఇళ్లు నిర్మించుకోకుండా రిజర్వుడు స్థలాల్లోనే నివాసముంటున్నారు. వారిని ఖాళీ చేయించడానికి రాజకీయ నాయకులు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

తాడిపత్రి మున్సిపాలిటీలో దాదాపు 90 రిజర్వుడు స్థలాలుండగా ఇందులో 20 దాకా ఆక్రమణలకు గురయ్యాయి. స్థలాల్లో కొందరు పక్కా భవనాలు నిర్మించుకుని అనుభవిస్తున్నారు. స్థలాల పరిరక్షణకు



అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. గుత్తి మున్సిపాలిటీలో ఏడు రిజర్వుడు స్థలాలుంటే ఇందులో మూడు ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆక్రమణల కారణంగా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే భవనాలు, పార్కులను ఏర్పాటు చేయలేకపోతోంది.

**రూ. 1.97 కోట్లతో రక్షణ చర్యలు**

– శ్రీనివాసులు, సహాయ సిటీ ప్లానర్

గుంతకల్లు మున్సిపాలిటీలోని రిజర్వుడు స్థలాలను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగం 28 స్థలాలకు రూ.1.97 కోట్లతో ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకు టెండర్లు నిర్వహించి పనులు గుత్తేదారులకు అప్పగించాం. రిజర్వుడు స్థలాల్లో నివాసముంటున్నవారికి స్థలాలు కేటాయించినందున అక్కడి ఇళ్లను తొలగిస్తాం.

# రీసర్వే రగడ

విశాఖపట్నం : ఆనందపురం మండలం గొట్టిపల్లి రెవెన్యూ పరిధి చందక గ్రామంలో తొమ్మిదెకరాల స్థలానికి గతంలో నలుగురు వ్యక్తుల పేర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాస్తవానికి ఆ స్థలం మీద అనుభవదారులుగా ఎనిమిది మంది రైతులున్నారు. దీంతో రీసర్వే వివాదానికి దారి తీసింది. గొట్టిపల్లిలో ఓ కుటుంబానికి చెందిన నాలుగెకరాల స్థలంలో హద్దుల సమస్య తలెత్తింది. అది తేలాకే రీసర్వేకు ముందుకెళ్లాలని తేల్చిచెప్పడంతో ఆపేశారు.

భీమిలి మండలం దాకమర్రిలో కుటుంబ సభ్యుల మధ్య పంపకాల్లో స్పష్టత లేక సర్వే చేయడం కుదరలేదు. ఆ కుటుంబానికి చెందినవారంతా ఒక మాటమీదకొచ్చాక చేస్తామని అధికారులు వెనుదిరిగారు.

ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న దాకమర్రి, గొట్టిపల్లి, గంధవరం గ్రామాల్లో చిత్రవిచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎక్కడ రీసర్వే చేపడుతున్నారో ముందుగానే సంబంధిత రైతులకు సమాచారం అందిస్తున్నా క్షేత్రస్థాయిలోకి వెళ్లేసరికి అధికారులకు భిన్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత ప్రభుత్వంలో అంతా ఇష్టానుసారంగా సాగింది. చాలా చోట్ల రికార్డుల్లోని కొలతలను తగ్గించేసి వైకాపా అనుకూల వ్యక్తుల పేరున రాయించేశారు. ఇప్పుడు కొంత ఆలస్యమవుతున్నా వివాదరహితంగా చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్కడక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. **ఇదీ పరిస్థితి:** అన్నదమ్ముల మధ్య వాటాల విషయంలో వివాదాలు తలెత్తుతున్నాయి. గతంలో ఒకరి పేరునే పాసుపుస్తకాలు ఉండేవి. ఇప్పుడు వాటి పంపకాల్లో విభేదాలు వస్తున్నాయి.

భూమి అనుభవదారులను, రికార్డుల్లో ఉన్న వారిని అధికారులు పిలుస్తున్నారు. ఈ సమయంలో కొత్త వివాదాలొస్తున్నాయి. ఎవరికివారు పత్రాలు చూపిస్తుండటంతో ఎవరిదని తేల్చే విషయంలో జాప్యం జరుగుతోంది.

ఇక్కడ కమతాలు చిన్నవి. రైతులకు వేరువేరుగా స్థలాలున్న ప్రతి దగ్గర వాటికి వేరువేరుగా చల్తా నంబరు కేటాయిస్తున్నారు. గతంలో అంతటికీ కలిపి ఒకటే ఇచ్చేవారు. దీంతో ఈ నంబర్ల కేటాయింపునకు శ్రమించాల్సి వస్తోంది. వివాదాస్పద భూముల్లో రీసర్వే చేస్తున్నప్పుడు సరిహద్దులు గుర్తించి వదిలేస్తున్నారు. రైతుల మధ్య సఖ్యత లేక సర్వే చేయడం లేదు.

కొన్ని చోట్ల సర్వేను సచివాలయ, ఇతర కింది స్థాయి సిబ్బందిపై వదిలేస్తున్నారు. వివాదం రేగినప్పుడు కనీసం పరిష్కరించడానికైనా కొన్ని చోట్ల జోక్యం చేసుకోవడంలేదు. తరచూ కలెక్టర్, జేసీ పర్యవేక్షిస్తున్నా వారొచ్చినప్పుడు కనిపించి మిగిలిన సమయాల్లో శ్రద్ధ పెట్టడం లేదు.

తేల్చుకోమన్నారు: 'మా కుటుంబానికి చెందిన భూమి పంపకాల విషయంలో విభేదాలు ఉండడంతో రీసర్వే మొదలుపెట్టలేదు. అంతా ఏకాభిప్రాయానికి వచ్చాక చేస్తామని అధికారులన్నారు. అందర్నీ కూర్చోపెట్టి సందేహాలు నివృత్తి చేసి హద్దులు నిర్ణయిస్తే అభ్యంతరం లేదు. తర్వాత చిక్కులు రాకుండా చేస్తే చాలు' అని ఓ రైతు పేర్కొన్నారు.

**ఆలస్యమైనా:** 'కాస్త ఆలస్యమైనా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రీసర్వే చేయిస్తున్నాం. ఎక్కడా రైతుల మధ్య విభేదాలు, గొడవలు తలెత్తకూడదనే ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాం. పంపకాల విషయంలో రైతులను ముందుగా తేల్చుకొని రమ్మంటున్నాం. అన్ని పూర్తయ్యాక తుది నివేదికను గ్రామాల్లో ప్రదర్శిస్తాం. అప్పటికీ అభ్యంతరాలుంటే తెలపొచ్చు' అని జేసీ మయూర్ అశోక్ పేర్కొన్నారు.

## అందాల గోల్డెన్ మీనూ ని చూశారా!

ఫెమినా మిస్ ఇండియా 2018 పోటీల్లో హర్యానా తరఫున ప్రాతినిధ్యం వహించిన ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. మిస్ ఇండియా గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 కిరీటాన్ని గెలుచుకున్న మీనాక్షి చౌదరి టాలీవుడ్‌లో 2021లో ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో పరిచయం అయింది. ఆ సినిమా నిరాశ పరచినా త్రివిక్రమ్ దృష్టిలో పడింది. ఆ సమయంలోనే మీనాక్షి చౌదరి నటన గురించి త్రివిక్రమ్ అభినందించాడు. అంతే కాకుండా ఆమెకు మంచి భవిష్యత్తు ఉంటుంది అన్నాడు. కట్ చేస్తే ప్రస్తుతం టాలీవుడ్‌లో మీనాక్షి పరిస్థితి ఏంటో అందరికీ తెల్సిందే. మోస్ట్ వాంటెడ్ హీరోయిన్స్ జాబితాలో మీనాక్షి చౌదరి నిలిచింది. ఈ ఏడాది ఆరంభంలో సంక్రాంతి సందర్భంగా వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ఈ అమ్మడు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో లేడీ పోలీస్ ఆఫీసర్‌గా



కనిపిస్తూనే అందంగా కనిపించడంతో స్టార్ హీరోల దృష్టిని ఆకర్షించింది. ఈ ఏడాదిలో మొదటి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న మీనూ ఇదే ఏడాది మరో రెండు మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. ఇదే సమయంలో ఈమె సోషల్ మీడియా ద్వారా తెగ సందడి చేస్తూ ఉంది. అందాల ఆరబోత ఫోటోలతో చూపు తిప్పనివ్వడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా రెండున్నర మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న మీనాక్షి చౌదరి రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈసారి గోల్డెన్ కలర్ టాప్‌తో పాటు, బ్లాక్ కలర్ పాయింట్‌ను ధరించడంతో మెరిసి పోతుంది. టాప్ అందాలతో చూపు తిప్పుకోనివ్వని మీనాక్షి చౌదరి మరోసారి తన అందమైన ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఇంత అందంగా ఉన్న మీనాక్షి చౌదరికి టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ స్టార్ హీరోలకు జోడీగా నటించేంత స్థాయి ఉంది అంటూ నెటిజన్స్, అభిమానులు తెగ కామెంట్ చేస్తున్నారు. మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018లో భారతదేశంకు ప్రాతినిధ్యం వహించి రన్నరప్‌గా నిలిచింది. తెలుగులో ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా తర్వాత హిట్ : ది సెకండ్ కేసలో నటించి హిట్‌ను సొంతం చేసుకుంది. గత ఏడాది ఈమె లక్కీ భాస్కర్‌తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. గత ఏడాదిలోనే ఈమె నటించిన గుంటూరు కారం, మెకానిక్ రాకీ, మట్కా ఒక హిందీ సినిమా, ఒక తమిళ్ సినిమా వచ్చింది. తెలుగులో ఈమెకు వచ్చిన గుర్తింపు ఇతర భాషల్లో దక్కలేదు. ప్రస్తుతం తెలుగు సినిమాలకు పాన్ ఇండియా మార్కెట్ ఉంది. కనుక కచ్చితంగా ఏదో ఒక పాన్ ఇండియా సినిమాతో దేశవ్యాప్తంగా ఈ అమ్మడు పాపులారిటీని సొంతం చేసుకోవడం ఖాయం.

## పాన్ ఇండియా చిత్రంలో స్వాతి!

యంగ్ హీరో నిఖిల్ హీరోగా పాన్ ఇండియాలో స్వయంభు తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. భారీ వార్ ఎపిక్ చిత్రంగా భరత్ కృష్ణమార్య తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా సెట్స్ లో ఉంది. ఇప్పటికే చాలా భాగం షూటింగ్ కూడా పూర్తయింది. చోళ సామ్రాజ్యానికి సంబంధించిన కథ కావడంతో భారీ వార్ సన్నివేశాలున్నాయి. వందలాంది ..వేలాది మధ్య ఈ వార్ సన్నివేశాలు సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. వెండి తెరపై మరో బాహుబలిని చూస్తామన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ఈసినిమా కోసం నిఖిల్ ప్రత్యేకంగా కత్తి యుద్దం, గుర్రపుస్వారీలో తర్ఫీదు పొందాడు. ఇందులో నిఖిల్ కి జోడీగా సంయుక్తా మీనన్, నభానటేష్ నటిస్తున్నారు. వాళ్లపైనా కీలక సన్నివేశాలున్నాయి. సినిమా కోసం వారు కూడా వార్ సన్నివేశాలకు సంబంధించి కొంత ట్రైనింగ్ కూడా తీసుకున్నారు.



ఇప్పటికే షూటింగ్ ముగింపు దశకు కూడా చేరుకుంది. ఈ నేపథ్యంలో మరో ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. ఇందులో ఓ కీలక పాత్రకు కలర్స్ స్వాతిని ఎంపిక చేసారట. అమ్మడు ఇందులో ఓపవర్ ఫుల్ పాత్రలో కనిపించనుందట. చిత్రీకరణ ముగింపు దశలో స్వాతి పేరు తెరపైకి రావడం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి ఆ పాత్రకు ఓ కొత్త నటిని తీసుకోవాలనుకున్నారట. కానీ ఆ పాత్రకు స్వాతి కూడా సెట్ అవుతుందని భావించి అమెని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది. అదే నిజమైతే స్వాతి ఎంట్రీ వెనుక నిఖిల్ ఉన్నట్లే . ఇద్దరు మంచి స్నేహితులు. గతంలో కార్తికేయ లో కలిసి నటించారు. ఈ నేపథ్యంలోనే స్వాతికి సినిమా ఛాన్స్ ఈజీగా వచ్చినట్లు తెలుస్తోంది. మరి ఆమె ఎంపికలో నిజమెంతో మేకర్స్ ధృవీకరించాల్సి ఉంది. ప్రస్తుతం స్వాతి సినిమాల్లో నటించలేదు. ఆమె సినిమాలు చేసి రెండేళ్లు అవుతుంది. మరి అవకాశాల రాక చేయలేదా? వచ్చి చేయలేదా? అన్నది తెలియదు గానీ స్వయంభు మాత్రం మంచి కంబ్యాక్ సినిమా అవుతుంది.




## కోలీవుడ్ డైరెక్టర్స్- టాలీవుడ్ హీరోస్.. ట్రెండ్ మారింది!



టాలీవుడ్.. ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్ లో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. సౌత్ టూ నార్త్.. ఓ ఊపు ఊపేస్తుందని చెప్పాలి. మన హీరోల సినిమాలు వస్తాయంటే చాలు.. అంతా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అంతలా టాలీవుడ్ క్రేజ్ పెరిగిపోయింది. ఒకప్పటికీ ఇప్పటికీ పూర్తిగా సీన్ మారిపోయింది. మిగతా భాషల డైరెక్టర్స్ కూడా తెలుగుపైనే ఫోకస్ చేస్తున్నారు. టాలీవుడ్ హీరోలతో సినిమాలు చేసేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ఇప్పుడు తమిళ దర్శకులు కూడా మన కథానాయకులతో జత కట్టేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని కాంబోస్ సెట్ అవ్వగా.. మరిన్ని చర్చల్లో ఉన్నాయట. ఇప్పుడు కోలీవుడ్ టాప్ డైరెక్టర్స్.. తెలుగు స్టార్ హీరోస్ తో మూవీస్ ను తెరకెక్కిస్తున్నారు. అందులో ముందుగా తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీ గురించి చెప్పుకోవాలి. ప్రస్తుతం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో వర్క్ చేస్తున్నారు. నేడు బన్నీ సందర్భంగా వారిద్దరి ప్రాజెక్టుకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చేసింది. ఆ సమయంలో రిలీజ్ చేసిన వీడియో బట్టి మూవీ ఎలా ఉండనుందో ఇప్పటికే అందరూ ఊహించుకుంటున్నారు. అంతలా ఆకట్టుకుందీ వీడియో. ఆ తర్వాత టాలీవుడ్ యంగ్ టైగర్, జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబో దాదాపు సెట్ అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నీల్ మూవీ, వార్-2 కంప్లీట్ చేస్తున్న తారక్.. మరికొద్ది రోజుల్లో దిలీప్ తో మూవీ స్టార్ట్ చేయనున్నారట. రీసెంట్ గా తెలుగు నిర్మాత నాగ వంశీతో వర్క్ చేయనున్నట్లు తెలిపారు ఎన్టీఆర్. అది ఈ మూవీకేనని స్పష్టంగా తెలుస్తోంది. మరోవైపు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఆయనతో మూవీ చేసేందుకు కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన కూలీ సినిమా చేస్తుండగా.. అది అయ్యాక డార్లింగ్ మూవీ వర్క్ ను స్టార్ట్ చేయనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ప్రభాస్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. మొత్తానికి అట్లీ, నెల్సన్ దిలీప్ కుమార్, లోకేష్ కనగరాజ్.. ఇప్పుడు తెలుగు హీరోలతో బిజీ అయ్యారు.. బిజీ కానున్నారు.. అయితే ఒకప్పుడు కోలీవుడ్ లో తెరకెక్కిన కొన్ని సినిమాలు చూసి తెలుగు ఆడియన్స్ షాకయ్యేవారు. భారతీయుడు, ఒకే ఒక్కడు, శివపుత్రుడు, రోబో.. వంటి చిత్రాలు చూసి తెలుగులో ఇలాంటివి వస్తే బాగుండేవని అనుకునేవారు. కానీ ఇప్పుడు కోలీవుడ్ దర్శకులే టాలీవుడ్ హీరోలతో చేస్తున్నారు. అలా ట్రెండ్ ఫుల్ గా మారిపోయిందనే చెప్పాలి.

## ‘పెద్ది’ టీజర్లో అసలు సర్ప్రైజ్ ఇదే..



మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ‘పెద్ది’ టీజర్ రానే వచ్చింది. దీని గురించి టీం ముందు నుంచి ఇస్తున్న హైప్‌లో అతిశయోక్తి ఏమీ లేదని టీజర్ చూసిన అభిమానులు అంటున్నారు. చరణ్ లుక్, స్క్రీన్ ప్రెజెన్స్, డైలాగ్స్ అన్నీ అదిరిపోయాయి. ముఖ్యంగా లాస్ట్ షాట్ అయితే ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించేసింది. చరణ్ కెరీర్లో మరో ‘రంగస్థలం’ అవుతుందనే అంచనాలు ‘పెద్ది’ మీద ఉన్నాయి. ‘ఉప్పెన’ లాంటి లవ్ స్టోరీతో దర్శకుడిగా పరిచయం అయిన బుచ్చిబాబు సానా.. చరణ్ లాంటి పెద్ద స్టార్‌ను ఎలా హ్యాండిల్ చేస్తాడో అనే అనుమానాలు నిన్నటిదాకా ఉన్నాయి. ఫస్ట్ లుక్ అంచనాలకు తగ్గట్లు లేకపోవడంతో ఈ సందేహాలు బలపడ్డాయి. కానీ టీజర్‌తో బుచ్చిబాబు బాగానే మార్కులు కొట్టేశాడు. ఇక టీజర్లో మిగతా విషయాలన్నీ పక్కన పెడితే.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన అంశం ఒకటుంది. అదే.. బీజీఎం. ‘పెద్ది’కి సంగీత దర్శకుడు ఎవరో చెప్పకుండా.. టీజర్ బీజీఎం విని ఎవరు చేశారో చెప్పమంటే దేవిశ్రీ ప్రసాదో.. తమనో.. లేదంటే అనిరుధ్ రవిచందరో అని చెబుతామేమో. అలాంటి మాస్, కమర్షియల్ టచ్ ఉన్న బీజీఎం ఇచ్చాడు రెహమాన్. మామూలుగా పాటలు, బీజీఎం విషయంలో విషయంలో రెహమాన్‌ది సెపరేట్ స్టైల్. ఆయన మరీ మాస్‌గా మ్యూజిక్ చేయలేడని.. తెలుగు కమర్షియల్ సినిమాలకు ఆయన సంగీతం సూట్ కాదనే అభిప్రాయం చాలామందిలో ఉంది. మాస్ మూవీస్‌కు పని చేసేటపుడు అవసరమైతే కొంచెం కిందికి దిగాల్సి ఉంటుంది. మాస్‌ను ఉర్రూతూలగించడం కోసం వాయిద్యాల హోరు పెంచాల్సి ఉంటుంది. ఆ పని రెహమాన్ చేయడని అంటారు. ఒకప్పుడు ఎలివేషన్ సీన్లకు బాగానే మ్యూజిక్ ఇచ్చేవాడు కానీ.. గత కొన్నేళ్లలో అయితే రెహమాన్ ఈ తరహా చిత్రాలకు సంగీతం విషయంలో నిరాశపరుస్తూనే ఉన్నాడు. కానీ ‘పెద్ది’ టీజర్లో మాత్రం ఈ తరం మాస్ మ్యూజిక్ డైరెక్టర్లకు తానేమీ తీసిపోనని చాటాడు. టీజర్ ఆద్యంతం మంచి హుషారు పుట్టించే మాస్ బీజీఎం ఇవ్వడంతో మెగా ఫ్యాన్స్‌లో హుషారు వచ్చింది. ఈ సినిమాకు రెహమాన్ ఎందుకని అసంతృప్తి వ్యక్తం చేసిన వాళ్లు టీజర్ చూశాక థమ్సప్ చెబుతున్నారు.

సినిమాలో పాటలు, బీజీఎం విషయంలోనూ రెహమాన్ నుంచి ఇదే ఔట్ పుట్ కోరుకుంటున్నారు.

## అందాల స్టైలిష్ బాపు బొమ్మ ను చూశారా!

కన్నడ మూవీ పోర్కి సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణీత సుభాష్. కన్నడ సినిమాతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈమె ఆ తర్వాత తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం సినిమాల్లోనూ నటించింది. తెలుగులో 2010లో ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో, బావ సినిమాల్లో నటించింది. ఎంట్రీ ఇచ్చిన ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాల్లో నటించిన ఈమె ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. సోషల్ మీడియాలోనూ ఈమెకు మంచి క్రేజ్ దక్కింది. టాలీవుడ్‌లో ఈమె చేసిన అత్తారింటికి దారేది సినిమాతో మంచి గుర్తింపు దక్కింది. ఆ సినిమాలో సమంత హీరోయిన్‌గా నటించినప్పటికీ ఈమెకు గుర్తింపు లభించింది. పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఆ సినిమాలో ప్రణీతకు బాపు బొమ్మ అంటూ సాంగ్ ఉంది. ఆ పాట కారణంగా ప్రణీతను తెలుగు ప్రేక్షకులు బాపు బొమ్మ అంటూ పిలుచుకుంటూ ఉంటారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేస్తూ ఉండే ప్రణీత సుభాష్ తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేసింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి



ఫిజిక్ ఈమె సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అందుకే ఈ అమ్మడు తెలుగులో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటూ ఉంది. ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది అనిపించినా ముందు ముందు మరిన్ని సినిమాలు చేయనుందని ఈ ఫోటోలను చూస్తే అనిపిస్తుంది. ప్రణీత సుభాష్ సోషల్ మీడియాలో తాజాగా షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. మొబైల్‌లోని ఫోటోలను స్క్రోల్ చేస్తూ ఉంటే ఈ అందమైన ఫోటోలు కనిపించాయి అంటూ సరదాగా ఈ ఫోటోలను షేర్ చేసింది. ప్రణీతను ఈ క్లిక్స్‌లో చాలా స్టైలిష్ అవతార్‌లో చూడవచ్చు. అంతే కాకుండా ఈమె లుక్‌కు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. సోషల్ మీడియాలో ప్రణీత ఎప్పుడు ఫోటోలు షేర్ చేసినా కూడా వైరల్ కావడం మనం చూస్తూనే ఉంటాం. మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అయ్యాయి. అందాల స్టైలిష్ బాపు బొమ్మ ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఈ అమ్మడు ఆకట్టుకుంటోంది. స్టైలిష్ గాగుల్స్‌తో పాటు, సింపుల్ హెయిర్ స్టైల్‌తో బ్లూ షర్ట్ ధరించి ఒక స్పెషల్ ఫుడ్ ఐటెంను తింటున్న ప్రణీత సుభాష్ ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా ప్రణీత సుభాష్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ వచ్చింది. ఈసారి స్కిన్ షో చేయకున్నా క్యూట్ అందం కారణంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాదాపుగా ఆరున్నర మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న ఈ అమ్మడు షేర్ చేసే ప్రతి ఫోటోకు లక్షల్లో లైక్స్, కామెంట్స్ వస్తున్నాయి. ఈ ఫోటోలకు సైతం మంచి స్పందన దక్కింది. ఇంత అందంగా ఉన్న ప్రణీతకు మరికొంత కాలం సినిమాల్లో హీరోయిన్‌గా ఆఫర్లు రావాల్సిందే అంటూ ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## గుబులు రేపుతున్న రుహానీ ఫోజ్

రుహానీ శర్మ పరిచయం అవసరం లేదు. చిలసౌ చిత్రంలో సుశాంత్ సరసన నాయికగా నటించింది. మొదటి సినిమాతోనే ఈ బ్యూటీ తనదైన నట ప్రతిభతో ఆకట్టుకుంది. ఆ తర్వాత ‘డర్టీ హరి’ లాంటి బోల్డ్ మూవీలో అద్భుత పెర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. హిట్ - ది ఫస్ట్ కేస్ చిత్రంలో మరోసారి ఫ్యాన్స్ ని ఆకట్టుకుంది. తెలుగు-తమిళంలో వరుసగా అవకాశాలు అందుకుంది. నేచురల్ బ్యూటీ రుహానీ సోషల్ మీడియాల్లోను భారీ ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. ఈ హిమచల్ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తోంది. రుహానీ తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో గుబులు రేపుతోంది. ఈ భామ బ్లేజర్ లో మరోసారి తనలోని బోల్డ్ యాంగిల్ ని బయటపెట్టింది. భారీతనం నిండిన బ్లేజర్ ధరంచిన రుహానీ థై సొగసుల్ని ఎలివేట్ చేసింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా



షేర్ అవుతోంది. రుహానీ ఈ గెటప్‌లో స్టన్నింగ్ అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. ”వెలుగు నీడల మధ్య కొట్టుకుపోవడం, ఆలోచనలు కవిత్వంగా మారడం...” అంటూ ఈ ఫోటోషూట్ కి రుహానీ పోయెటిక్ క్యాప్షన్ ఇచ్చింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... రుహాని తదుపరి %-%మీట్ క్యూట్%-% అనే సిరీస్ లో నటించింది. అలాగే యోడ్లీ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ‘ఆగ్రా’ అనే చిత్రంతో బాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. ఈ సినిమాలో బోల్డ్ పెర్ఫామెన్స్ కి సంబంధించిన క్లిప్స్ ఇటీవల లీకయ్యాయి. దీనిపై చాలా మంది షాక్ కి గురవ్వడమే గాక ఈ సిరీస్ వివాదాల గురించి చర్చించుకున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ గా కనిపించే రుహానీ ఇలాంటి బోల్డ్ సీన్స్ లో నటించడం చర్చకు వచ్చింది. రుహానీ ఇటీవల టాలీవుడ్ కి దూరమైంది. ఇక్కడ సినిమాలేవీ ప్రకటించలేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536